

అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

22.11.2026
ఆదివారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 190
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

ఏపీని దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెడతాం

- ఆర్థిక అసమానతలు తగ్గేలా పరిపాలన లక్ష్యం
- సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి
- పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నాం
- మరో పదేళ్లలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి
- మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సీఎం
- అభ్యర్థులు ఇచ్చిన డబ్బులు వద్దంటూ
- కొందరు ఓటర్లు బాలెట్ బాక్సుల్లో డబ్బులు వేయడం సంతోషం
- నేను చేసే పనులకు సహకారం అందించాలని కోరుకుంటున్న

2లో..



అమరావతి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్
'ఎన్నికలను సంస్కరించాలనే ఉద్దేశంతో మున్సిపల్ ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నిక విధానం ద్వారా నిర్వహిస్తున్నాం. ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నాం. అభ్యర్థులు ఇచ్చిన డబ్బులు వద్దంటూ కొందరు ఓటర్లు బాలెట్ బాక్సుల్లో డబ్బులు వేయడం సంతోషాన్ని కలిగించింది. ఈ రీతిగానే ప్రజలు.. నేను చేసే పనులకు సహకారం అందించాలని కోరుకుంటున్నాను' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.



'ఏపీకి కరువు, తుపాన్లు శాపంగా మారాయి. కరువు, తుపాన్ల వల్ల కలిగే నష్టాలను శాశ్వతంగా అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకోసం రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తున్నాం. మార్చి నాటికి పోలవరం పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. పంట నష్టంతో రైతులు కుదేలవుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రెండు తుపాన్లు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. నిబద్ధతతో పనిచేసి ప్రాణ నష్టాన్ని తగ్గించాం. తుపాను బాధితులను, రైతులను ఆదుకుంటాం. రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను అమలుపరుస్తున్నాం. ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్నాం. ఆర్థిక అసమానతలు తగ్గించాలన్నదే మా లక్ష్యం. రాజధాని అమరావతిని బెస్ట్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు హద్దులు దాటొద్దు: సీఎం

'వైసీపీ పాలనలో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగింది. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసే ఎన్నికలకు అడ్డుపడ్డారు. హింసతో ఎన్నికల్లో గెలవాలనుకున్నారు. కానీ.. ప్రజలు వైసీపీ కుట్రలను తిప్పి కొట్టారు.

విశాఖ సీఐఐ సమ్మిట్‌తో ఏపీకి రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఏపీ బ్రాండ్ వాల్యూను ప్రమోట్ చేయగలిగాం
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు
- విశాఖకు సీఐఐ సమ్మిట్ కొత్త కాదని వెల్లడి



అమరావతి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్
విశాఖకు సీఐఐ సమ్మిట్ కొత్త కాదని.. సమ్మిట్ ద్వారా ఏపీ బ్రాండ్ వాల్యూను ప్రమోట్ చేయగలిగామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. 2లో..

కల్తీ మద్యం సేవించి 13 మంది మృతి

- మరో 300 మందికి పైగా అస్వస్థత
- ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో విషాదం



మణిపూర్, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్
మణిపూర్‌లో కల్తీ మద్యం సేవించి వందల మంది అస్వస్థతకు గురికాగా.. వీరిలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన చందేల్ జిల్లాలో చోటుచేసుకుంది. 2లో..

రైలు బోగీలో మహిళపై అత్యాచారం-హత్య

- 6 గంటల్లో పట్టించిన గోల్డ్ రింగ్!
- కన్యాకుమారి రేప్-మర్డర్ కేసు
- మృతురాలి గోల్డ్ రింగ్, సీసీటీవీ ఫుటేజీతో పట్టుబడ్డ నిందితుడు



2లో..

అన్న మరణాన్ని తట్టుకోలేక చెల్లెలు మృతి

నెల్లూరు జిల్లాలో తీవ్ర విషాదం

నెల్లూరు, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్
జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. అన్న మరణవార్తను తట్టుకోలేక చెల్లెలు కూడా ప్రాణాలు విడిచిన విషాద సంఘటన రెండు గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే అన్నాచెల్లెళ్లు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు.. బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పొదలకూరు మండలం చెర్లోపల్లికి చెందిన ప్రభాకర్ నాయుడు (65) శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం ప్రభాకర్ నాయుడు అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో మనుబోలు మండలం గొట్లపాలెంకు చెందిన ఆయన చెల్లెలు విమలమ్మ (50) అన్న అంత్యక్రియలకు హాజరయ్యారు. 2లో..

ఎడ్లబండి నుంచి బుల్లెట్ రైలు వరకు

- భారత్‌లో ఎన్నో మార్పులు!
- స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు గుర్తుగా డిటెన్షన్ క్యాంప్
- ఆత్మనిర్భర్ భారత్‌కు యువత ఆవిష్కరణలు బలం
- 1951లో ప్రారంభమైన ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రస్థానం
- దేశాభివృద్ధిలో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర
- 75 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని మోడీ ప్రశంసలు!

2లో..

ఖరగ్‌పూర్, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్
భారతదేశ అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల రంగాల్లో ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. దేశంలోనే తొలి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీగా గుర్తింపు పొందిన ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సంస్థ గత 75 ఏళ్లలో దేశ పరివర్తనలో విశేషమైన పాత్ర పోషించిందని ప్రశంసించారు. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మేదినీపూర్ జిల్లాలో ఉన్న ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ ఆడిటోరియంలో విద్యార్థులతో ప్రధాని మోడీ ముఖాముఖి మాట్లాడారు.

ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత

- పులిని సురక్షితంగా పట్టుకోవాలి
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి
- రంగంలోకి థర్మల్ డ్రోన్లు, ఏఐ కెమెరాలు



ఎన్టీఆర్ జిల్లా, నవంబర్ 21, అనంతజనశక్తి న్యూస్
ఎన్టీఆర్ జిల్లా ఏ.కొండూరు అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ సమీక్షించారు. పులి కదలికలు, దాని సంచార ప్రాంతాలు, ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. 2లో..

మత్స్యకారులకు భరోసా.. ఆక్వా రంగానికి కొత్త ఊపు!

- గంగపుత్రుల సంక్షేమానికి పెద్దపీట.. హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కట్టుబాటు 2లో..
- మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 1.34 లక్షల కుటుంబాలకు రూ. 268.60 కోట్ల సాయం
- ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి, నవంబర్ 21: అనంత జనశక్తి ప్రతినిధి
అలలతో పోరాటం.. ఆటుపోట్లతో సహవాసం.. ప్రాణాలను పణంగా పెట్టి సాగించే వేట.. రెక్కల కష్టాన్నే నమ్ముకుని జీవించే గంగపుత్రుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

డ్రగ్స్‌పై పోరుకు వెంకటేష్ మద్దతు



హైదరాబాద్, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్
యువత బంగారు భవిష్యత్తును చిదిమేస్తున్న మత్తుపదార్థాల మహమ్మారిని తరిమికొట్టేందుకు సినీ, రాజకీయ రంగాలు ఏకమవుతున్నాయి. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్ మహానగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'నషా ముక్త్ భారత్ యాత్ర' (హైదరాబాద్ వాక్)కు ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్ తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. 2లో..

రాయలసీమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం

- కర్నూలు జిల్లాలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్
- ఆసియాలోనే అతిపెద్ద బెవరేజ్ ప్లాంట్
- సంవత్సరం లోపే ప్రారంభించడం చాలా సంతోషం
- మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా వెల్లడి 2లో..



అమరావతి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్
కర్నూలు జిల్లాలో రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్.. ఆసియాలోనే అతిపెద్ద బెవరేజ్ ప్లాంట్‌ను శంకుస్థాపన చేసిన సంవత్సరం లోపే ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా తెలిపారు. ఇదే ఆంధ్రప్రదేశ్ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' పనితీరుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. 'కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లులో ఆసియాలోనే అతిపెద్ద బెవరేజ్ ప్లాంట్‌ను రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్రారంభించింది. శంకుస్థాపన చేసిన కేవలం 12 నెలల్లోనే రికార్డు స్థాయిలో ఉత్పత్తిని ప్రారంభించింది.

తిరుమల చరిత్రలోనే ఆల్ టైమ్ రికార్డ్

- 121 కిలోల బంగారు ఆభరణాల విరాళం
- అచంచలమైన భక్తిని చాటుకుంటూ
- ఓ దాత అపూర్వమైన కానుకను అందించేందుకు సిద్ధం
- 150 కోట్లు ఉంటుందని అధికారులు 2లో..





విశాఖ సీఐఐ సమ్మిట్‌తో ఏపీకి రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

శనివారం వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్‌ను కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా జరగని విధంగా విశాఖ సీఐఐ సమ్మిట్ జరిగిందని తెలిపారు. ఇంటర్ నేషనల్ స్టాండర్డ్‌తో సమ్మిట్‌ను నిర్వహించారని అన్నారు. సుమారు రూ.9 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని.. వచ్చిన పెట్టుబడులను గ్రౌండ్ అయ్యేలా చేశారని చెప్పారు.

దేశంలో వంద రూపాయలు వస్తే.. ఏపీకి 25 రూపాయిలు వస్తున్నాయని కేంద్రమంత్రి అన్నారు. ఫలితంగా ఇక్కడి బిడ్డలకు ఉపాధి వస్తుందని చెప్పుకొచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను హబ్‌గా తయారు చేస్తున్నామని..ప్రతిరోజూ విమాన సర్వీసులను పెంచుకుంటూ వెళ్తున్నామన్నారు. ఇప్పుడున్న ఎయిర్ సర్వీస్‌తో పాటు కొత్త ఎయిర్ సర్వీస్‌లను తీసుకొస్తున్నామని తెలిపారు. విశాఖ తిరుపతి, విశాఖ విజయవాడకు విమానాలను పెంచామని అన్నారు.

తిరుపతి నుంచి గల్ఫ్‌కు విమాన సేవలు ప్రారంభిస్తామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఏపీలో చిన్న ఎయిర్‌పోర్టులు పెంచుతామని చెప్పారు. శ్రీకాకుళం, కుప్పం సైట్ క్లియరెన్స్ ఇచ్చామన్నారు. 2024 కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు కూటమికి వస్తున్నాయన్నారు. శ్రీకాకుళం ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నానని.. ప్రచారంలో పాల్గొంటున్నట్లు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

కల్తీ మద్యం సేవించి 13 మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

కల్తీ మద్యం సేవించిన ఘటనలో నవంబర్ 18 నుంచి ఇప్పటివరకు కనీసం 13 మంది మరణించగా, 300 మందికి పైగా ఆసుపత్రుల పాలయ్యారని పోలీసులు తెలిపారు. బాధితులలో ఎక్కువ మంది చక్పికరోంగ్ , పరిసర ప్రాంతాలకు చెందినవారని, వీరిని ఇంఫాల్‌లోని జేఎన్ఐఎంఎస్, రిమ్స్, షిజా, బిబినా ఆసుపత్రులతో సహా పలు వైద్య కేంద్రాలలో చేర్పించినట్లు సమాచారం.

''కల్తీ మద్యంలో అనుమానిత మిథనాల్ విషప్రయోగం కారణంగా శుక్రవారం రాత్రి 9 గంటల వరకు 13 మంది మరణించినట్లు నివేదించారు.. అలాగే మరో 346 మంది ఆసుపత్రులలో చేరారు'' అఒక అధికారి పీటీఐకి తెలిపారు. ఈఘటనపై మణిపూర్ ముఖ్యమంత్రి యమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ స్పందించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

సోషల్ మీడియాలో దీనిపై పోస్ట్ చేసిన సీఎం ''చందేల్ జిల్లాలోని చక్పికరోంగ్ ప్రాంతంలో కల్తీ మద్యం సేవించి అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నాను'' అని తెలిపారు. అటు, చందేల్ జిల్లా యంత్రాంగం అత్యవసర సహాయక చర్యలను ముమ్మరం చేసిందని, పరిస్థితిని సమన్వయంతో పర్యవేక్షించడానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. తగినంత ఔషధాలు, ఆక్సిజన్ సరఫరాతో కూడిన నాలుగు ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను జిల్లాలో మోహరించినట్లు ఆ అధికారి చెప్పారు. ''షిజా ఆసుపత్రిలో 140 మందికి పైగా రోగులు, బబినా ఆసుపత్రిలో 41 మందికి పైగా రోగులు చేరారు.గత 48 గంటల్లో మృతుల సంఖ్య 11కి చేరుకుంది. వైద్యుల నిశిత పర్యవేక్షణలో రోగులకు వైద్య పరీక్షలు, చికిత్స జరుగుతోంది"అని ఆయన తెలిపారు.

''క్షేత్రస్థాయిలో చికిత్స, సహాయక చర్యలను బలోపేతం చేయడానికి అత్యవసర మందులతో పాటు జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్ నేతృత్వంలోని వైద్య బృందం చందేల్ జిల్లాకు బయలుదేరింది'' అని తెలిపారు. ''ప్రభుత్వం దీనిపై విచారణ జరుపుతుందని, దోషులను శిక్షిస్తుందని'' పేర్కొన్నారు. ఆసుపత్రిలో చేరిన రోగులలో వికారం, వాంతులు, కడుపునొప్, ఇతర సమస్యల లక్షణాలు కనిపించాయని షిజా హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ చేతన్ .కె పేర్కొన్నారు.కొందరు రోగులకు హీమోడయాలసిస్ కూడా జరుగుతోందని ఆయన చెప్పారు. జేఎన్ఐఎంఎస్ డాక్టర్ ఒకరు మాట్లాడుతూ.. ''ఆసుపత్రిలో చేరిన వారిలో స్థానిక మద్యం సేవించి, భయంతో ఆసుపత్రికి వచ్చిన వారు కూడా చాలా మంది ఉన్నారు'' అని వివరించారు. ''మిథనాల్ విషప్రయోగం కారణంగా ఇప్పటివరకు షిజా హాస్పిటల్స్‌లో 312 మందికి పైగా రోగులకు చికిత్స అందజేశాం'' అని షిజా హాస్పిటల్స్ వెల్లడించింది.అనుమానిత కల్తీ మద్యాన్ని కక్చింగ్ జిల్లాలోని సుగ్ను నుంచి కొనుగోలు చేసినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి.

మరింత మంది బాధితులను మెరుగైన వైద్యం కోసం ఇంఫాల్‌కు తీసుకొచ్చే ఏర్పాట్లు చేస్తున్నామని, పరిస్థితిని పరిశీలించాలని ముఖ్యమంత్రిని కోరామని చందేల్ ఎమ్మెల్యే ఎస్.ఎస్. ఒలిష్ అన్నారు. ఆమె మాట్లాడుతూ.. '' నేను వ్యక్తిగతంగా సీఎం యుమ్నమ్ ఖేమ్‌చంద్‌తో మాట్లాడి, చందేల్‌ను ప్రభావితం చేస్తున్న పరిస్థితిని పరిశీలించాలని కోరాను. ఆయన సానుకూలంగా స్పందించి, షిజా ఆసుపత్రిలోని రోగులను పరామర్శించారు..తర్వాత బబినా ఆసుపత్రిని కూడా సందర్శిస్తారు'' అని అన్నారు.

''అంతేకాకుండా, ముఖ్యంగా చక్పికరోంగ్‌లో పార్టీ కార్యకర్తలు నిరంతరం పనిచేస్తూ, రోగులను ఇంఫాల్‌కు తీసుకురావడానికి వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు'' అని ఆమె తెలిపారు.బిష్ణుపూర్, సేనాపతి, కక్చింగ్, తౌబల్ జిల్లా యంత్రాంగాలు ప్రజా హెచ్చరికలను జారీ చేస్తూ, ''స్థానికంగా తయారు చేసిన మద్యం లేదా అనుమానాస్పద, ధ్రువీకరించని మద్యం పానీయాలను సేవించకుండా ఉండాలని'' ప్రజలను కోరాయి.

అన్న మరణాన్ని తట్టుకోలేక చెల్లెలు మృతి

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో ఆప్యాయంగా ఉండే అన్నను కోల్పోయిన బాధతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య అన్నకు తుది వీడ్కోలు పలుకుతున్న సమయంలోనే ఈ విషాదం చోటుచేసుకోవడం అందరినీ కలచివేసింది.

అన్నకు అంతిమ వీడ్కోలు పలుకుతుండగానే చెల్లెలి మృతి..

అన్న అంత్యక్రియలు జరుగుతున్న సమయంలో విమలమ్మ ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండెపోటు రావడంతో అక్కడున్న కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన వారు ఆమెను చికిత్స నిమిత్తం పొదలకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విమలమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అప్పటివరకు అన్న మృతితో విషాదంలో ఉన్న కుటుంబంలో మరో పెను విషాదం అలుముకుంది. ఒకవైపు అన్న మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తుండగా, మరోవైపు చెల్లెలు కూడా ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఏపీని దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెడతాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల విశ్వాసం లేకపోతే.. రాజకీయ పార్టీలకు మనుగడే ఉండదు. 2024 ఎన్నికల్లో ప్రజలకు మాకు శక్తిని ఇచ్చారు. నిన్నటి ఎన్నికల్లో తిరుగులేని నమ్మకం కల్పించారు. కొందరి ఎమ్మెల్యేల పనితీరును ప్రజలు తిరస్కరించారు. ప్రజాభిప్రాయానికి కట్టుబడి ఉంటాం. కొన్ని చోట్ల వచ్చిన అననుకూల తీర్పుపై రివ్యూ చేస్తున్నాం. ఆయా ఎమ్మెల్యేలను కూడా పిలిచి మాట్లాడుతున్నాం. ఆ ఎమ్మెల్యేల తమ పనితీరును మార్చుకోకపోతే చర్యలు తప్పవు. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా హద్దులు దాటొద్దు' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

నేనెప్పుడూ లైన్ దాటలేదు: సీఎం చంద్రబాబు

'షర్మిల పెళ్లి కార్డు ఇస్తే.. సాక్షి పత్రికలో దారుణంగా రాశారు. షర్మిల వివాహానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నన్ను ఆహ్వానించారు. షర్మిల పెళ్లికి నేను కూడా వెళ్లాను. 1983 వరకు వైఎస్ నాకు బెస్ట్ ఫ్రెండ్. రాజకీయంగా విభేదించినా.. నేనెప్పుడూ లైన్ దాటలేదు. కానీ.. జగన్ సొంత చెల్లిపై కూడా దుర్మార్గంగా నిందలు వేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారంలో ఉన్నా.. వైసీపీ చేసేది అరాచకం' అని ముఖ్యమంత్రి జగన్‌ను దుయ్యబట్టారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి.. చంద్రబాబు

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలపై అధికారులతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం సమీక్షనిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు గోదావరి పుష్కరాల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ పుష్కరాలకు 10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేశారు. పుష్కరాల కోసం 22 శాఖల పరిధిలో రూ.3,723.69 కోట్ల అంచనా వ్యయంతో 4,862 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు రూ.2,051.70 కోట్ల విలువైన 2,260 పనులకు పరిపాలనా అనుమతులు దక్కాయి. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో పుష్కరాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.స్వచ్ఛంధ సంస్థలు,యువత,మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని ఆయన సూచించారు. అన్ని శాఖలు జిల్లాల వారీగా పనుల పురోగతి, నిధుల వినియోగం వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఇప్పటి నుంచే పుష్కర విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ, సమన్వయ సమావేశాలపై దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.

పరివాహక ప్రాంతంలో 440 ఘాట్లు

గోదావరి పరివాహక ప్రాంతంలో 440 ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రచించారు.దాదాపు రూ.649.70 కోట్ల విలువైన 659 పనులు ఇప్పటికే ప్రారంభంకాగా..రూ.25.53 కోట్ల విలువైన 69 పనులు పూర్తయ్యాయి. తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య సిబ్బంది, వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, లైటింగ్ పనులకు రూ.464 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు చేశారు. పుష్కరాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. వాహనాల క్రమబద్ధీకరణ కోసం 268.12 కిలోమీటర్ల మేర బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. పుష్కరాల కోసం 4,000 ప్రత్యేక బస్సులు, 649 గ్రీన్ బస్సులు నడిపనున్నారు. అలాగే 1,560 ప్రత్యేక రైలు సర్వీసులు నిర్వహించేలా రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫాం, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల అభివృద్ధి చేయనున్నారు.

రైలు బోగీలో మహిళపై అత్యాచారం-హత్య

చెన్నై, నవంబర్ 21, అనంతజనశక్తి న్యూస్

తమిళనాడు కన్యాకుమారి జిల్లాలో సంచలనం సృష్టించిన మహిళ అత్యాచారం, హత్య కేసులో పోలీసులు నిందితుడ్ని కేవలం 6 గంటల్లో పట్టుకున్నారు. నిందితుడిని పట్టుకోవడానికి ''బంగారు ఉంగరం'' కీలకంగా మారింది. గుర్తుతెలియని మహిళను గుర్తించేందుకు ఆ ఉంగరంపై ఉన్న హాల్ మార్క్ వివరాలు పోలీసులకు ఉపయోగపడ్డాయి. కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ రైల్వే యార్డులో నిరుపయోగంలో ఉన్న రైల్వే బోగీలో 54 ఏళ్ల మహిళ మృతదేహం లభ్యమైంది. మహిళపై అత్యాచారం, హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. నవంబర్ 13 అర్ధరాత్రి ఈ నేరం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

మృతురాలి వివరాలు చెప్పిన గోల్డ్ రింగ్..

మృతురాలి వివరాలను ముందుగా తెలుసుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. ఈక్రమంలో పాము ఆకారంలో ఉన్న బంగారు ఉంగరం వారి దృష్టిలో పడింది. దానిపై ఉన్న హాల్ మార్క్ వివరాలే కేసులో దర్యాప్తును ముందుకు తీసుకెళ్లాయి. ఉంగరంపై ఉన్న హాల్ మార్క్ ఆధారంగా దాని మూలాలు గుజరాత్‌లో గుర్తించారు. దీనిని అమ్మిన వ్యాపారిని సంప్రదించగా.. దీనిని ఛత్తీస్‌గఢ్ లోని రాయ్‌పూర్‌లో ఉన్న ఓ రిటైలర్‌కు సరఫరా చేసినట్లు వెల్లడిపంచారు. దీని ఆధారంగా మహిళ మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గత మూడు నెలలుగా ఆమె స్వస్థలంలో కనిపించకుండా పోయిందనట్లు తెలిసింది. ప్రస్తుతం ఆమె భర్త, పిల్లలు కన్యాకుమారికి బయలుదేరారు.

6 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు..

మృతురాలి వివరాలు తెలుసుకోవడంతో పాటు ఈ దారుణానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అత్యంత వేగంగా గుర్తించారు. తొలుత ముగ్గురు అనుమానితులపై పోలీసులు దృష్టి పెట్టారు. రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీ ఈ కేసులో కీలకంగా మారింది. తెల్లటి దుస్తులు ధరించిన ఓ వ్యక్తి రైల్వే బోగీ నుంచి బయటకు వస్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడిని రైల్వే ప్లాట్‌ఫామ్‌పై తిరిగే బిచ్చగాడిగా గుర్తించారు. గతంలో అతడికి మృతురాలు కొన్ని సందర్భాల్లో ఎదురైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆమెను నిరుపయోగంగా ఉన్న బోగీలోకి తీసుకెళ్లి బలవంతంగా అత్యాచారం చేసి, హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడు ధరించిన, రక్తం మరకలు ఉన్న చొక్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును వేగంగా ఛేదించినందుకు తమిళనాడు రైల్వే డీజీపీ కె. వన్నియా పెరుమాళ్ పోలీసుల దర్యాప్తును, ముఖ్యంగా రైల్వే ఎస్పీ కృషిని అభినందించారు.నిందితుడు మహిళపై లైంగిక దాడికి పాల్పడిన అనంతరం చేతులతో దాడి చేసి, ఛాతీపై తన్నడం ద్వారా హత్య చేసినట్లు విచారణలో అంగీకరించాడని పోలీసులు తెలిపారు.

ఎడ్లబండి నుంచి బుల్లెట్ రైలు వరకు

(మొదటి పేజీ తరువాయి)

'75 Voices for Viksit Bharat' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ముచ్చటించి వారి ఆలోచనలు, ఆవిష్కరణలను తెలుసుకున్నారు.

ఎడ్లబండి నుంచి బుల్లెట్ రైలు వరకు.. భారత్‌లో ఎన్నో మార్పులు!

ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ ప్రధాని మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''గత 75 ఏళ్లలో భారత్ ఎన్నో మార్పులను చూసింది. ఎడ్ల బండి ప్రయాణం నుంచి బుల్లెట్ రైలు వరకు, ఉత్తరాల నుంచి సోషల్ మీడియా వరకు దేశం ఎంతో అభివృద్ధి చెందింది. ఈ ప్రతి మార్పులోనూ దేశంలోనే తొలి ఐఐటీగా ఐఐటీ ఖరగ్‌పూర్ కీలక పాత్ర పోషించింది'' అని పేర్కొన్నారు. ఈ సంస్థ అభివృద్ధికి కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థులతో మాట్లాడిన ప్రధాని.. విద్యార్థి జీవితంలో గుర్తుండిపోయే అనుభవాల గురించి ప్రస్తావించారు. ''ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని కొన్ని జ్ఞాపకాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. ఇతర విద్యాసంస్థల్లో హాస్టళ్లు ఉంటే, ఇక్కడ ప్రత్యేకంగా హాల్స్ ఉంటాయి. ప్రతి విద్యార్థికి తమ హాల్‌పై ప్రత్యేకమైన గర్వం ఉంటుంది. అది ఈ సంస్థ ప్రత్యేకత'' అని మోదీ అన్నారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా కొత్త ఆలోచనలు, సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలతో దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు గుర్తుగా డిటెన్షన్ క్యాంప్

ఐఐటీ ఖరగ్‌పూర్ ఉన్న ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యత కూడా ఉందని ప్రధాని మోదీ గుర్తుచేశారు. గతంలో ఈ ప్రాంతంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను నిర్బంధించే డిటెన్షన్ క్యాంప్ ఉండేదని పేర్కొన్నారు. ''ఇక్కడి నుంచే అనేక ఆలోచనలకు బలం లభించింది. జాతీయోద్యమానికి స్ఫూర్తి కలిగింది. ఒకప్పుడు ఈ ప్రాంతంలోని డిటెన్షన్ క్యాంపుల్లో స్వాతంత్ర్య సమర యోధులు ఉండేవారు. వారు స్వతంత్ర భారతదేశం గురించి, దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడం గురించి చర్చించి ఉంటారు. వారి ఆలోచనలు నేటికీ మనకు స్ఫూర్తినిస్తాయి'' అని మోదీ వ్యాఖ్యానించారు.

ఆత్మనిర్భర్ భారత్‌కు యువత ఆవిష్కరణలు బలం

ఒకప్పుడు దేశానికి స్వాతంత్ర్యం కావాలని కలలు కన్న స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితోనే నేడు యువత దేశాన్ని స్వావలంబన దిశగా నడిపిస్తున్నారని ప్రధాని అన్నారు. ''దశాబ్దాల క్రితం ఇదే ప్రాంతంలోని డిటెన్షన్ క్యాంపులు దేశానికి స్వాతంత్ర్యం కావాలని కోరుకున్న భారతీయుల సంకల్పానికి సాక్ష్యంగా నిలిచాయి. నేడు ఇదే ప్రాంతంలో ఐఐటీ విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారు. వారి ఆలోచనలు, పరిశోధనలు భారతదేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చేందుకు శక్తినిస్తున్నాయి'' అని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో యువత సాధిస్తున్న విజయాలు భవిష్యత్తులో భారత్‌ను ప్రపంచ స్థాయిలో మరింత బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

1951లో ప్రారంభమైన ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రస్థానం

ఐఐటీ ఖరగ్‌పూర్ 1951లో స్థాపించబడింది. దేశంలో మొట్టమొదటి ఐఐటీగా ఇది గుర్తింపు పొందింది. ఇంజినీరింగ్, సైన్స్, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణల రంగాల్లో ఎంతోమంది ప్రతిభావంతులను తయారు చేసింది. ఈ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, గవర్నర్ ఆర్.ఎన్. రవి, కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

ఏ.కొండూరు పరిసర అటవీ ప్రాంతాల్లో సంచరిస్తూ స్థానికులకు భయాందోళనకు గురి చేస్తున్న పులిని సురక్షితంగా బంధించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. పులి కదలికలను పసిగట్టేందుకు థర్మల్ డ్రోన్లు, ఏఐ ఆధారిత కెమెరా ట్రాప్‌లు వంటి అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించాని అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

అలాగే పులి కదలికలను నిరంతరం ట్రాక్ చేసేందుకు థర్మల్ డ్రోన్లు, ఏఐ కెమెరా ట్రాప్‌లను విస్తృతంగా వినియోగించాలని, స్థానిక అటవీ బృందాలతో సమన్వయం చేసుకుంటూ HANUMAN బృందాలతో ముమ్మరంగా గస్తీ ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఈ ఆపరేషన్‌ను పీసీసీఎఫ్, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ స్వయంగా పర్యవేక్షించాలన్నారు. అవసరాన్ని బట్టి ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక ట్రాకింగ్, రెస్క్యూ నిపుణుల టీమ్‌లను రప్పించి ఆపరేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. అలాగే పులి సంచార మార్గాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పరిసర గ్రామాలకు తెలియజేయాలని సూచించారు. రైతులు, పశువుల కాపరులు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తం చేస్తూ భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు.

అధికారులు నిర్వహించే ఈ ఆపరేషన్‌లో ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే, పులికి కూడా ఎలాంటి హాని జరగక్కుండా వన్యప్రాణి సంరక్షణ రూల్స్ ప్రకారం సురక్షితంగా పట్టుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు.



మత్స్యకారులకు భరోసా.. ఆక్వా రంగానికి కొత్త ఊపు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకారులు, ఆక్వా రైతులు, మత్స్యరంగంపై ఆధారపడిన కుటుంబాలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రానికి ఉన్న 1,053 కిలో మీటర్ల సముద్ర తీరం అపారమైన మత్స్య సంపదకు నిలయమని, లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మత్స్యకారుల సంక్షేమం, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వేట నిషేధ సమయంలో రూ.268.60 కోట్ల ఆర్థిక భరోసా

వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులకు గతంలో రూ.10 వేలుగా ఉన్న సహాయాన్ని రూ.20 వేలకు పెంచామని మంత్రి తెలిపారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా 202627లో తొలి విడతగా 1,28,388 కుటుంబాలకు రూ.256.776 కోట్లు విడుదల చేయగా, రెండో విడతలో మరో 5,910 కుటుంబాలకు రూ.11.82 కోట్లు మంజూరు చేశామన్నారు. మొత్తంగా 1,34,298 కుటుంబాలకు రూ.268.60 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. సంప్రదాయ మత్స్యకారుల హక్కులను దెబ్బతీసిన జీవో 217ను రద్దు చేసి సహకార సంఘాల ప్రయోజనాలను పరిరక్షించామని చెప్పారు. మత్స్యకారుల జీవనోపాధికి భంగం కలిగించే నిర్ణయాలను సహించబోమని స్పష్టం చేశారు.

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ.. పెట్టుబడి భారం తగ్గింపు

రాష్ట్రంలో సుమారు 2.16 లక్షల మంది రైతులు 5.79 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారని మంత్రి తెలిపారు. అర్హులైన నమోదిత రైతులకు జోన్, నాన్ జోన్ పరిమితులతో సంబంధం లేకుండా యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందించే నిర్ణయం తీసుకున్నామన్నారు. మత్స్యకారుల పడవలకు లీటరు డీజిల్‌పై రూ.9 రాయితీ అందిస్తున్నామని, 202627 బడ్జెట్‌లో ఇందుకోసం రూ.52 కోట్లు కేటాయించామని చెప్పారు. 200 యాంత్రిక పడవలను 60 శాతం రాయితీతో అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నిర్ణయాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు.

ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనతో అభివృద్ధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన (PMMSY) కింద రాష్ట్రంలో రూ.2,328.89 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని మంత్రి తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.681.38 కోట్లని చెప్పారు. పథకంలోని 41 రకాల కార్యక్రమాల ద్వారా 5,23,269 యూనిట్లు మంజూరు కాగా, 4,58,139 యూనిట్ల అమలు ప్రారంభమైందన్నారు. జీవనోపాధి, పోషకాహార సహాయానికి సంబంధించిన 4,42,720 యూనిట్లతో పాటు 776 ఐస్ బాక్స్ మోటారు సైకిళ్లు, 2,269 మినీ ఫిష్ కియోస్క్‌లు, 8,144 కమ్యూనికేషన్, ట్రాకింగ్ పరికరాల యూనిట్ల అమలు ప్రారంభమైనట్లు వివరించారు. మిగిలిన యూనిట్లను వేగవంతం చేస్తామని తెలిపారు. మత్స్య ఉత్పత్తుల నిల్వ, రవాణా, మార్కెటింగ్ కోసం 3 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 16 కోల్డ్ స్టోరేజీ, ఐస్ ప్లాంట్లు, 5 మేత తయారీ ప్లాంట్లు, ఒక సమగ్ర ఆక్వా పార్కు వంటి ప్రాజెక్టులకు ఆమోదం లభించిందన్నారు. వీటి ద్వారా మత్స్యకారులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని చెప్పారు.

చిన్న మత్స్య పరిశ్రమలకు రూ.2 కోట్ల వరకు గ్రాంట్

ప్రధానమంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ యోజన (PMMKSSY) కింద దేశవ్యాప్తంగా రూ.6 వేల కోట్ల అంచనా వ్యయంతో మత్స్యరంగ అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నారని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన సూక్ష్మ పరిశ్రమలకు 25 శాతం లేదా గరిష్ఠంగా రూ.35 లక్షలు, ఎస్సీ, ఎస్టీ, మహిళల యాజమాన్యంలోని సూక్ష్మ పరిశ్రమలకు 35 శాతం లేదా రూ.45 లక్షల వరకు పనితీరు ఆధారిత గ్రాంట్‌కు అవకాశం ఉందన్నారు. చిన్న పరిశ్రమలకు కేటగిరీని బట్టి రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకు, మత్స్య సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు, మత్స్యరైతు ఉత్పత్తిదారుల సంస్థలకు గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు గ్రాంట్ పొందే అవకాశం ఉందని వివరించారు.

మత్స్యకారుల ప్రాణాలకు బీమా భద్రత

సముద్రంలో చేపల వేట సమయంలో ప్రమాదాలకు గురయ్యే మత్స్యకారుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. వేట సమయంలో మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల వరకు ఎక్స్‌గ్రేషియా అందించే విధానం అమల్లో ఉందన్నారు. 202627లో 2,84,888 మంది మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. పథకం నిబంధనల ప్రకారం ప్రమాద మరణం లేదా పూర్తిస్థాయి శాశ్వత

అమెరికాకు ఏమోగానీ... నాకైతే పుతిన్ మిత్రుడు: ట్రంప్



వాషింగ్టన్: రష్యా అధ్యక్షుడు పుతిన్ తనకు మంచి స్నేహితుడేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. కానీ అమెరికాకు కూడా ఆయన స్నేహితుడా కాదా అన్నది చెప్పలేనని ట్రంప్ స్పష్టం చేశారు. చైనాలో శిఖరాగ్ర భేటీ అనంతరం స్వదేశానికి తిరిగి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ''పుతిన్‌కు ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపేయాలనే ఉంది. కానీ ఎలా ముగించాలో తెలియని విధంగా పుతిన్, జెలెన్‌స్కీలు అందులో ఇరుక్కుపోయారు. ఇద్దరూ ఒకరినొకరు ద్వేషించుకుంటున్నారు. అందుకే పరిష్కారానికి మేం సాయం చేస్తున్నాం'' అని ట్రంప్ అన్నారు. శాంతిసాధనకు ప్రపంచ అగ్రనేతలతో సత్సంబంధాలు ముఖ్యమన్నారు. ''శక్తిమంతమైన దేశాధినేతలతో సత్సంబంధాలున్న వ్యక్తి (తాను) ఉన్నందుకు మీరంతా అదృష్టవంతులు'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

అమెరికా కంపెనీల నుంచి చైనాకు 9లక్షల ఏఐ చిప్‌లు

చైనా గూఢచారితో ఎన్విడియా మాజీ సీఈవో జెన్సన్ హువాంగ్ సన్నిహిత బంధం వ్యవహారం టెక్ ప్రపంచంలో తీవ్ర దుమారం రేపింది. చైనాకు ఏఐ చిప్‌ల నుతరలించేందుకే ఆ మహిళ జెన్సన్‌కు దగ్గరైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామాల వేళ తాజాగా ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ కార్యవర్గం అనుమతితో అమెరికా కంపెనీల నుంచి చైనాకు దాదాపు 9లక్షల ఏఐ చిప్‌ల ఎగుమతి జరిగినట్లు తెలిసింది. ఈ మేరకు యూఎస్ హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ విడుదల చేసిన లైసెన్సింగ్ డేటాలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2025 డిసెంబరు నుంచి 2026 మే నెల మధ్య ఎన్విడియా, ఏఎండీ సంస్థలు 8,79,000 చిప్‌లను చైనా కంపెనీలకు అందించినట్లు డేటాలో ఉంది.

జెన్సన్ హువాంగ్‌కు రెండో ఛాన్స్ ఇవ్వాలి: ట్రంప్



ఎన్విడియా మాజీ సీఈఓ జెన్సన్ హువాంగ్ కు మళ్లీ సంస్థ పగ్గాలు అప్పగించాలని పలువురు ఉద్యోగులు, టెక్ అధినేతలు డిమాండ్ చేస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం జెన్సన్ పునర్నియామకానికి మద్దతు తెలిపారు. ఆయనకు సెకండ్ ఛాన్స్ ఇచ్చి.. సీఈఓగా తిరిగి నియమించుకోవాలని ఎన్విడియా బోర్డుకు సూచించారు. ప్రపంచంలోని అత్యంత మేధావులలో ఒకరైన జెన్సన్ సేవలు టెక్ రంగానికి అవసరమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. అమెరికాకు ఎన్విడియా చాలా ముఖ్యమైన కంపెనీ అని ట్రంప్ పేర్కొన్నారు.
''కొన్ని తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పటికీ జెన్సన్ మంచి మనిషి. ఆయన తన తప్పును అంగీకరించి, సంస్థకు క్షమాపణ చెప్పాలని, మళ్లీ విధుల్లో చేరాలని నేను కోరుకుంటున్నా. ఎందుకంటే ఆయన అద్భుతమైన, అత్యంత అధునాతన చిప్‌లను రూపొందించారు. ఇటీవల జరిగిన శిఖరాగ్ర సమావేశంలో జెన్సన్ గురించి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో నేను చర్చించాను. ఆయన కూడా జెన్సన్‌ను గొప్ప మేధావిగా అభివర్ణించారు'' అని ట్రంప్ వెల్లడించారు.
మూడో స్థానం నుంచి పడిపోయిన ఎన్విడియా.. జెన్సన్ తొలగింపు, ఇతర కారణాల నేపథ్యంలో ఎన్విడియా షేర్లు శుక్రవారం మరింత క్షీణించాయి. దాని మార్కెట్ విలువ దాదాపు 3.4 ట్రిలియన్ డాలర్లకు పడిపోయింది. దీంతో అమెరికాలోని మూడో అత్యంత విలువైన కంపెనీగా తన స్థానాన్ని కోల్పోయింది. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్.. ఎన్విడియాను అధిగమించింది. యాపిల్, మైక్రోసాఫ్ట్ అత్యంత విలువైన కంపెనీలుగా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

చమురు ట్యాంకర్ల పేలుళ్ల మధ్య.. హర్మూజ్‌ను ఈదిన స్విమ్మర్



లండన్: బ్రిటిన్‌కు చెందిన స్విమ్మర్ లూయిస్ ప్యూ హర్మూజ్ జలసంధి లోని కొంత భాగాన్ని ఈదారు. ఓ వైపు జలసంధిలోని ట్యాంకర్లపై దాడులు, పేలుళ్లు చోటుచేసుకుంటుండగా మరోవైపు గడ్డకట్టే చలిలో, సముద్ర జలాల్లో ఈత కొట్టడం సవాలుతో కూడుకున్న విషయమే. అయినప్పటికీ ఇరాన్ యుద్ధం వల్ల సముద్రంలోని జీవజాలం, స్థానిక వన్యప్రాణులకు కలుగుతున్న ముప్పు గురించి ప్రపంచానికి తెలియజేయడానికి ఆయన మూడు రోజుల పాటు హర్మూజ్‌లో ఈతకొట్టారు. జలసంధి దక్షిణ కొనలో ఉన్న ముసందమ్ ద్వీపకల్పం నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించి.. కేప్ ఆఫ్ హర్మూజ్‌ను చుట్టి, మొత్తం 15 కిలోమీటర్లు ఈదారు.
'సోమవారం నేను నీటిలోకి దిగిన కొద్ది నిమిషాలకే, సముద్రాన్ని కుదిపేసేలా రెండు పెద్ద పేలుడు శబ్దాలు విన్నాను. చూస్తే.. సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ఆయిల్ ట్యాంకర్‌పై దాడి జరిగింది. తర్వాత ఆ ప్రాంతంలో పలు యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టడం కనిపించింది. అయినప్పటికీ ఇంతటి అందమైన సముద్రాన్ని పాడు కాకుండా కాపాడాలని ప్రపంచానికి పిలుపునివ్వడానికి నా ప్రయాణాన్ని కొనసాగించాను. సముద్ర జలాల్లో ఎన్నో నౌకలు ధ్వంసమయ్యాయి. భారీగా చమురు ఒలికి జలాలపై తెట్టలు కట్టింది. చమురు కాలుష్యం సముద్ర జీవులకు, మడ అడవులకు, పగడపు దిబ్బలకు దీర్ఘకాలిక ముప్పుగా పరిణమిస్తోంది. ఇవన్నీ తిరిగి సాధారణ స్థితికి రావడానికి కొన్ని దశాబ్దాలు పట్టొచ్చు' అని లూయిస్ పేర్కొన్నారు.
వాతావరణ మార్పులు, కాలుష్యం నుంచి సముద్ర పర్యావరణాన్ని, జీవులను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ..లూయిస్ అంటార్కిటికా, ఎర్ర సముద్రం, ఇంగ్లిష్ ఛానల్ సహా పలు సముద్ర జలాల్లో ఈత కొడుతూ అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన నదుల ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఆయన 2023లో హడ్సన్ నదిని ఈదారు. వాతావరణ మార్పులు, కాలుష్యం నుంచి సముద్ర పర్యావరణాన్ని, జీవులను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ..లూయిస్ అంటార్కిటికా, ఎర్ర సముద్రం, ఇంగ్లిష్ ఛానల్ సహా పలు సముద్ర జలాల్లో ఈత కొడుతూ అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన నదుల ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఆయన 2023లో హడ్సన్ నదిని ఈదారు.

రైల్వే యార్డ్‌లో హత్యాచారం.. బాధితురాలి ఆచూకీ చెప్పిన ఉంగరం



చెన్నై: ఏమైందో ఏమో గానీ.. ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లి పోయింది. రైల్వే స్టేషన్‌లో తచ్చాడుతుండటం గమనించిన ఓ దుండగుడు.. యార్డ్‌లో నిలిపిన కోచ్‌లో ఆమెపై హత్యాచారానికి పాల్పడ్డాడు. దర్యాప్తు ప్రారంభించిన ఆరుగంటల్లోనే నిందితుడిని పోలీసులు గుర్తించినప్పటికీ.. బాధితురాలు ఎవరన్న విషయం తెలుసుకునేందుకు చాలా శ్రమించాల్సి వచ్చింది. చివరికి ఆమె చేతికి ఉన్న ఉంగరం ద్వారా చిరునామా కనిపెట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వివరాల్లోకి వెళ్తే..
తమిళనాడులోని కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ రైల్వే స్టేషన్ యార్డులో ఉన్న కోచ్‌లో ఓ మహిళపై దుండగుడు అత్యాచారం చేసి, ఆ తర్వాత హత్య చేశాడు. నవంబర్ 13 రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. కోచ్‌ను శుభ్రం చేసి.. వేరే ట్రైన్‌కు తగిలించేందుకు వెళ్లిన రైల్వే సిబ్బంది మృతదేహాన్ని చూసి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించగా అత్యాచారం జరిగినట్లు తేలింది. దర్యాప్తు ప్రారంభించిన రైల్వే పోలీసులు అక్కడి సీసీటీవీ కెమెరాలు పరిశీలించి.. కేవలం ఆరు గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆమె ఎవరో తెలుసుకునేందుకు ఆమె చేతికి ఉన్న ఉంగరం తప్ప.. పోలీసులకు ఆధారాలేమీ లభించలేదు. దానిపై ఉన్న హాల్ మార్క్ ఆధారంగా గుజరాత్‌లో తయారైనట్లు గుర్తించిన అధికారులు.. ఆభరణాల తయారీదారుతో మాట్లాడారు. దానిని ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో వ్యాపారికి విక్రయించినట్లు చెప్పడంతో.. ఆ దుకాణానికి వెళ్లి.. ఆరా తీశారు. ఉంగరం కొనుగోలు సమయంలో ఇచ్చిన పాన్ నంబర్ ఆధారంగా వివరాలు రాబట్టి.. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం రాయ్‌పుర్‌లో ఉన్న మృతురాలి భర్త, పిల్లలు కన్యాకుమారికి బయల్దేరారు.

సోనియా మారుతీ ఎండీ ఎలా అయ్యారు?: నిషికాంత్ దూబె



కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై భాజపా ఎంపీ నిషికాంత్ దూబె తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమె విదేశీయురాలు అయినప్పటికీ.. గతంలో నిబంధనలు ఉల్లంఘించి మారుతీ ఎండీ అయ్యారని పేర్కొన్నారు. 1970 నాటి మారుతి ప్రాజెక్ట్‌కు సంబంధించి కంపెనీలో ఆమె యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఈ విషయంలో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ నేతృత్వంలోని ప్రభుత్వం..గాంధీ కుటుంబానికి అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపించారు. 'కాంగ్రెస్ చీకటి అధ్యాయం' అనే పేరుతో తన 'ఎక్స్' సిరీస్‌లో మాట్లాడుతూ నిషికాంత్ దూబె ఈ వ్యాఖ్యలు చేశారు.
''విదేశీ పౌరురాలు అయినప్పటికీ, సోనియా గాంధీ మారుతికి మేనేజింగ్ డైరెక్టర్‌గా, 50శాతం వాటాదారుగా ఉన్నారని మీకు తెలుసా? అప్పటి కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఏ విదేశీ పౌరుడూ భారతీయ కంపెనీకి డైరెక్టర్ కాకూడదు. 1970లో సోనియా గాంధీ 'మారుతి టెక్నికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' అనే కంపెనీని స్థాపించారు. అదే ఏడాది నవంబర్‌లో సంజయ్ గాంధీ ఆ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. అయితే ఆ కంపెనీకి కార్లను తయారు చేయడానికి భారత ప్రభుత్వం 1968లోనే అనుమతి ఇచ్చింది. నాటి ప్రధాని ఇందిరా గాంధీ క్యాబినెట్ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 1972 ఏప్రిల్‌లో సంజయ్ గాంధీ ప్రభుత్వ ఖర్చుతో ఆ కంపెనీ తరపున ప్రపంచవ్యాప్తంగా పర్యటించారు. ఈ కంపెనీ ఏర్పాటులో అప్పటి ప్రధానమంత్రి కార్యాలయ అధికారుల పాత్ర కూడా ఉంది. ఇందిరా గాంధీ కి అత్యంత సన్నిహితుడు, ఆమె వ్యక్తిగత కార్యదర్శి అయిన ఆర్.కె. ధావన్ కూడా దానికి డైరెక్టర్ అయ్యారు. ఇవన్నీ ఎలా సాధ్యమయ్యాయి?'' అని దూబే ప్రశ్నించారు.
''మారుతి ప్రాజెక్టు కోసం ప్రభుత్వం హరియాణాలో భూమిని కేటాయించింది. అయితే నాటి హరియాణా ప్రభుత్వ నిబంధనల ప్రకారం విదేశీయుల పేరు మీద భూమిని కేటాయించడానికి వీలులేదు. గాంధీ కుటుంబంతో సంబంధం ఉన్న కంపెనీలకు రుణాల మంజూరు సులభతరం చేయడానికే అప్పట్లో బ్యాంకుల జాతీయీకరణ చేసి ఉంటారు. ఆ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభించక ముందే, వాహనాల బాడీల నిర్మాణం కోసం మారుతికి ముందస్తు చెల్లింపులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు అందాయి. ఎలాంటి చెల్లింపులు స్వీకరించకుండానే ప్రభుత్వ కంపెనీలు మారుతికి సిమెంట్, ఉక్కు, బొగ్గును సరఫరా చేశాయి. నేను చెప్పేవన్నీ నిజమా కాదా? అనే విషయంపై సోనియా గాంధీ స్పష్టతనివ్వాలి. తన సొంత డబ్బు పెట్టుబడిగా పెట్టకుండానే ఇంత పెద్ద కంపెనీని ఎలా నిర్మించారో..?, నాటి ప్రధాని ఇందిరా గాంధీ మారుతి కంపెనీ వృద్ధికి ఎలా సహకరించారు? అనే విషయాలు కూడా సోనియా తన పుస్తకంలో వివరిస్తే బాగుండేది' అని దూబే విమర్శించారు.



'భారత్‌ను చూడండి'..

ఫెడ్ వడ్డీరేట్లపై ట్రంప్ విమర్శలు

అమెరికా సెంట్రల్ బ్యాంక్ 'ఫెడరల్ రిజర్వ్'పై ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించారు. వడ్డీ రేట్ల పెంపుతో ఫెడ్ తమ దేశాన్ని నాశనం చేస్తోందని ఆరోపించారు. భారత్‌లో వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై వైట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ట్రంప్.. వాస్తవానికి అమెరికాలోనే వడ్డీరేట్లు అత్యంత తక్కువగా ఉండాలని అన్నారు.
''ఫెడరల్ రిజర్వ్ రాజకీయ ధోరణితో వ్యవహరిస్తోంది. అందుకే వడ్డీ రేట్లు మరీ ఎక్కువగా ఉన్నాయి. ఆర్థికంగా రాణిస్తున్నప్పుడు.. దేశం పరపతి మెరుగుపడుతుంది. అటువంటి సమయంలో వడ్డీ రేట్లను తగ్గించాల్సి ఉంటుంది. కానీ, దానికి విరుద్ధంగా జరుగుతోంది. వడ్డీ రేట్ల పెంపు వల్లే అమెరికా ఆర్థిక వృద్ధి రేటు తక్కువగా నమోదవుతోంది. ఇది దేశాన్ని నాశనం చేసేలా ఉంది.
భారత్‌ను చూడండి. అక్కడ వడ్డీ రేట్లు తక్కువగా ఉన్నాయి. అదే సమయంలో వారి జీడీపీ కూడా ఏడు శాతంగా ఉంది. ఫెడ్ సైతం వడ్డీ రేట్లను తగ్గిస్తే అమెరికా జీడీపీ 1520 శాతానికి చేరుకుంటుంది. అప్పుడు అప్పులను వేగంగా తీర్చొచ్చు. కొన్ని దేశాలు మన వల్లే ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోగలిగాయి. కాబట్టి, వడ్డీ రేట్లు మన దగ్గరే అత్యంత తక్కువగా ఉండాలి'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.
ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఈ ఏడాది సెప్టెంబరులో అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచుతూ ఏకగ్రీవంగా నిర్ణయించింది. దీంతో వడ్డీ రేటు 3.75 శాతం నుంచి 4 శాతానికి పెరిగింది. 2023 తర్వాత దీన్ని పెంచడం ఇదే తొలిసారి. ఇక, డిసెంబరులోనూ ఫెడ్ వడ్డీరేట్లు మరోసారి పెరిగే అవకాశాలున్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు, భారత్ విషయానికొస్తే.. అక్టోబరులో ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను సవరించింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల (0.25%) మేర పెంచింది. దీంతో రెపో రేటు 5.50శాతానికి చేరింది.

'ఏఐ' సాయంతో.. 160 ఏళ్ల నాటి

గణిత సమస్యకు పరిష్కారం!



గణిత శాస్త్రంలో 160 ఏళ్లకుపైగా అపరిష్కృతంగా ఉన్న ఓ సమస్యకు పరిష్కారం కనుగొన్నట్లు ఆంథ్రోపిక్ సంస్థ ఉద్యోగి, గణిత శాస్త్రవేత్త లెవెంట్ అల్పోజ్ ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. తమ ఏఐ టూల్ 'క్లాడ్' సాయంతో 'రీమాన్ పరికల్పన' ను నిరూపించానని తాను భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి సంబంధించి తన వెబ్‌సైట్‌లో నాలుగు పేజీల వివరణను పోస్ట్ చేశారు. రీమాన్ పరికల్పనకు సంబంధించిన నిరూపణను..సాధారణ గణిత పత్రానికి బదులుగా, 'లీన్' అనే ప్రోగ్రామింగ్ భాషలో సుమారు 1.7 కోట్ల లైన్ల కోడ్‌ను విడుదల చేశారు. ఈ విషయాన్ని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడీ దృష్టికి తీసుకెళ్లినట్లు అల్పోజ్ తెలిపారు. ఈ సంస్థ స్టాక్ మార్కెట్‌లోకి అడుగుపెట్టిన మరుసటి రోజే ఈ ప్రకటన రావడం గమనార్హం.
రీమాన్ పరికల్పన.. 1859 నాటి గణిత సిద్ధాంతం. ప్రధాన సంఖ్యలు (2, 3, 5, 7, 11..) పెద్దవవుతూ.. అనంతం వైపు వెళ్లేకొద్దీ ఎలా విస్తరిస్తాయో ఇది వివరిస్తుంది. ఫ్యూర్ మ్యాథ్స్‌లో పరిష్కారం కాని అత్యంత ముఖ్యమైన సమస్యల్లో ఇదీ ఒకటి. దీన్ని పరిష్కరించిన వారికి ఒక మిలియన్ డాలర్ల (రూ.9 కోట్లకుపైగా) బహుమతి ఇస్తామని 'క్లే మ్యాథమెటిక్స్ ఇన్‌స్టిట్యూట్ .. 2000 ఏడాదిలో ప్రకటించింది. లెవెంట్ అల్పోజ్ ప్రకటన వచ్చినప్పటికీ.. ఈ సమస్యను ఇంకా పరిష్కారం కానిదిగానే ఈ ఇన్‌స్టిట్యూట్ పేర్కొనడం గమనార్హం. మనుషులు దీనిని అధ్యయనం చేసి అర్థం చేసుకోవాల్సి ఉంటుందని, అందుకు సమయం పడుతుందని గణిత శాస్త్రవేత్తలు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది సెప్టెంబరులో ఓపెన్‌ఏఐ సైతం 'నావియర్ స్టోక్స్' సమీకరణాలను పరిష్కరించడంలో తమ ఏఐ తోడ్పడిందని తెలిపింది.

పెళ్లి చేసుకోండి.. ఎక్కువ మంది

పిల్లల్ని కనండి కరోలిన్ లీవిట్

జనాభా పెరుగుదలకు సంబంధించి వైట్‌హౌస్ మాజీ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పెళ్లి చేసుకొని, ఎక్కువ మంది పిల్లల్ని కనాలని అమెరికన్లకు సూచించారు. వచ్చే పదేళ్లలో ప్రపంచంలో అతిపెద్ద మతంగా ఇస్లాం అవతరించనుందని ఇటీవల వచ్చిన ఓ నివేదికపై లీవిట్ ఈ విధంగా స్పందించారు.
క్రైస్తవాన్ని అధిగమించి 2035 కల్లా ప్రపంచంలో అతిపెద్ద మతంగా ఇస్లాం అవతరించనుందని 'ప్యూ రీసెర్చ్ సెంటర్' అంచనా వేసింది. ఇస్లాం, క్రైస్తవం.. రెండింటా జనాభా పెరుగుతున్నప్పటికీ.. ముస్లింల సంఖ్య చాలా వేగంగా వృద్ధి చెందుతోందని పేర్కొంది. దీనికి సంబంధించి వాషింగ్టన్ పోస్ట్‌లో వచ్చిన కథానాన్ని ప్రస్తావించిన కరోలిన్ లీవిట్.. ఎక్కువ మందిని పిల్లల్ని కనాలని అమెరికన్లకు సూచించారు. వారికి అమెరికా పట్ల ప్రేమను పెంపొందించాలన్నారు.
లీవిట్ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో మిశ్రమ స్పందన వస్తోంది. కొందరు ఆమె అభిప్రాయంతో ఏకీభవిస్తుండగా.. మరికొందరు యూజర్లు మాత్రం అమెరికాలో పెరుగుతున్న జీవన వ్యయం వల్ల యువ కుటుంబాలు ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయని చెబుతున్నారు.





అనైతిక దారుల్లో ఏఐ

కొత్తగా మార్కెట్లోకి వచ్చిన ఒక బొమ్మ లాంటి దశ నుంచి, నేడు దేశ భద్రతను ప్రభావితం చేసే స్థాయికి కృత్రిమ మేధస్సు (ఏఐ) వేగంగా మారింది. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆరు అగ్రశ్రేణి ఏఐ సంస్థలు కలిసి ఒక ఒప్పందం చేసుకున్నాయి. ఏఐ వల్ల వచ్చే సైబర్, జీవ సంబంధమైన ముప్పుల నుంచి కాపాడుకోవడానికి ఇది నాలుగు రకాల భద్రతా చర్యలను సూచించింది. అయితే, ఒక పేజీ మాత్రమే ఉన్న ఈ ఒప్పందానికి చట్టబద్ధత లేదు.

ఏఐ భద్రత కోసం ఐరాస స్థాయిలో ఒక వ్యవస్థను తీసుకురావాలని, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తరహాలో ఏఐ కోసం కూడా ఒక సంస్థను ఏర్పాటు చేయాలని సింగపూర్ సూచించింది. ఏఐని ప్రైవేట్ కంపెనీల చేతుల్లో వదిలేయడం ప్రమాదకరమని, ప్రభుత్వాలే దీన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ఆంత్రోపిక్ మాజీ ఉద్యోగి జాకబ్ కాక్సన్ వాదిస్తున్నారు. ఏఐ సిస్టమ్స్ ఇప్పటికే అనూహ్యంగా ప్రవర్తిస్తున్నాయి. ఓపెన్ ఏఐ ఏజెంట్ ఒక ప్రభుత్వ మెడికేర్ పోర్టల్‌లో భద్రతా నియంత్రణలను సైతం బ్రేక్ చేసి లోపలికి ప్రవేశించడం పట్ల ఆస్ట్రేలియా ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. మాట వినకపోవడం, తప్పుడు డేటాను సృష్టించడం, ఏఐ ఏజెంట్లు ఒక గ్రూపుగా కలిసి పనిచేయడం లాంటి ప్రమాదకర ప్రవర్తనలను ఓపెన్ ఏఐ గుర్తించింది. జూలైలో, ఓపెన్ ఏఐకి చెందిన ప్రయోగాత్మక ఏఐ ఏజెంట్లు ఎటువంటి మానవ ఆదేశం లేకుండానే అంతర్గత భద్రతా ప్రమాణాల పరీక్ష సమయంలో తమ శాండ్‌బాక్స్ (ఏకాంత పరీక్షా వాతావరణం) నుంచి బయటకు వచ్చి, 'హగ్గింగ్ ఫేస్' ప్లాట్‌ఫారమ్‌పై దాడి చేశాయి. ఏఐ చేసే చిన్న పనుల్లో కూడా ప్రమాదం పొంచి ఉండవచ్చు. సినిమా టిక్కెట్లు బుక్ చేయమని చెబితే, మంచి సీట్ల కోసం ఏఐ ఏకంగా సిస్టమ్‌నే హ్యాక్ చేసినట్లు డీప్‌మైండ్ గమనించింది. అందుకే ఏఐకి మనం ఒక పని ఇస్తే, అది నీతిబాహ్యమైన దారుల్లో ఆ పనిని పూర్తి చేయకుండా 'ఏఐ అలైన్‌మెంట్' అవసరం.

అత్యంత ప్రమాదకరమైన జీవ సంబంధమైన, కంప్యూటర్ వైరస్‌లను రూపొందించడంలో సహాయపడటంతో సహా, ఏఐ లెక్కలేనన్ని మార్గాల్లో దాడి చేయగలదని నోబెల్ పురస్కార గ్రహీత జెఫ్రీ హింటన్ చెబుతున్నారు. ప్రమాదకరమైన వైరస్‌ల పరిశోధనలకు ఏఐని ఎలా వాడుకున్నారో ఆంత్రోపిక్ 'డిటెక్టింగ్ అండ్ కౌంటరింగ్ మిస్‌యూజ్ ఆఫ్ ఏఐ' అనే నివేదికలో వెల్లడించింది. చికెన్‌గున్యా వ్యాధిని మరింత సులభంగా వ్యాపించేలా చేయడం, మశూచికి సంబంధించిన వైరస్‌లపై పరిశోధనలు చేయడం, పక్షుల్లో వచ్చే ఫ్లూ జంతువులకు సోకేలా ప్రయోగాలు ప్లాన్ చేయడం లాంటి పనులకు ఏఐని ఉపయోగించారు. అయితే ఈ ప్రయోగాలు చేసినవారు మంచి కోసం చేశారా, చెడు కోసం చేశారా అనేది స్పష్టంగా తెలియదు.

ఏఐ వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో పూర్తిగా అర్థం కాదు కాబట్టి వాటిని 'బ్లాక్ బాక్స్'లుగా పిలుస్తారు, ప్రస్తుతానికి అవి మానవ నియంత్రణలోనే ఉన్నాయి. అయితే 'ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్' గురించి పెద్ద భయమే ఉంది. రికర్సివ్ సెల్ఫ్–ఇంప్రూవ్‌మెంట్ (నిరంతర స్వీయ–మెరుగుదల) ద్వారా ఏఐ తనను తాను మెరుగుపరుచుకుంటూ మనుషుల కంటే అత్యంత తెలివైనదిగా మారవచ్చు. అది కొద్ది రోజుల్లోనే మానవ నియంత్రణ నుంచి తప్పించుకోవచ్చు. అయితే, ఏఐతో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడం లాంటి ప్రస్తుత సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికే ఈ అనవసర భయాలు సృష్టిస్తున్నారని ఏఐ నిపుణుడు యాన్ లెకున్ వాదిస్తున్నారు.

ఏఐ వల్ల జరిగే ప్రమాదాలను వెంటనే రిపోర్ట్ చేసేలా యూరోపియన్ యూనియన్ ఒక చట్టం తెచ్చింది. ఐరాస 'గ్లోబల్ డిజిటల్ కాంపాక్ట్' కూడా ఏఐ పారదర్శకత కోసం దేశాలు కలిసి పనిచేయాలని కోరుతోంది. మానవ నియంత్రణ లేకుండా దాడి చేసే ఆయుధాలను నిషేధించడానికి 2026 చివరి నాటికి ఒప్పందం కుదుర్చుకోవాలని ఐరాస ఒత్తిడి చేస్తోంది.

ఈ అంశంలో భారతదేశానికి కీలకపాత్ర ఉంది. 50 వేల జీపీయూలతో కంప్యూటింగ్ సామర్థ్యాన్ని పెంచుకుంటూ, సొంత ఏఐ వ్యవస్థలను భారత్ నిర్మిస్తోంది. ఫిబ్రవరిలో జరిగిన 'ఇండియా ఏఐ సమ్మిట్'లో 92 దేశాలు ఆమోదించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్' పేద దేశాలకు కూడా ఏఐ టెక్నాలజీ సమానంగా అందాలని నొక్కి చెప్పింది. ఏఐ తయారు చేయడానికి అవసరమైన డేటా కోసం, తక్కువ జీతానికి పనిచేసే ఉద్యోగుల కోసం పేద దేశాలను వాడుకుంటూనే, మళ్లీ ఆ ఏఐ ఉత్పత్తులను వారికే అమ్మి కార్పొరేట్లు డబ్బు వసూలు చేస్తున్నాయి. ఈ డిజిటల్ వలసవాదాన్ని అడ్డుకోవడంలో భారత్ దారిచూపాలి.

యూపీఐ లాగే ఏఐని కూడా ప్రజలందరికీ అందేలా చేయడం ద్వారా అభివృద్ధి చెందుతున్న దేశాలు సొంతంగా ఏఐని సృష్టించుకునేలా చేయాలి. మన 'మోసిప్' అనే ఓపెన్ సోర్స్ ఐడీ సిస్టమ్‌ను ఇప్పుడు ఆఫ్రికా, ఆసియా దేశాల్లో వాడుతున్నారు. గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థాపక సభ్య దేశంగా భారత్ పబ్లిక్ డేటా విధానాలను సమర్థిస్తోంది.

ఏఐతో కలిసి జీవించాలంటే కచ్చితమైన ఆడిట్‌లు, ఐరాస నియంత్రణ ఉండాలి. ఉద్యోగాలు పోతాయన్న భయం, డీప్‌ఫేక్ వీడియోలు లాంటి సమస్యలు ఉన్నా, ఏఐ అద్భుతాలు చేస్తుందని ప్రజలు నమ్ముతున్నారు. ఏఐ మంచి సమాజాన్ని నిర్మిస్తుందని, రోగాలను నయం చేస్తుందని, ఉపాధ్యాయులకు, వృద్ధులకు సాయపడుతుందని 'ఏఐ గాడ్‌మదర్' ఫెయ్–ఫెయ్ లీ ఆశిస్తున్నారు. మానవాళి ఇప్పుడు వేసే అడుగులే ఆ కలను సాకారం చేస్తాయా, లేదా అనేది నిర్ణయిస్తాయి.



నిల్వలు ఉన్నా... ఆహార భద్రత కరవే!

భారత్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా అవతరించింది కానీ... ఆహార భద్రత, పోషకాహార లోపాలను అధిగమించడంలో ఇంకా సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. నిరుటి ప్రపంచ ఆకలి సూచీలో మొత్తం 123 దేశాలకుగాను ఇండియా ఎక్కడో చివరన 102వ స్థానానికి పరిమితమైంది. దేశంలో ధాన్యం నిల్వలు పుష్కలంగా ఉన్నా, ఆహార భద్రత లోపిస్తుండటమే విస్మయకరం. దీనికి ప్రధాన కారణం ఉత్పత్తి-పంపిణీ మధ్య సమన్వయం లోపించడమే. నేడు ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా...ప్రజలకు అన్నివేళలా తిండి గింజలను అందుబాటులో ఉంచడమే ఆహార భద్రత ప్రాథమిక లక్ష్యమని 1996లో రోమ్‌లో జరిగిన ప్రపంచ ఆహార సదస్సు పేర్కొంది. దీన్ని సాధించడంలో 'లభ్యత, అందుబాటు, వినియోగం, అన్నివేళలా దొరకడం' అత్యావశ్యకమైనవి. లభ్యత అనేది ఉత్పత్తితో ముడిపడిన అంశం. అందుకోసమే 2007-08లో జాతీయ ఆహార భద్రత మిషన్‌ను ఏర్పాటుచేసి, 2014-15లో తృణధాన్యాలను కూడా చేర్చారు. 2024-25కి వచ్చేసరికి ఈ పథకాన్ని జాతీయ ఆహార, పోషకాహార భద్రత మిషన్‌గా మార్చి, ప్రతి ఒక్కరికీ పోషకాలతో కూడిన ఆహారాన్ని



అందించాలని లక్షించారు.

అవసరానికి మించి దాస్తున్నారా?

'ఐక్యరాజ్యసమితి ఇండియా రిపోర్ట్ 2025' ప్రకారం, మన దేశంలో సుమారు 17.2 కోట్ల జనాభాను, ముఖ్యంగా 43శాతం మంది పిల్లల్ని పోషకాహార లేమి వేధిస్తోంది. 53.7శాతం మంది గర్భిణులు రక్తహీనతతో బాధపడుతుండటానికీ ఇదే కారణం. ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్యసేన్ చెప్పినట్లు మన దగ్గర ఆకలి చావులు కనిపించకపోవచ్చు కానీ... అర్ధాకలి, పోషకాహార లేమి మాత్రం తీవ్రంగానే తాండవిస్తున్నాయి. ఈ దుస్థితికి ప్రధాన కారణం... ఆహారంలో ధాన్యాలు, ప్రొటీన్‌ను తగ్గించి; నూనె పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్, శీతల పానీయాలు వంటి వాటిని పెంచడమే. కాగా, 19722024 మధ్యకాలంలో ఆహార ధాన్యాల మీద పెట్టే ఖర్చు గ్రామాల్లో 57శాతం నుంచి 47శాతానికి, పట్టణాల్లో 47శాతం నుంచి 36శాతానికి కుదించుకుపోవడాన్ని ఇక్కడ గమనించాలి.

తిండి పదార్థాలు అందరికీ అన్నివేళలా లభ్యం కావడం, ఆహార భద్రతకు కీలకం. చాలారకాల వ్యవసాయోత్పత్తులు ఏటా రెండు మూడుసార్లు అందుబాటులోకి వస్తాయి కానీ, వినియోగం నిత్యం ఉంటుంది. కాబట్టి, వీటిని జాగ్రత్తగా నిల్వ చేసుకుని, అవసరాల మేరకు సరఫరా చేస్తుండాలి. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నిబంధనల ప్రకారం, మొన్న ఒకటో తేదీ నాటికి దేశంలో 3.1 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు నిల్వ ఉండాలి. వాస్తవానికి అవి 8.7కోట్ల టన్నుల మేర పోగుపడ్డాయి. అంటే, 5.6కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు పంపిణీ వ్యవస్థకు చేరలేదన్నమాట. ఆకలి బాధలు తీర్చాల్సిన ధాన్యాలను అవసరానికి మించి గిడ్డంగుల్లో నిల్వ చేయడం సరికాదు. దేశీయ ఆహార ధాన్యాల ఉత్పత్తి 195051లో 5.08 కోట్ల టన్నులు కాగా, 202526లో 37.66కోట్ల టన్నులకు పెరిగింది. కానీ, రోజువారీ తలసరి ఆహార ధాన్యాల లభ్యత మాత్రం పెద్దగా పెరగలేదు. ఇప్పటికీ అది 690 గ్రాములే! జాతీయ ఆహార భద్రతా పథకం కింద గర్భిణులు, బాలింతలకు ఆహార పదార్థాలు అందించాలని లక్షించారు. దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆరు నెలల నుంచి ఆరేళ్ల పిల్లలకు పోషకాహారం ఇవ్వడం, 614 సంవత్సరాల చిన్నారులకు బడుల్లో మధ్యాహ్న భోజనం అందించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

'బజార్‌క్యాంటీన్' నమూనా మేలు

ప్రఖ్యాత పాలనా శాస్త్రవేత్త ఎఫ్.డబ్ల్యూ.రిగ్స్ సూచించినట్లు, భారత్ వంటి వర్ధమాన దేశాల పంపిణీ వ్యవస్థలు 'బజార్‌క్యాంటీన్' నమూనాలో ఉండటం మేలు. అంటే, దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నవారికి క్యాంటీన్ల ద్వారా సబ్సిడీతో కూడిన ఆహార ధాన్యాలు, ఇతర వస్తువులను సరఫరా చేయాలి. దారిద్ర్యరేఖకు ఎగువున ఉన్నవారికి బజార్ల ద్వారా వాటిని అందించాలి. దేశంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు తిండి గింజలు అందిస్తున్నా, దీన్ని మరింత పటిష్టం చేయాల్సి ఉంది. బహిరంగ మార్కెట్లో ధరలనూ నియంత్రించాలి. ముఖ్యంగా దేశీయ ఆహార ఉత్పత్తిలో మార్పులు, వినియోగంలో భిన్నత్వం, పంపిణీ సమస్యలు, పేదరికం వంటి సమస్యలను ఒకే చట్రం కిందకు తీసుకొచ్చి, ఏకతాటిన పరిష్కరించేందుకు కృషి చేయాలి. వాతావరణ మార్పులను తట్టుకోగల వంగడాలను సృష్టించడం ద్వారా స్థిరమైన వ్యవసాయం దిశగా అడుగులు వేయవచ్చు. గోదాముల్లోని ఆహార నిల్వలను పారదర్శకంగా నిర్వహించడం చాలా అవసరం. పైగా రేషన్ కార్డులను ఆధార్‌తో అనుసంధానించి, బోగస్‌లను ఏరివేయాలి. అర్హుల్లో ఏ ఒక్కరూ నష్టపోకుండా చూడాలి. సమగ్ర ఆహార భద్రతతో కూడిన భారతావని కోసం ప్రభుత్వాలు, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, నిపుణులు, అన్నదాతలు కలిసికట్టుగా కృషి చేయాలి.

న్యాయ నిరాకరణే కాదు...



నొప్పితో విలవిల్లాడేవారి మాదిరిగానే న్యాయపరమైన సమస్యల్లో చిక్కుకున్న వారూ వీలైనంత త్వరగా, తక్కువ ఖర్చుతో ఉపశమనం పొందాలని కోరుకుంటారు. న్యాయ వితరణలో జాప్యం జరగడమంటే న్యాయాన్ని నిరాకరించినట్టే కాదు, చట్టబద్ధమైన పాలనను నాశనం చేయడం కూడా అని ఉపరాష్ట్రపతిగా భైరాన్‌సింగ్ షెకావత్ దాదాపు రెండు దశాబ్దాల కిందటే ఉద్ఘాటించారు. న్యాయం పొందే ప్రక్రియ చాలా శ్రమతో కూడుకున్నదిగా, నిదానమైనదిగా, నిరాశాజనకమైనదిగా ఉంటే న్యాయార్థులు అసలు వ్యవస్థ మీదే నమ్మకం కోల్పోతారు. పౌరులకు త్వరితగతిన న్యాయమందకపోతే, 'అందరికీ అందుబాటులో న్యాయం' అన్నది ఒక శుష్క నినాదంగా మిగిలిపోతుందని సుప్రీంకోర్టు హెచ్చరించి పదేళ్లు దాటింది. వేగవంతమైన విచారణ అనేది జీవించే హక్కులో అంతర్భాగమని 'సుప్రీం' ఏనాడో స్పష్టీకరించింది. కానీ, ఏళ్ల తరబడిగా మోక్షంకోసం ఎదురుచూస్తున్న కేసులతో, ఆ క్రమంలో సామాన్యులపై పెరుగుతున్న వ్యయభారాలతో ఆ రాజ్యాంగ ప్రమాణం నీరుగారిపోతోంది. ఓపట్టాన తెమలని వ్యాజ్యాలతో- లోగడ న్యాయపాలిక వ్యాఖ్యానించినట్లుగానే, మన నేరన్యాయ వ్యవస్థే ఒక శిక్షగా మారిపోతోంది!

కిందిస్థాయి న్యాయస్థానాల్లోని పెండింగ్ కేసుల సంఖ్య 5.15కోట్లకు పైబడింది. హైకోర్టులు, సుప్రీంకోర్టుల్లోని అపరిష్కృత వ్యాజ్యాలనూ కలిపి లెక్కేస్తే, అది 5.8కోట్లకు మించిపోతుంది. గుట్టలుగుట్టలుగా పేరుకుపోతున్న కేసులతో న్యాయస్థానాలపై పనిభారం విపరీతమవుతోంది. ఆ కొండలను కరిగించడానికి, అంతరాలకు అతీతంగా అందరికీ వేగంగా, సమర్థంగా, నిష్పాక్షికంగా న్యాయసేవలను అందుబాటులోకి తీసుకురావడానికి పాటించాల్సిన పద్ధతులను క్రోడీకరించాలంటూ కేంద్ర ప్రభుత్వం తాజాగా పందొమ్మిది న్యాయ విశ్వవిద్యాలయాలకు సూచించింది. ఇది ఆహ్వానించదగిన చొరవే అయినప్పటికీ వ్యాజ్యాలు అంతగా పెండింగ్‌లో ఉండిపోవడానికి ప్రధాన కారణమేంటో కేంద్రమే నిరుడు లోక్‌సభలో పేర్కొంది. జనాభాకు సరిపడినంతగా న్యాయమూర్తులు లేకపోవడంతోనే సమస్య జఠిలమవుతోందని స్పష్టంచేసింది. ప్రతి పదిలక్షల మందికి కనీసం 50 మంది జడ్జీలు ఉండాల్సిందేనని 1987లోనే చెప్పిన లా కమిషన్ 2000 సంవత్సరానికి ఆ నిష్పత్తిని 107కి పెంచాలని సిఫార్సు చేసింది. కానీ, ఇప్పటికీ దేశీయంగా పదిలక్షల ప్రజానీకానికి 15మంది చొప్పునే న్యాయమూర్తులు ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. జనవిస్ఫోటానికి తగినంతగా జడ్జీల సంఖ్యను పెంచడంపై, ముఖ్యంగా జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో ఖాళీలను భర్తీచేయడంపై ప్రభుత్వాలు దృష్టిసారిస్తేనే సత్వర న్యాయంపై ప్రజలు ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి తలెత్తదు! పెండింగ్ కేసులు మేటలువేయడానికి కారణమవుతున్న మరొక దురవస్థను పార్లమెంటరీ స్థాయీసంఘం గతంలో నివేదించింది. మన దేశంలో అతిపెద్ద లిటిగెంట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలేనని... అపరిష్కృత వ్యాజ్యాల్లో దాదాపు సగం సర్కారుకు సంబంధించినవేనని కమిటీ కుండబద్దలుకొట్టింది. దాని వల్ల సామాన్యులకు న్యాయం జరగడంలో మితిమీరిన ఆలస్యం కావడంతోపాటు ఖజానాపైనా అపార భారం పడుతోందని విశ్లేషించింది. ప్రత్యామ్నాయ పరిష్కార విధానాల్లో ఆ దావాలను కొలిక్కితేవడంపై యంత్రాంగానికి ప్రభుత్వాలు దిశానిర్దేశం చేయాలి. కోర్టులకు వచ్చే కేసులు బాగా తగ్గాలంటే, సీజేఐగా జస్టిస్ ఎన్.వి.రమణ సూచించినట్లు స్థానిక సంస్థలు, రెవిన్యూ, పోలీసు విభాగాలు చట్టాలకు కట్టుబడి సమర్థంగా నిష్పాక్షికంగా పనిచేయాలి. ప్రజాప్రయోజనాలకు పట్టంకట్టే స్పష్టమైన శాసనాలనే చట్టసభలు రూపొందించాలి. న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాలు, డిజిటల్ వసతుల పెంపునకు ప్రాధాన్యమివ్వాలి!

'కలెక్టర్.. పోలీస్.. టీచర్.. డాక్టర్..'

పెద్దయ్యాక ఏమవుతావని చిన్నప్పుడు మాస్టారు అడిగితే ఠక్కున వచ్చే సమాధానాలు- 'కలెక్టర్.. పోలీస్.. టీచర్.. డాక్టర్..' అప్పట్లో ఒక్కొక్కరూ అలా సగర్వంగా చెప్పేవారు. ఆ వయసులో ఎవరి కల వారిది. ఎవరి లక్ష్యం వారిది. ఆ కలల్లో సమాజానికి ఏదో చేయాలనే తపన కనిపించేది. ఆ మధ్య అమెరికా, బ్రిటన్, చైనాలో 8-12 ఏళ్ల వయసు పిల్లలను లెగో, హ్యారీస్ పోల్ సంస్థలు ఈ విషయంపై ప్రశ్నించాయి. అందులో 29 శాతం మంది యూట్యూబర్, వ్లాగర్, ఇన్‌ఫ్లుయెన్సర్‌లం అవుతామని పేర్కొనడం గమనార్హం.కాలం మారింది. పిల్లల చేతిలో పుస్తకంతో పాటు సెల్‌ఫోన్ వచ్చింది. ఆటల స్థానాన్ని చాలావరకు సోషల్ మీడియా ఆక్రమించింది. దీంతో 'ఇన్‌ఫ్లుయెన్సర్' పేరూ డబ్బూ సంపాదించి పెట్టే కెరీర్ ఆప్షన్‌గా మారింది. ఇందులో తప్పేమీ లేదు. కొత్త ప్రపంచంలో కొత్త అవకాశాలు పుట్టుకొస్తున్నాయి. సద్వినియోగం చేసుకుంటే ప్రతిభను చాటడానికి సామాజిక మాధ్యమాలూ గొప్ప వేదికలే. విద్య, విజ్ఞానం, కళలు, సాంకేతికత, వ్యవసాయం.. ఇలా ఎన్నో రంగాల్లో మంచి విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఇన్‌ఫ్లుయెన్సర్లు అవసరమే. ఒక మంచి ఆలోచనను కోట్లాది మందికి చేరవేయగల శక్తి వారి చేతుల్లో ఉంది.



అయితే సమస్య 'ఇన్‌ఫ్లుయెన్సర్' కావాలనుకోవడంలో లేదు. ఎందుకు ఇన్‌ఫ్లుయెన్సర్ కావాలనుకుంటున్నాం? అన్నదే అసలు ప్రశ్న. ఫాలోవర్లు ఎంతమంది? వీడియోకు ఎన్ని వ్యూస్ వచ్చాయి? ఎన్ని లైకులు వచ్చాయి? అనే లెక్కలే విజయానికి కొలమానాలుగా మారితే.. లక్ష్యం ఎక్కడో ఒకచోట దారి తప్పిపోతుంది. గుర్తింపు కోసం చేసే ప్రయత్నం క్రమంగా గుర్తింపు కోసమే జీవించే పరిస్థితికి దారితీయకూడదు. ఒకప్పుడు పిల్లలు 'డాక్టరవుతా' అనగానే 'ఎందుకు?' అని అడిగేవాళ్లం. 'ప్రజలకు సేవ చేస్తా' అని చెప్పేవారు. 'కలెక్టర్ అయ్యి జిల్లాను అభివృద్ధి చేస్తా' అనేవారు. 'టీచరై పల్లెటూరి పిల్లలకు పాఠాలు చెబుతా' మనేవారు. ఇప్పుడు 'ఇన్‌ఫ్లుయెన్సర్ అవుతా' అన్నప్పుడు కూడా అదే ప్రశ్న అడగాలి. 'ఇన్‌ఫ్లుయెన్సర్‌గా ఏం చెబుతావు, ఎవరికి ఉపయోగపడతావు? దానివల్ల సమాజానికి ఏం మేలు జరుగుతుంది?' లాంటి ప్రశ్నలు అడగాలి. ఎందుకంటే ప్రభావం అనేది కేవలం ఫాలోవర్ల సంఖ్య కాదు. మన మాటల వల్ల ఒకరి ఆలోచన మారవచ్చు, వీడియో వల్ల ఒకరు మంచి పని చేయవచ్చు, మన సమాచారం వల్ల ఒకరికి ఉపయోగం కలగవచ్చు... అదే అసలైన ప్రభావం. పిల్లలకు పెద్ద కలలు కనమని చెప్పాలి, ఆ కలల వెనుక ఉన్న బాధ్యతను కూడా నేర్పాలి.

ఇన్‌ఫ్లుయెన్సర్‌గా లక్షల మందిని నవ్వించవచ్చు. ఒక మంచి ఉద్యమానికి ఊపిరి పోయవచ్చు. ఒక గ్రామాన్ని మార్చవచ్చు. ఎందరో విద్యార్థులకు దారి చూపవచ్చు. ఒకప్పుడు 'కలెక్టర్ అవుతా' అన్న పిల్లాడు సమాజాన్ని మార్చాలని కలగన్నాడు. ఇప్పుడు ఇన్‌ఫ్లుయెన్సర్ అవుతానంటున్న పిల్లాడు కూడా.. తన ప్రభావంతో సమాజాన్ని మంచివైపు నడిపించాలని కలగనాలి. అప్పుడు ఫాలోవర్ల సంఖ్య కాదు.. సానుకూల రీతిలో ఇన్‌ఫ్లుయెన్స్ అయిన మెదళ్ల సంఖ్యే విజయానికి అసలైన కొలమానం అవుతుంది.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం ⁞ 22.11.2026 ⁞ 01

పార్టీ గుర్తులు వచ్చేశాయ్.. ఇక ప్రచార పర్వానికి తెరలేవనుంది!

శెట్టూరు, నవంబర్ 21 (అనంత జనశక్తి న్యూస్):

శెట్టూరు మండలంలోని గ్రామపంచాయతీ ఎన్నికల్లో మరో కీలక ఘట్టం ముగిసింది. అభ్యర్థులకు ఎన్నికల గుర్తుల కేటాయింపు పూర్తికావడంతో ఇక పల్లెల్లో ప్రచార సందడి మొదలుకానుంది. రేపటి నుంచి ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థులు వివిధ రూపాల్లో ప్రచారానికి సిద్ధమవుతున్నారు. తమకు కేటాయించిన ఎన్నికల గుర్తులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అభ్యర్థులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గుర్తులను ముద్రించి ఇంటింటికీ ప్రచారం నిర్వహించడంతో పాటు ఓటర్లను నేరుగా కలిసి మద్దతు కోరేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో రేపటి నుంచి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది. ఈసారి ఎన్నికల బరిలో అధికార పక్షం, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోటీకి సిద్ధమయ్యారు. కొన్నిగ్రామపంచాయతీల్లో స్వతంత్ర అభ్యర్థుల నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోటీ ఎదురుకానుందనే చర్చ స్థానికంగా వినిపిస్తోంది.మొత్తంగా గ్రామాల్లో ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. అభ్యర్థుల ప్రచారాలు, హామీలు, ఓటర్ల మద్దతు కోసం చేసే ప్రయత్నాలతో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొననుంది. పోలింగ్ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల హడావుడి కొనసాగనుండటంతో పల్లె ప్రజలకు ఇక ఎన్నికల పండుగే పండుగ!

మత్స్యకారుల జీవితాల్లో ఆర్థిక భరోసా.. ఆక్వా రంగానికి అభివృద్ధి బాట!

- మత్స్యకార సోదరులందరికీ ప్రపంచ మత్స్య దినోత్సవ శుభాకాంక్షలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వైకాపా పాలనలో మత్స్యకారుల సంక్షేమంపై నిర్లక్ష్యం.. కూటమి పాలనలో భృతి రెట్టింపు!

కోటబొమ్మాళి, నవంబరు 21, అనంత జనశక్తి న్యూస్



మత్స్యకారుల సంక్షేమం, వారి జీవనోపాధికి భద్రత కల్పించడం, ఆక్వా రైతుల అభ్యున్నతి, మత్స్య రంగాన్ని మరింత బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకార సోదరులకు, ఆక్వా రైతులకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

వైకాపా పాలనలో మత్స్యకారుల సంక్షేమంపై నిర్లక్ష్యం.. కూటమి పాలనలో భృతి రెట్టింపు!

వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 202627 సంవత్సరానికి సంబంధించి శ్రీకాకుళం జిల్లాలోని 16,737 మంది సాగర మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20,000 చొప్పున మొత్తం రూ.32.38 కోట్ల వేట నిషేధ భృతిని డీబీటీ విధానంలో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వేట నిషేధ భృతిగా రూ.10,000 మాత్రమే అందించగా, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఆ మొత్తాన్ని రూ.20,000కు పెంచి అందిస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

రూ.444.75 కోట్లతో బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్

మత్స్యకారుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో రూ.444.75 కోట్ల అంచనా వ్యయంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఈ హార్బర్ అందుబాటులోకి వస్తే 180 ట్రాలర్లు, 600 బోట్లు కలిపి మొత్తం 780 బోట్ల వరకు నిలుపుకునే సౌకర్యం కలుగుతుంది. తద్వారా మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, చేపల వేట, నిల్వ, రవాణా, మార్కెటింగ్ రంగాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి తెలిపారు.

ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ రూ.1.50కే

రొయ్యలు, చేపల సాగు చేసే ఆక్వా రైతులపై విద్యుత్ భారం తగ్గించేందుకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.50కే అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి ఆక్వా సాగును లాభసాటిగా మార్చడం ప్రభుత్వ ఉద్దేశమన్నారు.మత్స్యకారులు, ఆక్వా రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు మత్స్యకారులు, ఆక్వా రైతులకు బ్యాంకుల ద్వారా కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కేవలం 7 శాతం వడ్డీతో రుణాలు పొందే అవకాశం కల్పించడంతో పాటు, అర్హులైన వారికి ఎలాంటి హామీ లేకుండా రూ.5 లక్షల వరకు రుణ సదుపాయం అందుబాటులో ఉందన్నారు.

జీవో 217 రద్దు.. సంప్రదాయ మత్స్యకారుల హక్కులకు రక్షణ

సంప్రదాయ మత్స్యకారుల చిరకాల ఆకాంక్షను గౌరవిస్తూ జీవో 217ను రద్దు చేసి, మత్స్యకార సొసైటీల హక్కులను పరిరక్షించడం కూటమి ప్రభుత్వ కీలక నిర్ణయమని మంత్రి పేర్కొన్నారు. తరతరాలుగా మత్స్యసంపదపై ఆధారపడి జీవిస్తున్న గంగపుత్రుల ఉపాధికి రక్షణ కల్పిస్తూ వారి ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు.మత్స్యకారుల శ్రమకు తగిన గుర్తింపు, వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత, ఆక్వా రైతులకు అండదండలు కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మత్స్య రంగంలో ఆధునిక సదుపాయాల కల్పన, మార్కెటింగ్ అవకాశాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపు ద్వారా రాష్ట్రాన్ని మత్స్య సంపద ఉత్పత్తి, ఎగుమతుల్లో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.



వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక వైద్య శిబిరం

కంటి, చెవి పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించిన నిపుణులు

అనంతపురం, నవంబర్ 21:అనంత జనశక్తి న్యూస్

వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా అనంతపురం నగరంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జాతీయ వయోవృద్ధుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ్న ప్రతిభావంతులు, హిజ్రా మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అరవింద్ నగర్‌లోని ప్రభుత్వ వివిధ్న ప్రతిభావంతుల బాలికల వసతి గృహంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వయోవృద్ధులకు కంటి, చెవి, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. తదుపరి చికిత్సకు సంబంధించిన సూచనలు చేశారు.ఈ కార్యక్రమం గురించి సహాయ సంచాలకులు జి. అర్చన మాట్లాడుతూ.. వయోవృద్ధుల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి, తగిన వైద్య సేవలు అందించడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వయోవృద్ధులు ఆరోగ్యంగా, ఆత్మగౌరవంతో, స్వతంత్రంగా జీవించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వారి ఆరోగ్యం, సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.శిబిరంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ సుహాసిని, శ్రవణ వైద్య నిపుణులు డాక్టర్ సుధాకర్, నాయక్ నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకుమార్ రెడ్డి పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. వయస్సు పెరిగే కొద్దీ కంటి చూపు తగ్గడం, కంటిశుక్లం, వినికిడి లోపం వంటి సమస్యలు వచ్చే అవకాశముందని తెలిపారు. వీటిని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సలహా లేకుండా కంటి మందులు, చుక్కలు వాడరాదని, చెవుల్లో వస్తువులు పెట్టకూడదని, అధిక శబ్దాలకు దూరంగా ఉండాలని వివరించారు. కంటి చూపు, వినికిడి సమస్యలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సిబ్బందితో పాటు నాయక్ నగర్ యూపీహెచ్‌సీ ఫార్మసిస్ట్ రఘు రంగనాథ్, ఎంఓ అసిస్టెంట్ కమల కుమారి, ఏఎన్ఎం సుమిత్ర, ఎంపీహెచ్ఏ వెంకటేశ్వర్లు, ఆశా కార్యకర్తలు, వసతి గృహ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మూడో దశ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం

- నామినేషన్ కేంద్రాల వద్ద డ్రోన్లతో పోలీసుల నిఘా.. పటిష్ట బందోబస్తు

అనంతపురం నవంబర్ 21,అనంత జనశక్తి న్యూస్



జిల్లాలో మూడో దశ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైంది. ఉరవకొండ, తాడిపత్రి నియోజకవర్గాల పరిధిలోని 9 మండలాల్లో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అదనపు పోలీసు బలగాలను మోహరించారు.నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. జనసమూహాలు, సమస్యాత్మక ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.నామినేషన్ల దాఖలు సందర్భంగా ఎలాంటి ఘర్షణలు, వివాదాలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు నిరంతర పోలీసు నిఘా కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పోలీసులకు సహకరించి నామినేషన్ల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తోడ్పడాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు.

మంత్రి పదవి నాకు డోంట్ కేర్

- మా పిల్లల రాజీనామాలు ఆగవు
- నా రాజీనామా ఢిల్లీలోనే.
- జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కడప నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్



కడప జెడ్పీ చైర్మన్ వ్యవహారం కూటమిలో కుంపటి రాజేసినట్టు అయ్యింది. జెడ్పీ పీఠం విషయంలో మాట ఇచ్చి తప్పారంటూ ఫైర్ అవుతున్న జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి.. రాజీనామాకు సిద్ధమై పోయారు. అయితే ఒక్కరోజు సమయం ఇచ్చి రేపు నిర్ణయం తీసుకుంటామని శుక్రవారం ఆయన వెల్లడించిన సంగతి తెలిసిందే. ఎన్డీఏ కూటమిలో పదవులు, రాజకీయ నిర్ణయాల విషయంలో స్పష్టత లేదని ఆదినారాయణ రెడ్డి ఫైర్ అయ్యారు. తమ ఇద్దరు తమ్ముళ్ల కుమారులు ఇచ్చిన మాట ప్రకారం రాజీనామాలకు సిద్ధమయ్యారని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇప్పటికే చంద్రబాబు, లోకేష్‌తో సమావేశం జరిగిందని, అయితే వారు చెప్పిన విషయాలు తమకు సమంజసంగా అనిపించలేదని వెల్లడించారు.నిన్న రాత్రి ఢిల్లీ నుంచి వచ్చిన పెద్దలు కూడా తమతో మాట్లాడారని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా కూటమిలో ఒకటి చెప్పి మరొకటి చేస్తున్నారని ఆదినారాయణ రెడ్డి విమర్శించారు. అనేక ప్రాంతాల్లో కూటమి పార్టీల మధ్య సరైన స్పష్టత లేదని, ధర్మవరం, అనంతపురం, కోస్తా ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితులను చూశామని పేర్కొన్నారు. మధుకర్, మాధవ్‌తో పాటు మరికొందరు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారని అన్నారు. చాలా చోట్ల తమ అభ్యర్థులు గెలిచినా, తమ స్థానాలు కూటమి భాగస్వాములకు వచ్చాయని కఠినంగా చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీవైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుతో ఢిల్లీకి రావాలని సూచించారని ఆయన తెలిపారు. రాత్రి 11.30 గంటల సమయంలో కూడా అభినందనలు తెలిపి, ఆ తర్వాత నిర్ణయాన్ని మార్చారని పేర్కొన్నారు. ఈ పరిణామాలతో తాము ఏమాత్రం సంతృప్తిగా లేమని స్పష్టం చేశారు. తమ పిల్లల రాజీనామాల నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని, అవి యథాతథంగా కొనసాగుతాయని వెల్లడించారు. ఢిల్లీ నుంచి సమాచారం వచ్చిన తర్వాతే తాను కూడా తన తదుపరి నిర్ణయాన్ని ప్రకటిస్తానని చెప్పారు. తనకు మంత్రి పదవిపై ఎలాంటి ఆసక్తి లేదని, దాని కోసం తాను ఎవరినీ ఒత్తిడి చేయలేదని స్పష్టం చేశారు. "నాకెందుకీ మంత్రి పదవి.. డోంట్ కేర్ మంత్రి పదవి" అంటూ వ్యాఖ్యానించారు. తమకు మాధవ్ చెప్పిన తర్వాత, పార్టీ తరపున అధికారికంగా సమాచారం వస్తుందని ఎదురుచూశామని తెలిపారు. మరోవైపు.. తాగునీటి సమస్య పరిష్కారం కోసం జల్‌జీవన్ మిషన్‌ను పవన్ కల్యాణ్ అడిగితే కేటాయించారని పేర్కొన్న ఆయన, ప్రతి ఒక్కరితో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. తనకు సంతృప్తి కలగకపోతే ఢిల్లీలోనే రాజీనామా చేస్తానని వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా జెడ్పీపీ విషయంలోనూ తొలుత ఎలాంటి ఆలోచన లేదని, చివరి నిమిషంలో కడప స్థానాన్ని మార్చి కృష్ణా జిల్లాను కేటాయించారని వివరించారు. ఒకటి చెప్పి మరొకటి చేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ఆదినారాయణ రెడ్డి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.

అట్టహాసంగా బాబా జయంతి ప్రారంభం

- సాయి నామస్మరణతో మారుమోగిన పుట్టపర్తి పురవీధుల
- దివ్య నామ స్మరణను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, నవంబర్ 21: అనంత జనశక్తి న్యూస్



భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 101వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని పుట్టపర్తి పట్టణంలో శనివారం "దివ్య నామ స్మరణ కార్యక్రమం" అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా ప్రారంభమైంది. శనివారం ఉదయం కలెక్టరేట్ ఎదురుగా మహిళా పోలీస్ స్టేషన్ అవరణంలో ఈ కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన భగవాన్ బాబా వారి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి కె.ఎన్. నరసయ్య,జిల్లా పర్యాటక మేనేజర్ ప్రతాప్ రెడ్డి, డి.ఆర్. డి.ఎ. సిబ్బంది, పర్యాటక శాఖ సిబ్బంది, సేవాదళ్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణేష్ సర్కిల్ నుండి సత్యమ్మ ఆలయం వరకు నామస్మరణ:

పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్ నుండి ప్రారంభమైన ఈ దివ్య నామస్మరణ యాత్ర సత్యమ్మ ఆలయం వరకు సాగింది. భక్తులు మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాలతో "ఓం శ్రీ సత్యసాయిరామ్" అంటూ భగవాన్ బాబా వారి దివ్య నామాన్ని స్మరిస్తూ ముందుకు సాగారు. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ భక్తిభావంతో, సాయి నామస్మరణతో మారుమోగిపోయాయి. దారి పొడవునా భక్తులు పూలతో స్వాగతం పలికారు. మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తిని చాటుకున్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు చూపిన ప్రేమ, సేవ, మానవత్వం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. బాబా వారి 101వ జయంతి ఉత్సవాలకు దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రశాంతి నిలయంలో దర్శనం, వసతి, తాగునీరు, వైద్య సదుపాయం, రవాణా, పారిశుధ్యం వంటి అన్ని విషయాల్లో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.జిల్లా పర్యాటక అధికారి కె.ఎన్. నరసయ్య మాట్లాడుతూ.. భక్తుల సౌకర్యార్థం పుట్టపర్తి రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశామని, ASK AI స్కానర్ బోర్డుల ద్వారా భక్తులు తమ మొబైల్ ఫోన్ లోనే అన్ని వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమం భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపిందని, బాబా వారి జయంతి ఉత్సవాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.చివరగా సత్యమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హారతి నిర్వహించి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

రేగాటిపల్లిలో జనసేన సర్పంచ్ అభ్యర్థి తరఫున చిలకం ఛాయాదేవి ఎన్నికల ప్రచారం



శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం మండలం రేగాటిపల్లి గ్రామంలో జనసేన పార్టీ సర్పంచ్ అభ్యర్థి చిన్న వారాధమ్మకు మద్దతుగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి సతీమణి చిలకం ఛాయాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలోని పలువురు మహిళలు, యువకులు, గ్రామ పెద్దలను కలిసి జనసేన పార్టీ అభ్యర్థి చిన్న వారాధమ్మకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థికి అవకాశం కల్పించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా చిన్న వారాధమ్మకు తమ అమూల్యమైన ఓటును వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని చిలకం ఛాయాదేవి ఓటర్లను అభ్యర్థించారు. ఆమె ప్రచార కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థి విజయానికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

కటారుపల్లి సర్పంచ్ అభ్యర్థిగా రెడ్డి మల్లమ్మ బిజెపి

గాండ్లపెంట, నవంబర్, 21, అనంత జనశక్తి న్యూస్,

మండలంలో కటారు పల్లె యోగి వేమన సమాధి గుర్తుకు వస్తుంది రాష్ట్రంలోనే ఇతర రాష్ట్రంలో కూడా కటారు పల్లె యోగి వేమన గడప అని పేరు ఉంది ఇలాంటి గ్రామ పంచాయతీకి బిజెపి బలపరిచిన కూటమి సర్పంచ్ అభ్యర్థిగా రెడ్డి మల్లమ్మ నామినేషన్ దాఖలు చేశారు మాజీ ఎమ్మెల్యే పార్థసారథి కూటమి అభ్యర్థి తరుపున ప్రచారం చేస్తారు సర్పంచ్ ఎన్నికలు కూడా కూటమి మీ అభ్యర్థి రెడ్డి మల్లమ్మ విజయం సాధించాలని ప్రజలు కోరారు..





భాషపై పట్టు, పఠనాసక్తితోనే ఉన్నత కెరీర్‌కు బాట: ఎస్కేయూ వీసీ

- భావవ్యక్తీకరణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి – ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్

అనంతపురం, నవంబర్ 21: అనంత జనశక్తి న్యూస్

విద్యార్థులు భాషపై ప్రేమ పెంచుకోవడంతో పాటు భావవ్యక్తీకరణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలను మెరుగు పరుచుకుని నిరంతర పఠనాన్ని అలవర్చుకోవాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ సూచించారు. భాషపై పట్టు, సమర్థవంతమైన భావవ్యక్తీకరణ ఏ రంగంలోనైనా విజయానికి కీలకమని పేర్కొన్నారు.శనివారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని భాషలు, సాహిత్యాల ఫ్యాకల్టీ పరిధిలోని తెలుగు, తులనాత్మక సాహిత్యం, ఇంగ్లీష్, హిందీ విభాగాల విద్యార్థులతో వీసీ ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భాషా నైపుణ్యాలు, పఠనాసక్తి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.భాషలు, సాహిత్య విద్యార్థులకు బోధన, జర్నలిజం, మీడియా, ప్రభుత్వ సేవలు, కంటెంట్ రైటింగ్ వంటి రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి విద్యార్థి తన మాతృభాషపై అభిమానం పెంచుకోవాలని, ప్రతిరోజూ దినపత్రికలు చదువుతూ సమకాలీన అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పత్రికా పఠనం వల్ల పదజాలం, సాధారణ విజ్ఞానం, విమర్శనాత్మక ఆలోచన, కమ్యూనికేషన్ సామర్థ్యాలు మెరుగుపడతాయని వివరించారు.ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగిన పోలీసు, పరిపాలనా రంగాల్లో బాడీ లాంగ్వేజ్, భావవ్యక్తీకరణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత యువతలో పుస్తకాలు, పత్రికలు చదివే అలవాటు తగ్గి డిజిటల్ మాధ్యమాల్లో కేవలం కంటెంట్ చూసే ధోరణి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పఠన సంస్కృతిని తిరిగి అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.తన అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటూ, ఈనాడు దినపత్రికలో సుమారు 70 వ్యాసాలు రాసినట్లు వెల్లడించారు. రచన పట్ల ఆసక్తి, భాషపై పట్టు వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు కూడా రచనా నైపుణ్యాలను పెంపొందించుకుని భాషను విజ్ఞాన సముపార్జనకు, భావవ్యక్తీకరణకు, సామాజిక సంబంధాల బలోపేతానికి సాధనంగా ఉపయోగించుకోవాలని సూచించారు.డిజిటల్ మాధ్యమాలను వినియోగిస్తూనే పుస్తకాలు, దినపత్రికలు, విద్యాసంబంధిత అంశాల పఠనానికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. నిరంతర అభ్యసనం, భాషపై అభిరుచి, సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు విద్యార్థులకు మెరుగైన కెరీర్ అవకాశాలను అందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాషలు, సాహిత్యాల ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ జి. బాలసుబ్రహ్మణ్యం, తెలుగు, తులనాత్మక సాహిత్య విభాగం ప్రొఫెసర్లు జి.నరసింహం, ఎన్.ఆర్. సదాశివ రెడ్డి, ఇంగ్లీష్, తులనాత్మక సాహిత్య విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాధవి, అకడమిక్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.విద్యార్థులతో నేరుగా మమేకమై భాషా నైపుణ్యాలు, పఠన అలవాట్లు, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించిన వీసీని అధ్యాపకులు అభినందించారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో మోడల్ స్కూల్ విద్యార్థుల సత్తా

- రాష్ట్రస్థాయి పోటీలకు హర్షవర్ధన్, కార్తికేయ ఎంపిక

- రైతులకు మేలు చేసే బయో మల్చింగ్ ప్రాజెక్టుతో ప్రతిభ చాటిన విద్యార్థులు

- ధర్మవరం మోడల్ స్కూల్‌కు దక్కిన అరుదైన అవకాశం

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్:

శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ హెచ్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో ధర్మవరం మోడల్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. శాస్త్రీయ ఆలోచన, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయ రంగానికి ఉపయోగపడే వినూత్న ఆలోచనలతో రూపొందించిన ప్రాజెక్టు న్యాయనిర్ణేతలను ఆకట్టుకోవడంతో విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.మోడల్ స్కూల్‌కు చెందిన టీ. హర్షవర్ధన్, ఎస్. కార్తికేయలు గైడ్ టీచర్ విజయ్‌కుమారి మార్గదర్శకత్వంలో 'బయో మల్చింగ్' అనే ప్రాజెక్టును రూపొందించారు. సాధారణంగా పంటల సాగులో వినియోగించే ప్లాస్టిక్ మల్చ్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత విధానాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. రైతులకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు నేల, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలను తగ్గించే విధంగా ప్రాజెక్టును అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు.జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు మొత్తం ఏడుగురు విద్యార్థులు ఎంపిక కాగా, అందులో ధర్మవరం మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి ఉండటం ప్రత్యేకంగా గర్వించదగ్గ విషయమని ప్రిన్సిపాల్ పద్మశ్రీ పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయని, భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని తెలిపారు.రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన హర్షవర్ధన్, కార్తికేయలను ప్రిన్సిపాల్ పద్మశ్రీతో పాటు ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు అభినందించారు. విద్యార్థులు ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి రాష్ట్రస్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



వైస్ చైర్మన్ పీఠం.. ఎవరి వైపు మొగ్గు!!

- కూటమి కసరత్తులో కొత్త రాజకీయ లెక్కలు

- పీఠం కోసం పెరుగుతున్న ఆశావహుల సందడి

- పొత్తు ధర్మమే పాటిస్తే మిత్రపక్షాలకు ఛాన్స్

- ఏకాభిప్రాయం కుదరకుంటే టీడీపీదే పైచేయి

- బలిజ, మైనార్టీ వర్గాల వైపు అధిష్ఠానం చూపు

- సాయంత్రానికల్లా తెరపడనున్న ఉత్కంఠ.











"ఎవరి గూటిలో పిట్ట ఆ గూటికే గింజలు" అన్న చందంగా ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఇప్పుడు కూటమి రాజకీయాల్లో కీలక చర్చగా మారింది. చైర్మన్ పీఠం ఇప్పటికే చేనేత సామాజిక వర్గానికి దక్కిన నేపథ్యంలో.. తదుపరి పదవిని ఎవరికి కట్టబెట్టాలన్న అంశం సాధారణ ఎంపికగా కాకుండా రాజకీయ సమీకరణాలకు పరీక్షగా మారింది. ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేయడంతో మూడు పార్టీల్లోనూ అంతర్గతంగా మంతనాలు ఊపందుకున్నాయి.

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం మున్సిపల్ చైర్మన్ పదవి విషయంలో ఒక సామాజిక వర్గానికి ప్రాధాన్యం లభించినందున వైస్ చైర్మన్ ఎంపికలో భిన్నమైన సామాజిక సమతూకం పాటించాలన్న అభిప్రాయం బలపడుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీకి చెందిన పలువురు నేతలు తమకు ఉన్న రాజకీయ అనుభవం, స్థానికంగా ఉన్న పట్టును ప్రస్తావిస్తూ పదవిపై కన్నేశారు. మరోవైపు బీజేపీ, జనసేన నేతలు కూడా పొత్తులో తమ వాటాను గుర్తించాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

"మూడు చేతులు కలిస్తే.... ముడి విప్పడం సులువు".....అన్నట్లుగా టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలు ఒక చోట కూర్చొని పరస్పర అంగీకారంతో నిర్ణయం తీసుకుంటే మిత్రపక్షాల్లో ఏదో ఒక పార్టీకి ఈ అవకాశం వెళ్లే మార్గం సుగమమవుతుంది. ముఖ్యంగా పొత్తు సమయంలో ఏర్పడిన అవగాహనను కొనసాగిస్తూ పదవుల పంపకంలో సమన్యాయం పాటిస్తే.. రానున్న కాలంలో కూటమి ఐక్యతకు కూడా అది దోహదపడుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే చర్చలు ఒక కొలిక్కి రాకపోతే పరిస్థితి మరో మలుపు తిరిగే అవకాశముంది. సంఖ్యాబలం, మున్సిపల్ రాజకీయాల్లో ఆధిపత్యం, స్థానిక నేతల ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే టీడీపీ నుంచే వైస్ చైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. "ఇంట గెలిచి రచ్చ గెలవాలి"..... అన్న రీతిలో ముందుగా కూటమి అంతర్గత సమీకరణాలను సర్దుబాటు చేసుకోవడంపైనే టీడీపీ నాయకత్వం దృష్టిసారించినట్లు తెలుస్తోంది.ఇక అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణం మరో కీలక అంశంగా మారింది. చైర్మన్ స్థానం చేనేతలకు దక్కిన నేపథ్యంలో వైస్ చైర్మన్ బాధ్యతను బలిజ లేదా మైనార్టీ వర్గానికి అప్పగిస్తే అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించిన సందేశం వెళుతుందని టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. దీంతో ఆయా వర్గాలకు చెందిన ఆశావహుల్లోనూ పదవిపై ఆశలు మరింత బలపడ్డాయి.మరోవైపు పదవి కోసం పలువురు పేర్లు వినిపిస్తున్నా.. చివరి నిమిషంలో అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే కీలకం కానుంది. రాజకీయంగా ఎవరి బలం ఎంత ఉన్నా.. కూటమి ప్రయోజనాలు, సామాజిక సమతుల్యత, భవిష్యత్ స్థానిక రాజకీయాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. "చివరి నిమిషంలోనే అసలు రంగు బయటపడుతుంది"..... అన్నట్లుగా ఇప్పటివరకు సాగిన అంతర్గత కసరత్తు తుది దశకు చేరినట్లు సమాచారం.మొత్తం మీద ధర్మవరం మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి ఇప్పుడు ఒక్కరి ఆశకు సంబంధించిన అంశంగా కాకుండా.. కూటమిలో భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయానికి, సామాజిక సమీకరణాలకు ప్రతిబింబంగా మారింది. బీజేపీ, జనసేనకు పొత్తు ప్రాతిపదికన అవకాశం కల్పిస్తారా.. లేక టీడీపీ తన ప్రాబల్యంతో పదవిని తన ఖాతాలో వేసుకుంటుందా అన్నదే ఉత్కంఠగా మారింది. ఈ రాజకీయ చదరంగంలో చివరి ఎత్తు ఎవరదన్నది నేటి సాయంత్రానికల్లా తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి.

స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ..
పోలీసుల అండతో కూటమి అరాచకాలు!

- నామినేషన్ల అడ్డగింత నుంచి కౌంటింగ్‌లో ఫలితాల తారుమారు వరకు అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్‌సీపీ నేతల ఆరోపణలు

- తాడిపత్రిలో పెట్రోల్ బాంబుల దాడులు.. శింగనమలలో మహిళలు, పిల్లలపై దాడులు

- కళ్యాణదుర్గంలో 38 ఎంపీటీసీ, 4 జెడ్పీటీసీ ఫలితాలు మార్చారంటూ విమర్శలు

- జిల్లా ఎస్పీ జగదీశ్‌ను కలిసి ఫిర్యాదు.. రానున్న పంచాయతీ ఎన్నికలైనా నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్

అనంతపురం, నవంబర్ 21 (అనంత జనశక్తి న్యూస్):

అనంతపురం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికార కూటమి నాయకులు పోలీసు, ఎన్నికల యంత్రాంగం అండతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో నామినేషన్ల దాఖలును అడ్డుకోవడం, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం, రిగ్గింగ్‌కు పాల్పడటం, కౌంటింగ్ కేంద్రాల్లో ఫలితాలను తారుమారు చేయడం వంటి అక్రమాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు.ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట రామిరెడ్డి, మాజీ మంత్రి సాకె శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వై. వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య తదితరులు జిల్లా ఎస్పీ పి. జగదీశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులు ఒక పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.



తాడిపత్రిలో పెట్రోల్ బాంబుల దాడులు.. బాధితులపైనే కేసులు

తాడిపత్రిలో గత కొంతకాలంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నియోజకవర్గంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. కోర్టు, హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేకుండా చేస్తున్నారని విమర్శించారు.ఇటీవల పట్టపగలే పెట్రోల్ బాంబులతో దాడులు చేసి వాహనాలు, ఇళ్లను ధ్వంసం చేశారని, నాలుగు కార్లు, 15 ద్విచక్ర వాహనాలు దగ్ధమైన ఘటనల్లో బాధితులపైనే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా వైఎస్సార్‌సీపీ నాయకులను హౌస్ అరెస్టులు చేయడం, ఆంక్షలు విధించడం ఏమిటని ప్రశ్నించారు.

శింగనమలలో మహిళలు, పిల్లలపై దాడులు

శింగనమల ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా మహిళలు, పిల్లలపై దాడులు జరిగాయని మాజీ మంత్రి సాకె శైలజానాథ్ ఆరోపించారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే మహిళలను నెట్టివేయడం, కొట్టడం, కేసులు పెడతామని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన ఎన్నికను 1.20 గంటలకే ముగించారని, ఎన్నికల అధికారులు కూడా ఏకపక్షంగా వ్యవహరించారని అన్నారు.రాజేపల్లిలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను బెదిరించారని, శోధనపల్లి ఎంపీటీసీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగినట్లు టీడీపీ నాయకులే బహిరంగంగా చెప్పుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.

కళ్యాణదుర్గంలో కౌంటింగ్ కేంద్రాల్లోనే ఫలితాల మార్పు?

కళ్యాణదుర్గంలో డీఎస్పీ, సీఐల సమక్షంలోనే నాలుగు జెడ్పీటీసీ, 38 ఎంపీటీసీ స్థానాల ఫలితాలను తారుమారు చేశారని మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆరోపించారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థులను అడ్డుకోవడం, పోలింగ్‌లో రిగ్గింగ్‌కు పాల్పడటం, కౌంటింగ్ సమయంలో గెలిచిన వారిని ఓడినట్లు ప్రకటించడం వంటి ఘటనలు జరిగాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారులు వ్యవహరించాలని, సంబంధం లేని వ్యక్తులను కేసుల్లో నిందితులుగా చేర్చి భయభ్రాంతులకు గురిచేయడం మానుకోవాలని కోరారు. ప్రజలు వేసిన ఓట్లను పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

గుంతకల్లులో రూ.లక్షల ప్రలోభాలు.. గంజాయి బ్యాచ్‌లతో బెదిరింపులు

గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికలను ప్రలోభాలు, బెదిరింపులతో వ్యాపారంగా మార్చేశారని మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. గుత్తిలో అభ్యర్థుల ఇళ్లకు వెళ్లి వారి భార్యలు, పిల్లలను సైతం బెదిరించారని తెలిపారు. 19 నామినేషన్లలో 12 తిరస్కరించారని, మిగిలిన అభ్యర్థులను కూడా బెదిరించి పోటీ నుంచి తప్పుకునేలా చేశారని ఆరోపించారు. ఏకగ్రీవ ఎన్నికల పేరుతో గ్రామాలకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఇస్తామని ప్రలోభపెడుతున్నారని, అభ్యర్థులను బాంబులతో బెదిరిస్తూ గంజాయి బ్యాచ్‌లతో దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్నికల పేరుతో రూ.15 నుంచి రూ.16 కోట్ల వరకు వసూళ్లు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ సమగ్ర విచారణ జరపాలని ఎస్పీని కోరారు.

మీడియాను అడ్డుకోవడం పత్రికా స్వేచ్ఛను హరించడమే

ఎన్నికల అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న మీడియా ప్రతినిధులను అడ్డుకోవడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి కొందరు పోలీసు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను సైతం ధిక్కరిస్తున్నారని విమర్శించారు.

పంచాయతీ ఎన్నికలైనా ప్రశాంతంగా నిర్వహించాలి

ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లోనైనా ఎలాంటి అక్రమాలు, దౌర్జన్యాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా ఎస్పీని డిమాండ్ చేశారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలో పారదర్శకత పాటించాలని, అభ్యర్థులకు, ఓటర్లకు రక్షణ కల్పించాలని కోరారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయ స్థాయిలో ఎస్కేయూ ఏఐసీకి రెండో స్థానం

- ఎంఎస్ఎంఈల ఏఐ సాధికారత కార్యక్రమంలో సత్తా చాటిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురం, నవంబర్ 21: అనంత జనశక్తి న్యూస్

జాతీయ స్థాయిలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మరో అరుదైన ఘనత సాధించింది. విశ్వవిద్యాలయానికి చెందిన ఏఐసీ-ఎస్కేయూ కాన్పెడరేషన్ (AIC SKU) మైక్రోసాఫ్ట్-సంహిత సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈల ఏఐ సాధికారత కార్యక్రమంలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. నాలుగు రాష్ట్రాలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ ఎస్కేయూ ఈ గుర్తింపు పొందడం విశేషం.ఈ సందర్భంగా నవంబర్ 20న న్యూఢిల్లీలోని నీతి ఆయోగ్ పరిధిలో ఉన్న అటల్ ఇన్నోవేషన్ మిషన్ (AIM) కార్యాలయంలో నిర్వహించిన ప్రగతి సమీక్ష సమావేశంలో ఏఐసీ-ఎస్కేయూ సీఈఓ డాక్టర్ సి. చంద్ర మౌళి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో కృత్రిమ మేధస్సు (AI) వినియోగం, శిక్షణ కార్యక్రమాల పురోగతిని వివరించారు. శిక్షణ పొందుతున్న రెండు ఎంఎస్ఎంఈ సంస్థల ప్రతినిధులు సైతం తమ అనుభవాలను సమావేశంలో పంచుకున్నారు.రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగంలో ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించడంలో ఏఐసీ-ఎస్కేయూ కీలక పాత్ర పోషిస్తోంది. ఇప్పటి వరకు 5 వేలకుపైగా సంస్థలకు ఏఐపై అవగాహన కల్పించగా, సుమారు 360 సంస్థలతో ఆరు శిక్షణ బ్యాచ్‌లను ప్రారంభించింది. ఇందులో మొదటి రెండు బ్యాచ్‌లకు చెందిన 150కిపైగా సంస్థలు విజయవంతంగా ఏఐ శిక్షణను పూర్తి చేశాయి. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల ఏఐ పురోగతిలో ఏఐసీ-ఎస్కేయూ కార్యక్రమాలు సుమారు 25 శాతం మేర కీలకంగా నిలిచాయని వెల్లడించారు.ఎంఎస్ఎంఈ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, ఏఐపై అవగాహన పెంపొందించడం, నైపుణ్యాభివృద్ధికి కృషి చేయడంలో ఏఐసీ-ఎస్కేయూ సాధిస్తున్న పురోగతిని అటల్ ఇన్నోవేషన్ మిషన్, మైక్రోసాఫ్ట్, సంహిత ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమానికి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అందిస్తున్న సంస్థాగత సహకారాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ జాతీయ స్థాయి గుర్తింపుపై ఎస్కేయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ ఏఐసీ-ఎస్కేయూ బృందాన్ని అభినందించారు. విశ్వవిద్యాలయానికి, అనంతపురం ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం గర్వకారణమని పేర్కొన్నారు.ఏఐ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పారిశ్రామిక రంగానికి చేరువ చేయడం ద్వారా రాష్ట్రంలో ఆవిష్కరణలు, నూతన పారిశ్రామికవేత్తల అభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఈ విజయం ద్వారా కృత్రిమ మేధస్సు, సాంకేతిక ఆవిష్కరణలు, పారిశ్రామిక అభివృద్ధికి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అందిస్తున్న ప్రాధాన్యత మరోసారి స్పష్టమైంది. అనంతపురం నుంచి జాతీయ స్థాయి వరకు ఎంఎస్ఎంఈలకు ఏఐ పరిజ్ఞానాన్ని చేరువ చేస్తూ అభివృద్ధిని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఏఐసీ-ఎస్కేయూ ముందుకు సాగుతోంది.



చరిత్రకు అద్దం పట్టిన నాణేలు, స్టాంపులు, పాతకాలపు కరెన్సీ ప్రదర్శన

- 50 ఏళ్లుగా సేకరించిన అరుదైన కలెక్షన్లు.. విద్యార్థులు, ప్రజలు సందర్శించాలని మున్సిపల్ కమిషనర్ పిలుపు

అనంతపురం, నవంబర్ 21: అనంత జనశక్తి న్యూస్



వేల సంవత్సరాల చరిత్రకు సాక్ష్యంగా నిలిచే పురాతన నాణేలు, అరుదైన స్టాంపులు, పాతకాలపు కరెన్సీతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన అనంతపురంలో సందర్శకులను ఆకట్టుకుంది. ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2026లో భాగంగా రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ ఆధ్వర్యంలో శనివారం పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు మరియు ప్రదర్శనశాలలో నాణేలు, స్టాంపులు, కరెన్సీ ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ కమిషనర్ ముత్యాలరాజు రేపు, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ జస్వంత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర పురావస్తు శాఖతో పాటు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (INTACH), లేడీస్ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్, ఎస్ఎస్బీఎన్ కళాశాల సంయుక్తంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశాయి.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు మాట్లాడుతూ.. వేల సంవత్సరాల క్రితం వినియోగించిన నాణేలు, వందల రకాల అరుదైన స్టాంపులు, వందల ఏళ్ల నాటి దేశీయ, విదేశీ స్టాంపుల కలెక్షన్లను ఒకేచోట ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇటువంటి ప్రదర్శనలు చరిత్రపై అవగాహన పెంచడంతో పాటు గత తరాల జీవన విధానం, అప్పటి ఆర్థిక వ్యవస్థ గురించి తెలుసుకునేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులతో పాటు ప్రజలందరూ ఈ ప్రదర్శనను సందర్శించాలని కోరారు.రాష్ట్ర పురావస్తు మరియు ప్రదర్శనశాల శాఖ అనంతపురం సహాయ సంచాలకులు ఎం. స్వామి నాయక్ మాట్లాడుతూ.. వందల ఏళ్ల క్రితం నాటి నాణేలు, స్టాంపులతో పాటు కాలక్రమేణా వాటి వినియోగంలో వచ్చిన మార్పులను ఈ ప్రదర్శనలో పొందుపరిచినట్లు తెలిపారు. విద్యార్థులకు చారిత్రక పరిజ్ఞానం పెంపొందించేందుకు, ప్రజల్లో వారసత్వ సంపదపై ఆసక్తి కలిగించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.INTACH కన్వీనర్ రామ్ కుమార్ మాట్లాడుతూ.. నాణేలు, స్టాంపులు, కరెన్సీ రంగాల్లో వందల ఏళ్లుగా చోటుచేసుకున్న మార్పులు ఆయా కాలాల చరిత్రను, సామాజిక పరిణామాలను తెలియజేస్తాయని పేర్కొన్నారు. ఇటువంటి సేకరణలు కేవలం వస్తువుల సమాహారం మాత్రమే కాకుండా గత చరిత్రను భవిష్యత్ తరాలకు పరిచయం చేసే విలువైన ఆధారాలని వివరించారు.ప్రదర్శనలో తమ అరుదైన సేకరణలను అందుబాటులో ఉంచిన గోవిందరాజులు గుప్తా, పి. శివప్రసాద్ మాట్లాడుతూ.. దాదాపు 50 ఏళ్లుగా స్టాంపులు, నాణేలు, కరెన్సీని సేకరిస్తున్నట్లు తెలిపారు. దేశీయ, విదేశీ స్టాంపులతో పాటు వివిధ చారిత్రక కాలాలకు చెందిన నాణేలు, మధ్యయుగం నుంచి నేటి వరకు వినియోగంలో ఉన్న పేపర్ కరెన్సీని సేకరించినట్లు వివరించారు. తాము ఎంతో కష్టపడి సేకరించిన అరుదైన వస్తువులను విద్యార్థులు, ప్రజలకు పరిచయం చేయడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో INTACH సభ్యులు పి. కృష్ణమూర్తి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రియాజ్, సూర్యనారాయణరెడ్డి, జూటూరు షరీఫ్, లేడీస్ క్లబ్ కార్యదర్శి పద్మ నారాయణరెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి జయంతి, ఎస్ఎస్బీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి భార్గవి తదితరులు పాల్గొన్నారు.

అనుభవమే నా ఆయుధం.. మీ నమ్మకమే నా బలం!

- 12వ వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా.. కూటమి అభ్యర్థి చిక్కాల బాబులు

రాజమహేంద్రవరం: నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్



ప్రజాసేవే తన జీవిత లక్ష్యమని, 12వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని 12వ వార్డు కూటమి కార్పొరేటర్ అభ్యర్థి చిక్కాల వీర వెంకటరమణ (బాబులు) పేర్కొన్నారు. అనుభవం తన ఆయుధమని, ప్రజల నమ్మకమే తన బలమని చెబుతూ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు.శనివారం 12వ వార్డు పరిధిలోని రెహమత్ నగర్, జీవీ నగర్, శాంతిపురం, సచివాలయం 4 ప్రాంతం, రాజమండ్రి ఈస్ట్ రైల్వే స్టేషన్ ఆవరోడ్డు, ఆదర్శనగర్, బాలాజీపేట, రైతునగర్ తదితర కాలనీల్లో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు మౌలిక వసతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా చిక్కాల బాబులు మాట్లాడుతూ.. గతంలో హుకుంపేట ఉప సర్పంచ్గా పనిచేసిన అనుభవం తనకు ఉందని, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వార్డులోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.మంత్రి కందుల దుర్గేష్ ప్రోత్సాహంతో, కూటమి ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి వార్డు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, తనపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు.12వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తనకు ఒక అవకాశం కల్పించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చిక్కాల వీర వెంకటరమణ (బాబులు) ప్రజలను అభ్యర్థించారు.

కాకినాడ సమగ్రాభివృద్ధికి డబుల్ ఇంజిన్ సర్కారే కీలకం

- కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి.. మంత్రి కందుల దుర్గేష్ పిలుపు

- సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన మహిళలకు మేయర్, ఛైర్పర్సన్ అవకాశాలు.. ప్రజలకు అధికారం అందించడమే కూటమి లక్ష్యం

కాకినాడ, నవంబర్ 21:అనంత జనశక్తి న్యూస్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కాకినాడ నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలంటే నగర పాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం కాకినాడలోని ది ఫెర్న్ రెసిడెన్సీలో నిర్వహించిన కూటమి పార్టీల సమన్వయ సమావేశంలో ఆయన ఎన్నికల సమన్వయకర్తగా పాల్గొని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాకినాడ నగర విస్తరణ అనంతరం 66 వార్డులకు పెరిగి జరుగుతున్న ఈ ఎన్నికలు చారిత్రాత్మకమైనవని పేర్కొన్నారు. విస్తరణ తర్వాత ఎన్నికల్లో విజయం సాధించే అభ్యర్థులు నగరానికి తొలి కార్పొరేటర్లుగా చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. అభ్యర్థులంతా సమష్టిగా పనిచేసి ప్రజల మద్దతు పొందాలని పిలుపునిచ్చారు.కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో స్థానిక సంస్థల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయవచ్చని వివరించారు. గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని అభ్యర్థులకు సూచించారు.సామాన్య కుటుంబాలకు చెందిన వారికి కూటమి రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తోందని మంత్రి తెలిపారు. నిడదవోలు మున్సిపాలిటీలో సాధారణ నర్సుగా పనిచేసిన మురాల జ్యోతికి ఛైర్పర్సన్గా అవకాశం కల్పించామని గుర్తుచేశారు. రాజమహేంద్రవరం మేయర్ అభ్యర్థిగా బీజేపీ మహిళా కార్యకర్త రేలంగి శ్రీదేవిని ఎంపిక చేశామని తెలిపారు. అదే విధంగా కాకినాడ మేయర్ అభ్యర్థిగా సామాన్య కుటుంబం నుంచి వచ్చిన జనసేన వీరమహిళ ఆకుల భవానిని నిలబెట్టినట్లు వెల్లడించారు. సామాన్యులకు రాజకీయ అవకాశాలు కల్పిస్తూ ప్రజాస్వామ్య పాలనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.కాకినాడ మేయర్ అభ్యర్థి ఆకుల భవానితో పాటు కూటమి తరఫున పోటీ చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థులందరినీ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.సమన్వయ సమావేశం అనంతరం కాకినాడ నగరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా కూటమి నినాదాలతో నగరంలో ప్రచార సందడి నెలకొంది. అంతకుముందు వివిధ వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను మంత్రి స్వయంగా కలుసుకుని వారికి ఎన్నికల విజయంపై సూచనలు చేశారు.ఈ సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు), పంతం నానాజీ, కాకినాడ జిల్లా పరిషత్ చైర్పర్సన్ బుర్ర దివ్య సునీత రాజ్, కుడా చైర్మన్ తలాటం సత్య, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, మాజీ మంత్రులు రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు, చిక్కాల రామచంద్రరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల వ్యయ నిర్వహణపై సమగ్ర సమీక్ష

- ఎన్నికల వ్యయంపై పటిష్టమైన పర్యవేక్షణతో పారదర్శక ఎన్నికలు నిర్వహించాలి

- అభ్యర్థుల ఖర్చుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

- వ్యయ నియమావళిని కచ్చితంగా అమలు చేయాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయకుమార్.

విజయవాడ: నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్



ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయకుమార్ శనివారం రెడ్డిగూడెం మండలంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల వ్యయ నిర్వహణ ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు .ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సబ్ ఇన్స్పెక్టర్, ఎన్నికల వ్యయ బృందం సభ్యులతో సమావేశమై, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఎన్నికల వ్యయ పర్యవేక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అభ్యర్థుల ఎన్నికల వ్యయంపై సమర్థవంతమైన పర్యవేక్షణ అత్యంత కీలకమని ఎన్నికల వ్యయ పరిశీలకులు స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేస్తున్న ప్రతి అభ్యర్థికి ప్రత్యేకంగా షాడో రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. అభ్యర్థులు సమర్పించే ఖర్చుల వివరాలను పరిశీలించి, క్షేత్రస్థాయిలో వాస్తవంగా జరుగుతున్న వ్యయంతో సరిపోల్చేందుకు ఈ రిజిస్టర్లు ఉపయోగపడతాయని తెలిపారు. అభ్యర్థులు రోజువారీ ఎన్నికల వ్యయ వివరాలను నిర్ణీత సమయంలో అకౌంటింగ్ బృందానికి సమర్పించాలని సూచించారు. ఖర్చుల వివరాలను సమర్పించని అభ్యర్థులకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ర్యాలీలు, సభలు, లౌడ్స్పీకర్ల వినియోగానికి సంబంధించి జారీ చేసే అనుమతుల ప్రతులను నిఘా, పర్యవేక్షణ నిమిత్తం అకౌంటింగ్ బృందం వద్ద ఉంచాలని తెలిపారు. తద్వారా ఆయా కార్యక్రమాలకు సంబంధించిన వ్యయాన్ని అభ్యర్థుల ఖాతాల్లో సక్రమంగా నమోదు చేయడానికి వీలవుతుందని పేర్కొన్నారు.

ఎస్ఎస్టీ చెక్పోస్టును తనిఖీ చేసిన పరిశీలకులు

రంగాపురం వద్ద రెవెన్యూ ఇన్స్పెక్టర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ చెక్పోస్టును ఎన్నికల వ్యయ పరిశీలకులు తనిఖీ చేశారు. రెడ్డిగూడెం మండలంలోకి ప్రవేశించే వాహనాలను తనిఖీ చేస్తున్న బృందం, తనిఖీల వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ఉప ఎంపీడీఓ నేతృత్వంలోని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వాహన వివరాలతో సహా ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. రోజువారీ నివేదికలను రెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలోని అకౌంటింగ్ బృందానికి సమర్పించాలని ఆదేశించారు.ఎన్నికల నియమావళిని, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ మార్గదర్శకాలను అధికారులు, సంబంధిత బృందాలు కచ్చితంగా పాటించాలని, ఎటువంటి లోపాలకు తావులేకుండా సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు స్పష్టం చేశారు.



నైపుణ్య శిక్షణతో మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- సరికొత్త ఉపాధికి బాటలు వేసేలా నిరంతర చొరవ: - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

- రైజ్ కేంద్రంలో 120 మంది మహిళలకు కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వర్క్షాప్

ఇబ్రహీంపట్నం నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్

గ్రామీణ ప్రాంత మహిళలకు ఆధునిక నైపుణ్యాలు అందించి స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా వివిధ శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో శనివారం స్వయం సహాయక సంఘాలకు చెందిన 120 మంది మహిళలకు కంప్యూటర్ రైజ్డ్ ఎంబ్రాయిడరీ యంత్రాల వినియోగంపై నిర్వహించిన వర్క్షాప్ను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పరిశీలించారు. యూఎంఈ కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ యంత్రాల ద్వారా వస్త్రాలపై ఆకర్షణీయమైన డిజైన్లు, వివిధ రకాల ఎంబ్రాయిడరీ పనులను నాణ్యతతో, తక్కువ సమయంలో రూపొందించే విధానాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షకురాలు శ్రేయా గుప్తా మహిళలకు యంత్రాల పనితీరు, వాటి నిర్వహణ, డిజైన్ల తయారీ, ఎంబ్రాయిడరీ ప్రక్రియలో పాటించాల్సిన మెళకువలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ ద్వారా తయారు చేయగల ఉత్పత్తులు, వాటికి మార్కెట్లో ఉన్న డిమాండ్, యూనిట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన పెట్టుబడి, యంత్రాల నిర్వహణ ఖర్చులు, ఉత్పత్తి సామర్థ్యం, ప్రభుత్వ మద్దతు, విక్రయ అవకాశాలు తదితర అంశాలను వివరించారు. కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ నైపుణ్యాన్ని వినియోగించుకొని మహిళలు ఇంటి వద్దనే ఉపాధి పొందడంతో పాటు చిన్న తరహా వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకునే అవకాశముందని తెలిపారు. శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలను ఆచరణలో పెట్టి నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిజైన్లను రూపొందించడం ద్వారా ఆదాయాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడం ద్వారా వారిలో స్వయం ఉపాధి పట్ల ఆసక్తిని పెంపొందించి, ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తతే కీలకం..



- పోలింగ్ నిర్వహణలో ఏ దశలోనూ పొరపాట్లకు తావివ్వొద్దు

- నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి

- పీవోల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్

పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల (పీవోలు) పాత్ర అత్యంత కీలకమని, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి అప్రమత్తతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సూచించారు.పంచాయతీ ఎన్నికలు-2026 రెండోదశ నిర్వహణకు సంబంధించి శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ ప్రక్రియలో ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయడంతో పాటు ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, ప్రామాణిక కార్యాచరణ విధానాలను తూచా తప్పకుండా పాటించాలని, విధుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ఒకేరోజు నిర్వహించనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఒత్తిడి, పోటాపోటీ వాతావరణం నెలకొనే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో అధికారులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా ప్రశాంత చిత్తంతో, సంయమనంతో బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్కు ఒక రోజు ముందుగానే సంబంధిత కేంద్రాలకు చేరుకుని అక్కడి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. స్థానిక పోలీసు, రెవెన్యూ సిబ్బంది తదితరులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. బ్యాలెట్ బాక్సు సిద్ధం చేయడం, సీల్ వేయడం, ఓటరు గుర్తింపు, బ్యాలెట్ పేపర్ జారీ, ఓటు వేసే విధానం, ఓటు రహస్యాన్ని కాపాడటం, చెల్లుబాటయ్యే, చెల్లని ఓట్లపై అవగాహన, పోలింగ్ ముగింపు, కౌంటింగ్ తదితర అంశాలను మాస్టర్ ట్రైనర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి టి.సీతామహాలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి బి.ప్రభాకరరావు, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది 22, 23న పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి, నవంబర్ 21:అనంత జనశక్తి న్యూస్



ధర్మవరం డివిజన్ పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగస్తులు ఈనెల 22న మరియు 23న పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఉద్యోగస్తులకు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం సంబంధిత ఎంపీడీవో కార్యాలయాలలో అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల విధులలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పోస్టల్ బ్యాలెట్ను సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల ద్వారా పొంది తమ ఓటు హక్కును వినియోగించుకోవలసిందిగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు.



మహిళలపై హింసకు కుటుంబ స్థాయి నుంచే అడ్డుకట్ట

చట్టాలపై అవగాహనతో పాటు ఆత్మరక్షణ నైపుణ్యాలు అవసరం

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్:

మహిళలపై హింస, వివక్ష, దాడులను అరికట్టేందుకు కుటుంబ స్థాయి నుంచే మార్పు రావాలని న్యాయ వాదులు బాలసుందరి, సుమలత పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మవరం పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఫంక్షన్ హాలులో ఆర్‌డీటీ ఆధ్వర్యంలో మహిళల అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళల హక్కులు, కుటుంబంలో వారి ప్రాధాన్యత, హింసను ఎదుర్కొనే విధానాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు మా ట్లాడుతూ..... మహిళలను ప్రతి ఒక్కరూ సమానంగా గౌరవించాలని, బాలికలకు చిన్నప్పటి నుంచే ఆత్మరక్షణ పద్ధతులపై శిక్షణ ఇవ్వాలని సూచించారు.మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు.సామాజిక మా ధ్యమాల ప్రభావంతో యువతలో కొందరు విచక్షణ కోల్పోతున్నారని, మహిళలు, బాలికలపై జరిగే అన్యాయాలను నిరోధించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. చట్టా న్ని ఉల్లంఘించిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. సమస్యలు ఎదురైనప్పుడు భయ పడకుండా చట్టబద్ధంగా పోరాడాలని, మహిళలు ఒకరికొకరు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డీటీ ఆర్.డి. హనుమంతప్ప, సాకే రామాంజనేయులు, నాగేశ్వరమ్మ, ప్రమీల, ఏపీసీ లక్ష్మన్న, క్లస్టర్ ఆఫీసర్ లక్ష్మన్న, గీత, అశ్విని, శివమ్మ, ఫ్యామిలీ కౌన్సిలర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

బాల్య మిత్రులు, పూర్వ విద్యార్థుల కలయిక అద్భుతం



విద్యావేత్త డాక్టర్ లావు రత్తయ్య

హైదరాబాద్ (నిజాంపేట), నవంబర్ 21: అనంత జనశక్తి న్యూస్

చిరకాల స్నేహితులు, బాల్య మిత్రులు తరచూ కాకపోయినా తమ జీవితంలో ఒకటి రెండుసార్లు అయినా కలుసుకుని ఆత్మీయంగా సమావేశమైనా ఆ ఆనందం, ఉత్సాహం మరువలేనివని విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య అభిప్రాయపడ్డారు. ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, ఫార్మా కన్సల్టెంట్ ఉప్పలపాటి శ్రీనివాస్, బిల్డర్ వావిలాల సుబ్బయ్య, గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ ఛాయా గ్రాహకులు పున్న కృష్ణమూర్తి హైదరాబాద్‌లోని నిజాంపేటలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లావు రత్తయ్య ఫోన్‌లో వారిని అభినందించారు.ఈ సందర్భంగా ఉన్న కృష్ణమూర్తి రచించిన 'ధరణి కోట నాగార్జునకొండ శిల్ప సంపద' అనే సచిత్ర వ్యాస సంకలన గ్రంథాన్ని, అమరావతి ఆర్ట్స్ తైలవర్ణ చిత్రాలతో కూడిన గ్రంథాన్ని తన మిత్రులకు అందజేశారు.అమ్మనబ్రోలు హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు దాదాపు వంద మందికి పైగా వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. వారిలో అనేకమంది ప్ర స్తుతం వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ పాదర్తి జయ చంద్రశేఖరరావు నేతృత్వంలో గతంలో తొలిసారిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈసారి కూడా ఆయన నేతృత్వంలోనే మరింత విస్తృత స్థాయిలో సమావేశం నిర్వహించాలని ఉప్పలపాటి శ్రీనివాస్, నిమ్మరాజు చలపతిరావు నిర్ణయించారు.వీరిలో ఉప్పలపాటి, అమ్మనబ్రోలు, నిమ్మరాజు, గొల్లపల్లి, వావిలాల, చావలి, మంత్రి, దోగుపర్తి తదితర కుటుంబాలకు చెందిన వారెందరో ఉన్నారు.అలాగే ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన జర్నలిస్టులు, తాను ఐదేళ్లపాటు చదువుకున్న తిమ్మసముద్రంలోని శ్రీ గోరంట్ల వెంకన్న సాం స్కృతిక కళాశాల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు కూడా అనేకమంది హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారని నిమ్మరాజు తెలిపారు.

జడ్పీ పీఠంపై పరిటాల ముద్ర.... టీడీపీ నేతల ఆత్మీయ అభినందనలు

- **కొత్త బాధ్యతతో జిల్లాలో రాజకీయంగా పరిటాల శ్రీరామ్ ప్రభావానికి మరింత పదును**
- **గజమాలతో ఘన సత్కారం.. అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని ఆకాంక్ష**

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్:

శ్రీ సత్య సాయి జిల్లా జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పరిటాల శ్రీరామ్‌ను టీడీపీ నాయకులు మర్యా దపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాలో పరిటాల కుటుంబానికి ఉన్న రాజకీయ ప్రాధా న్యతకు మరింత బలం చేకూరేలా జడ్పీ చైర్మన్ పదవి దక్కడం టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ నేపథ్యంలో బొట్టు కిష్ట, జింకల రాజన్న, పూజ మొబైల్ సాయి, అంగజాల చిన్న వీరప్ప, లింగన్నలు శ్రీరామ్‌ను గజమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.కొత్త జిల్లాకు తొలి జడ్పీ చైర్మ న్‌గా పరిటాల శ్రీరామ్ బాధ్యతలు చేపట్టడం రాజకీయ వర్గాల్లో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని నాయకులు ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రజా అవసరాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు జడ్పీ పాలన మరింత దోహదపడాలని పేర్కొన్నారు. పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో టీడీపీ శ్రేణులకు కొత్త దిశ, కార్యకర్తలకు కొత్త ఉత్సాహం లభిస్తుం దని నాయకులు అభిప్రాయపడ్డారు. జిల్లాలో పార్టీకి ఉన్న కేడర్ బలాన్ని మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంలో ఆయన బాధ్యత కీలకంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరా మ్‌కు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలు, కూటమి నేతలకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం

- **60 డివిజన్లలో పక్కా వ్యూహంతో విస్తృత ప్రచారం చేపట్టాలి**
- **కార్పొరేటర్లతో పాటు మేయర్ అభ్యర్థి అఖండ విజయమే లక్ష్యం**
- **నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో ఎన్నికల సన్నాహక సమావేశం**

కోటబొమ్మాళి నవంబర్ 21 అనంత జనశక్తి న్యూస్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా ప్రతి నాయకులు, కార్య కర్త సమష్టిగా పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చా రు. నగరంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి కూటమి అభ్యర్థులకు ఓటు అభ్యర్థించాలని సూచించారు. కార్పొరేటర్ అభ్య ర్థులతో పాటు మేయర్ అభ్యర్థి అఖండ విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ



సమావేశంలో జనసేన శాసనసభ్యులు వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, మేయర్ అభ్యర్థి డా. దానేటి శ్రీధర్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, కూటమి ముఖ్య నాయకులు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ, ప్రచార ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. నగరంలోని 60 డివిజన్లలోనూ పక్కా వ్యూహంతో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించాలని మంత్రి సూచించారు. ప్రతి డివిజన్‌లో స్థానిక పరిస్థి తులు, ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. మేయర్ అభ్యర్థితో పాటు అన్ని డివిజన్లలో కూటమి కార్పొరే టర్ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంతోపాటు ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం చెప్పాలని, వారు లేవనెత్తుతున్న అంశాలను తేలిగ్గా తీసుకోకుండా వాస్తవాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ తేలిగ్గా తీసుకోవద్దని, ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనదని పేర్కొన్నారు.ప్ర చారంలో ప్రతి అంశానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు చేరువ కావాలన్నారు.కూటమి పార్టీల మధ్య ఐక్యత, సమన్వయమే ఎన్నికల కార్యాచరణలో కీలకమని మంత్రి పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన మద్దతు, విజయాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మున్సిపల్ ఎన్నిక ల్లో 94 శాతం సీట్లు, పరిషత్ ఎన్నికల్లో 96.4 శాతం సీట్లు కూటమి సాధించినట్లు గుర్తుచేశారు. బ్యాలెట్ అయినా, పోస్టల్ బ్యాలెట్ అయినా ఎన్నిక ఏదైనా ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగా ఉందని తెలిపారు.ప్రతి నాయకుడు, కార్యకర్త ఎన్నికల బాధ్య తను స్వీకరించి క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజల మధ్య ఉండాలని,ప్రతి ఓటరును కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు కోరాలని మంత్రి పిలుపునిచ్చారు. 60 డివిజన్ల లోనూ సమష్టి కృషి, సమన్వయం, పక్కా వ్యూహంతో ముందుకు సాగుతూ కార్పొరేటర్ అభ్యర్థులతో పాటు మేయర్ అభ్యర్థి అఖండ విజయానికి కృషి చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిశానిర్దేశం చేశారు.

పంచాయతీ ఎన్నికల బరిలో కూటమి అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

- **కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి విజ్ఞప్తి**
- **స్థానిక నేతలు, కార్యకర్తలు చురుగ్గా ప్రచారంలో పాల్గొనాలని సూచించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

అనంతపురం నవంబర్ 21,అనంత జనశక్తి న్యూస్

అనంతపురం నియోజకవర్గ పరిధిలోని మూడు గ్రామ పంచాయతీలకు ఈనెల 26వ తేదీన జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు అధికారులు శనివారం గుర్తులను కేటాయించారు. ఇందులో భాగంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి బల పరిచిన అనంతపురం రూరల్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి హరిత కి క్యారెట్ గుర్తు, రుద్రంపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి హరి ప్రసాద్ కి బుట్ట గుర్తు, అలాగే రాజీవ్ కాలనీ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి అవుకు హరి కి మంచం గుర్తులను ఎన్నికల అధికారులు కేటాయించారు. ఈ సందర్భంగా అనం తపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు మాట్లాడుతూ కూటమి పార్టీలు బలపరిచిన సర్పంచ్ మరియు వార్డు మెంబర్ అభ్యర్థులందరినీ అత్యధిక మె జారిటీతో గెలిపించాలని ఆయా పంచాయతీల ప్రజల కు విజ్ఞప్తి చేశారు. ఈనెల 26న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి సమయం తక్కువగా



ఉన్నందున కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ అత్యంత చురుగ్గా ప్రచార పర్వంలో పాల్గొ నాలని సూచించారు. మూడు పంచాయతీలలోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను కచ్చితంగా గెలిపిం చుకోవాలని, ఇందుకోసం స్థానిక నేతలు సమన్వయం తో కష్టపడి పనిచేయాలని ఆదేశించారు.ప్రతి ఇంటికీ వెళ్లి అభ్యర్థులకు కేటాయించిన గుర్తులపై ఓటర్లకు స్ప ష్టమైన అవగాహన కల్పించాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ను ప్రజలకు వివరిస్తూ, ఆయా పంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన ఆవశ్యకతను ఓటర్లకు తెలియజేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దిశానిర్దేశం చేశారు..

అప్పుడు ఈవీఎంలన్నారు.. ఇప్పుడు బ్యాలెట్ దెబ్బ చూపించారు కదా

- **పంచాయతీ పోరులోనూ మనదే ఏకపక్ష విజయం**
- **ఎమ్మెల్యే పరిటాల సునీత, జడ్పీ ఛైర్మన్ పరిటాల శ్రీరామ్ ధీమా**
- **గ్రామాల అభివృద్ధికి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ చాలా అవసరం**
- **అసలైన బీసీల ద్రోహి వైసీపీనేనంటూ విమర్శలు**

అనంతపురం నవంబర్ 21,అనంత జనశక్తి న్యూస్

2024ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధిస్తే ఈవీఎంలంటూ విమర్శలు చేశారని.. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా కూడా వైసీపీకి గట్టి దెబ్బ కొట్టారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సత్యసాయి జిల్లా జడ్పీ చైర్మన్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తమ నివాసంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సాధించిన చారిత్రక విజయాలు, రెండు న్నరేళ్ల సుపరిపాలన, సామాజిక న్యాయం, గ్రామ పంచాయతీ ఎన్నికల గురించి వివరించారు. ఎమ్మె ల్యే సునీత మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా కూటమిని అఖండ మెజారిటీతో గె లిపించిన ప్రజలు, ఇటీవల జరిగిన కార్పొరేషన్, ము



న్సిపాలిటీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ బ్యాలెట్ ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారని అన్నారు. గత వైసీపీ హయాంలో రిగ్గిం గ్‌లు, దాడులు, దౌర్జన్యాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. నేడు కూటమి ప్రభుత్వంలో అత్యంత ప్రశాంతంగా, స్వేచ్ఛా యుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయని, 40ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు సైతం తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజ కవర్గ పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన ఏకపక్ష విజయాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు స్వ చ్ఛందంగా కూటమికి అండగా నిలిచారని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ రాప్తాడులో ప్రతి పంచాయ తీని క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడం వల్ల దాదాపు 16,800 మంది బీసీ నాయకులు రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పిం చేందుకు కృషి చేస్తే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని, అయినప్పటికీ ఇచ్చిన మాటకు కట్టు బడి పార్టీ పరంగా 40 శాతం రిజర్వేషన్లు కల్పించి బడుగు, బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేశారు.

జడ్పీ చైర్మన్ శ్రీరామ్ మాట్లాడుతూ.. ధర్మవరం నియో జకవర్గంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు రికార్డు స్థాయి మెజారిటీతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం, అలాగే ధర్మవరం నియోజకవ ర్గంలో నాలుగు ఎంపీపీ స్థానాలు కైవశం చేసుకోవడం తో పాటు ధర్మవరం రూరల్, బత్తలపల్లి మండలాల్లో సాధించిన జడ్పీటీసీ విజయాలు క్యాడర్ సమష్టికృషికి నిదర్శనమన్నారు. పార్టీ అధిష్టానం, జిల్లా ప్రజా ప్రతి నిధుల సంపూర్ణ సహకారంతో శ్రీ సత్యసాయి జిల్లా ప్రథమ జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఆ నమ్మకాన్ని ని లబెట్టుకుంటూ జిల్లాలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభు త్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు కలిసి పనిచేసే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' ద్వారానే సంక్షేమ పథకాలు అట్టడుగు స్థాయికి చేరుతాయన్నారు. అలా ఉంటేనే అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉంటే నిధుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతుందని వివరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు, సమాన అవకా శాలు అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన పీ4 విధానం సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. ఇటీవల సంభవించిన రెండు భారీ తుఫానులను ముఖ్యమం త్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వ యంత్రాంగం తుఫాను కంటే వేగంగా స్పందించి సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. అలాగే ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నినో తీవ్రత ఉన్నా సమర్థ సాగునీటి యాజమాన్యంతో రైతులను ఆదుకున్నామన్నారు. మేయర్లు, మున్సిల్ చైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్ను కునే విధానాన్ని ప్రవేశపెట్టి ఎన్నికల ప్రక్రియలో పార దర్శకతకు పెద్దపీట వేశామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఇదే ఐక్యత, సమన్వయంతో పనిచేసి రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపిం చాలని పిలుపునిచ్చారు. రాప్తాడు, ధర్మవరం నియో జకవర్గాల పరిధిలోని ప్రతి గ్రామాన్ని ప్రగతి బాటలో నడిపించేందుకు తాము ఎల్లప్పుడూ ప్రజలకు అం దుబాటులో ఉంటామని పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు.

వైసీపీ తప్పుడు ప్రచారాలకు ప్రజలే సరైన సమాధానం చెప్పారు

- **బ్యాలెట్‌లోనూ కూటమి ప్రభంజనం..**
- **గ్రామ పంచాయతీల్లోనూ విజయమే లక్ష్యం: ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

కదిరి నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సాధించిన ఘన విజయాలను చూసి వైసీపీ నాయకులు ఓటమిని జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు, తప్పుడు ప్రచా రాలకు పాల్పడుతున్నారని కదిరి నియోజకవర్గ శా సనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ తీవ్రంగా విర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా, ఓటమికి సాకులు వెతుక్కోవడం వైసీపీ నాయకుల రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఏకపక్ష విజయాలు సాధించిందని, గ్రామీణ ప్రాంతాల్లోనూ జడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ప్రజలు కూటమికి అండగా నిలిచారని పేర్కొన్నారు. గతంలో ఈవీఎంలపై ఆరో పణలు చేసిన వైసీపీకి, ఇప్పుడు బ్యాలెట్ ఎన్నికల్లోనూ ప్రజలు గట్టి సమాధానం ఇచ్చారని తెలిపారు. ప్రజల తీర్పు కూటమికి అనుకూలంగా ఉన్నప్పుడు దాన్ని అంగీకరించలేక ఆరోపణలు చేయడం వైసీపీకి అల



వాటుగా మారిందని ఎద్దేవా చేశారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దౌర్జన్యాలు, దాడులు, రాజకీయ కక్షసాధింపు చర్యలు ప్రజలకు ఇంకా గుర్తున్నాయని ఎమ్మెల్యే అన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం చట్ట బద్ధంగా, న్యాయబద్ధంగా, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ఎన్నికలు నిర్వహించిందని స్పష్టం చేశారు. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవహరించిన వారు, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడ టం విడ్డూరంగా ఉందని విమర్శించారు.మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రానికి తాను వెళ్లినట్లు వైసీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధార మైనవని ఖండించారు. తాను కౌంటింగ్ కేంద్రానికి వెళ్లలేదని, పోలింగ్ బూత్‌లోకి కూడా ప్రవేశించలేదని స్పష్టం చేశారు.ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించడం మానుకోవా లని హితవు పలికారు. నిజాలు ప్రజలకు తెలుసునని, తప్పుడు ప్రచారాలకు ప్రజలే తగిన సమాధానం చెబు తారని అన్నారు.రాష్ట్రంలో ఎల్ నినో, సూపర్ ఎల్ నినో వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు కలగకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుచూపుతో ప్రభు త్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కరువు పరి స్థితుల్లోనూ ప్రజలకు అండగా నిలుస్తున్న కూటమి ప్ర భుత్వ పనితీరును ప్రజలు గమనిస్తున్నారని, అందుకే ఎన్నికల్లో కూటమికి అఖండ విజయాన్ని అందించా రని పేర్కొన్నారు.వైసీపీ నాయకులు ఇకనైనా అసత్య ప్రచారాలు మానుకొని ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పని చేయాలని, మనలో మనం విభేదాలు పెట్టుకోకుండా కూటమి ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు ఘన విజయాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కోరారు.వైసీపీకి ప్రజల తీర్పే సమాధానం.. కూటమి విజయ పరంపర గ్రామ పంచాయతీల్లోనూ కొనసాగుతుంది.

బాధిత బాలికకు అండగా బాలల హక్కుల కమిషన్ నిందితులపై కఠిన చర్యలకు ఆదేశం

- హిందూపురంలో బాధిత బాలికను పరామర్శించిన కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన్ రావు
- మెరుగైన వైద్యం, మానసిక కౌన్సెలింగ్ అందించాలని అధికారులకు సూచన
- సేవాసదనం బాలుర గృహాన్ని సందర్శించి విద్యార్థులకు దిశానిర్దేశం



హిందూపురం, నవంబర్, 21 :అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని ఊటుకూరు గ్రామానికి చెందిన ఒక బాలికపై 55 ఏళ్ల మహిళ అత్యంత క్రూరంగా దాడి చేసి గాయపరిచిన అమానుష ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటన నేపథ్యంలో కమిషన్ గౌరవ సభ్యులు చల్లా మధుసూదన్ రావు హిందూపురంలో చికిత్స పొందుతున్న బాధిత బాలికను స్వయంగా పరామర్శించి, ఆమెకు మరియు ఆమె కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.ఈ ఘటన జరిగిన వెంటనే ప్రభుత్వం తరపున బాధిత బాలికకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స ప్రారంభించారు. కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన్ రావు బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు, ఇప్పటివరకు అందించిన వైద్య సేవల వివరాలను వైద్యాధికారుల ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.బాధిత బాలిక శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా కోలుకునేందుకు మెరుగైన వైద్య సేవలతో పాటు, నిపుణులతో అవసరమైన మానసిక కౌన్సెలింగ్ (Psychological Counseling) అందించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.కేసు దర్యాప్తులో జాప్యం జరగకుండా ఉండేందుకు, బాలికకు సంబంధించిన పూర్తి స్థాయి వైద్య నివేదికలను (Medical Reports) అత్యంత త్వరితగతిన పోలీసు శాఖకు అందజేయాలని స్పష్టం చేశారు.ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడిన నిందితులపై ఘటన తీవ్రతకు అనుగుణంగా వర్తించే అన్ని చట్టపరమైన సెక్షన్ల కింద కఠిన చర్యలు తీసుకోవాలని, దోషులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేయాలని పరిగి సబ్ ఇన్స్పెక్టర్‌ను కమిషన్ సభ్యులు ఆదేశించారు.పరామర్శ అనంతరం కమిషన్ సభ్యులు చల్లా మధుసూదన్ రావు హిందూపురంలో సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న 'సేవాసదనం బాలుర గృహాన్ని' సందర్శించారు. అక్కడి వసతులను పరిశీలించి, విద్యార్థులతో కొంత సమయం ఆప్యాయంగా ముచ్చటించారు.జీవితంలో విద్యకున్న ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిల్లలకు దిశానిర్దేశం చేశారు. బాలల హక్కుల పరిరక్షణ, వారి భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. బాధిత బాలలకు సకాలంలో అవసరమైన వైద్య, మానసిక, న్యాయ మరియు సామాజిక సహాయాన్ని అందించడంలో సంబంధిత ప్రభుత్వ శాఖలన్నీ పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్, అనంతపురం జిల్లా బాలల పరిరక్షణ అధికారి మంజునాథ్, సీడీపీఓలు శాంతలక్ష్మి, వరలక్ష్మి, ఆర్డీటీ ప్రతినిధి ఆదినారాయణ, బాలల సంక్షేమ సమితి సభ్యులు రామన్న, ప్రొటెక్షన్ అధికారులు నాగలక్ష్మి, మురళీధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్ పర్యటనకు పటిష్ట బందోబస్తు

- విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ అంకిత సురానా

పుట్టపర్తి, నవంబర్ 21: అనంత జనశక్తి న్యూస్

శ్రీ భగవాన్ సత్యసాయి బాబా 101వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం పుట్టపర్తికి రానున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అంకిత సురానా ఐపీఎస్ శనివారం పుట్టపర్తి విమానాశ్రయాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పుట్టపర్తి డీఎస్పీ మాణిక్యరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యువరాజుతో కలిసి గవర్నర్ కాన్వాయ్ రాకపోకలు, ప్రయాణ మార్గాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు సిబ్బంది విధుల కేటాయింపు తదితర అంశాలను సమీక్షించారు.గవర్నర్ పర్యటనలో ఎలాంటి భద్రతా లోపాలకు తావులేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది సమన్వయంతో, అప్రమత్తంగా వ్యవహరిస్తూ గవర్నర్ పర్యటన సజావుగా జరిగేలా చూడాలని సూచించారు

ఎస్సీ, సంచారేతర తెగల విద్యార్థులకు నాణ్యమైన వసతి విద్య

- శ్రేష్ఠ–2027 ప్రవేశ పరీక్షకు నవంబర్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి పి. జ్యోతి లక్ష్మీదేవి

విజయవాడ నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్

ఎన్.టి.ఆర్. జిల్లాలోని అర్హులైన షెడ్యూల్డ్ కులాల, డీనోటిఫైడ్ తెగల విద్యార్థులు శ్రేష్ఠ-2027 కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి పి. జ్యోతి లక్ష్మీదేవి సూచించారు. ఈ పథకం ద్వారా 9వ, 11వ తరగతుల్లో నాణ్యమైన వసతి విద్యను అభ్యసించే అవకాశం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన షెడ్యూల్డ్ కులాల, డీనోటిఫైడ్ తెగల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో శ్రేష్ఠ పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం జాతీయ పరీక్షల సంస్థ ఆధ్వర్యంలో శ్రేష్ఠ-2027 జాతీయ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రవేశ పరీక్షకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, పరీక్ష తేదీలు, ఇతర పూర్తి వివరాలను తెలుసుకోవడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జాతీయ పరీక్షల సంస్థ అధికారిక వెబ్సైటు https://exams.nta.nic.in/ ను సందర్శించాలని సూచించారు.
దరఖాస్తు సమర్పణకు చివరి తేదీ: 30 నవంబర్ 2026, రాత్రి 11:50 గంటల వరకు.జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యను అభ్యసిస్తూ, ఉన్నత విద్యా లక్ష్యాలను సాధించి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పి. జ్యోతి లక్ష్మీదేవి కోరారు.

రాష్ట్రస్థాయి SGF బాస్కెట్‌బాల్ పోటీలకు మాంటిస్సోరి ఎలైట్ విద్యార్థుల ఎంపిక



బద్రీనాథ్, సుస్మితలకు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం

రాప్తాడు నవంబర్ 21 అనంత జనశక్తి న్యూస్

అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం అనంతపురంలోని ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన SGF U17 బాస్కెట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన బద్రీనాథ్, సుస్మిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ఎండీ కృష్ణ భరత్, కరస్పాండెంట్ కృష్ణ సమీర, ప్రిన్సిపల్ ప్రతాప్ రెడ్డి విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థులకు శిక్షణ అందించిన బాస్కెట్‌బాల్ కోచ్ ప్రసాద్, అఖిలను సైతం అభినందించారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 19 నుంచి 21 వరకు కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

చరిత్ర తెలిస్తేనే భవిష్యత్తులో ఏం చేయాలో తెలుస్తుంది: మంత్రి నారాయణ

- నెల్లూరు గ్రంథాలయాన్ని పరిశీలించిన మంత్రి నారాయణ
- పుస్తకాలతో పాటు డిజిటల్ వ్యవస్థ రెండింటికీ వర్కౌట్ చేయమన్నాం: మంత్రి
- నెల్లూరు జిల్లా గ్రంథాలయానికి అనుబంధంగా 61 శాఖలు ఉన్నాయి
- కొత్త భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచన



నెల్లూరు నవంబర్ 21,అనంత జనశక్తి న్యూస్

నెల్లూరు నగరంలోని స్టోన్ హౌస్ పేట గ్రంథాలయాన్ని మంత్రి నారాయణ ప్రత్యక్షంగా పరిశీలించారు. 1952లో ఏర్పాటైన ఈ గ్రంథాలయం సుమారు 120 ఏళ్లకు పైగా పురాతన నిర్మాణంతో కూలిపోయే స్థితికి చేరడం, ఇటీవల పెచ్చులు ఊడిపడటంతో భవన పరిస్థితిపై మంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శాంతి కుమారి, కమిషనర్, మేయర్ అభ్యర్థి విజేతతో కలిసి పలు అంశాలపై చర్చించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. జిల్లాలో మున్సిపాలిటీలు, పంచాయతీలలో గ్రేడ్ 1, గ్రేడ్ 2, గ్రేడ్ 3లుగా ఈ గ్రంథాలయానికి అనుబంధంగా మొత్తం 61 శాఖలు ఉన్నాయన్నారు. ఇక్కడ పోటీ పరీక్షల కోసం చదివే విద్యార్థుల సంఖ్య పెరుగుతుండగా, గత ఏడాది వివిధ పోటీ పరీక్షల్లో 41 మంది అభ్యర్థులు సెలెక్ట్ అయ్యారని—వీరిలో 22 మంది టీచర్లు, 17 మంది పోలీసులు, ఇద్దరు గ్రూప్ 2, ముగ్గురు ఎస్ఎస్సీకి ఎంపికయ్యారని వెల్లడించారు. చైర్‌పర్సన్ అభ్యర్థన మేరకు డెమాలిషన్ స్టేజ్‌కు చేరిన భవనాన్ని పరిశీలించామని, దీన్ని కూల్చివేయాలా లేక వినియోగించవచ్చా అనే దానిపై ఆర్ అండ్ బీ అధికారులు స్ట్రెంత్ స్టడీ చేసి సర్టిఫై చేయాలని ఆదేశించామన్నారు. గూడూరు, కావలి మున్సిపల్ ఎన్నికల తర్వాత తనిఖీ చేస్తారని, భవనం పనికిరాని పక్షంలో డెమాలిష్ చేసి వెనుక వైపు అసంపూర్తిగా ఉన్న స్ట్రక్చర్‌ను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలతో పాటు చరిత్రను తెలుసుకుని మంచిని తీసుకుని చెడును పక్కన పెట్టగలగాలని, నేటి యువత అంతా డిజిటల్ వైపు ఉన్నందున పుస్తకాలతో పాటు గ్రంథాలయంలో డిజిటలైజేషన్ వ్యవస్థను కూడా అభివృద్ధి చేయాలని ఆదేశించినట్లు మంత్రి నారాయణ తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ అభ్యర్థి విజేత రూప్ కుమార్ యాదవ్,కమిషనర్ నందన్, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి ,16వ డివిజన్ కార్పొరేటర్ కమ్మ కళ్యాణి, పలువురు కార్పొరేటర్లు గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సమయపాలనతో మెరుగైన వైద్య సేవలు అందించాలి



- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ సంకారపు నరసింహులు
- వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరుకావాలి
- రోగులకు అందుతున్న సేవలను స్వయంగా పరిశీలించిన కమిటీ సభ్యుడు

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్:

ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ సంకారపు నరసింహులు సూచించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి విధులకు సకాలంలో హాజరై రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం సూపరింటెండెంట్ తిప్పేంద్ర నాయక్‌తో కలిసి రోగుల నమోదు కేంద్రం, ఓపీ, లేబొరేటరీ, ఎక్స్‌రే, వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎక్స్‌రే, మాతా శిశు విభాగాలతో పాటు వివిధ రకాల ప్రత్యేక వైద్య సేవలు, లేబొరేటరీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ వైద్య చికిత్సలు ఉచితంగా అందుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో ఆసుపత్రికి అవసరమైన సదుపాయాలు సమకూరుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆకలి తీరుస్తూ..... ఆత్మీయత పంచుతూ....!!

- నాలుగో రోజుకు చేరిన మాలధార భక్తుల అన్నదాన సేవ
- దీక్షా భక్తుల కోసం డోలా దంపతుల నిరంతర సేవా బాట
- రోజులు మారుతున్నా.. కొనసాగుతున్న సేవా సంకల్పం





శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,

నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్:

మాలధారణ చేపట్టి దీక్షలో కొనసాగుతున్న భక్తులకు అండగా నిలిచేందుకు 35వ వార్డు కౌన్సిలర్ డోలా రాజారెడ్డి, ఆయన సతీమణి డోలా ఓబులమ్మ చేపట్టిన అన్నదాన కార్యక్రమం నాలుగో రోజుకు చేరుకుంది. ధర్మవరం పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సమీపంలోని శిరిడి సాయిబాబా దేవాలయంలో మాలధార భక్తులకు భోజన సదుపాయం కల్పిస్తూ దంపతులు తమ సేవా కార్యక్రమాన్ని కొనసాగించారు. దీక్షలో ఉన్న భక్తులు ఆలయానికి చేరుకునే సమయానికి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు. భక్తులకు స్వయంగా అన్న ప్రసాదం అందిస్తూ ఆప్యాయంగా పలకరించారు. వరుసగా నాలుగు రోజులుగా ఈ కార్యక్రమం కొనసాగుతుండటంతో మాలధార భక్తుల్లో డోలా దంపతులపై ఆదరణ వ్యక్తమవుతోంది. ప్రజా జీవితంలో ఉన్నప్పటికీ సామాజిక సేవకు సమయం కేటాయిస్తూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనే భక్తుల అవసరాలను గుర్తించి సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అన్నదానం ద్వారా ఒక పూట భోజనాన్ని అందించడమే కాకుండా, దీక్షా సమయంలో భక్తులకు తోడుగా నిలుస్తున్నామనే భావనను కల్పిస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా డోలా రాజారెడ్డి, డోలా ఓబులమ్మ మాట్లాడుతూ..... మాలధారణలో ఉన్న భక్తులకు తమ వంతుగా సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. భక్తుల సంతృప్తే తమకు ప్రోత్సాహమని, సాధ్యమైనంతకాలం సేవా కార్యక్రమాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ అన్నదాన కార్యక్రమం భక్తి కార్యక్రమానికి సేవా స్పర్శను జోడిస్తోంది. ఆహారం అందించడం ద్వారా ఆకలిని తీర్చడమే కాకుండా, తోటి మనిషి అవసరాన్ని గుర్తించి స్పందించడమే నిజమైన సేవ అనే భావనను డోలా దంపతుల కార్యక్రమం ప్రతిబింబిస్తోంది.

వైసీపీ నుండి టీడీపీకి చేరిన మరో సీనియర్ నాయకుడు..

గాండ్లపెంట, నవంబర్, 21, అనంత జనశక్తి న్యూస్, మండల వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సి. ఎస్. అబ్దుల్ రావుఫ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటప్రసాద్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు మండలంలో రాజకీయ పరిణామాల నేపథ్యంలో అబ్దుల్ రావుఫ్ టీడీపీలో చేరడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజకీయాల్లో కొనసాగుతున్న ఆయన పార్టీ మారడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రసాద్, మాజీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్ రెడ్డప్ప నాయక్, ధోనికొండ ఆనంద్, సురేంద్ర రెడ్డి, అక్రమ్, సూరి, తదితర టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

వీసీకి ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

అనంతపురం టౌన్ నవంబర్ 21 అనంత జనశక్తి న్యూస్

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ విభాగం ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్ల సెకండ్ ఇయర్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ ఆందోళన వ్యక్తం చేసింది.ఈ మేరకు కార్యదర్శి పైడి నాగేంద్ర కుమార్, అధ్యక్షులు పవన్ వీసీ ని కలిసి వినతిపత్రం అందజేశారు.వినతిపత్రంలో ప్రధాన డిమాండ్లు సెకండ్ ఇయర్ విద్యార్థుల స్కాలర్షిప్ విషయంలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయి. అర్హులైన విద్యార్థులకు సకాలంలో స్కాలర్షిప్ అందడం లేదు. దీని వల్ల పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.సెమిస్టర్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యార్థులకు ఐడీ కార్డులు జారీ చేయలేదు. దీని వల్ల విద్యార్థులు లైబ్రరీ, ల్యాబ్, బస్ పాస్ వంటి సౌకర్యాలకు దూరమవుతున్నారు. పరీక్షల సమయంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.సమస్యల గురించి అడగడానికి వెళ్తే ప్రిన్సిపాల్ విద్యార్థులతో దురుసుగా మాట్లాడుతున్నారని విద్యార్థులు వాపోయారు.ఈ నేపథ్యంలో విద్యార్థుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్ ని తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని ఎస్ ఎఫ్ ఐ డిమాండ్ చేసింది.విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని నాయకులు హెచ్చరించారు.

రాజమహేంద్రవరం మున్సిపల్ ఎన్నికల్లో కూటమి విజయంపై నేతల ధీమా



- కూటమి ముఖ్య నేతల కీలక సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి దేవినేని ఉమా

రాజమహేంద్రవరం నవంబర్ 21,అనంత జనశక్తి న్యూస్

రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని కూటమి ముఖ్య నేతలు నిర్ణయించారు. రాజమండ్రి పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి గారి కార్యాలయంలో నిర్వహించిన కూటమి ముఖ్య నేతల సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఇన్‌చార్జి అరవింద్ భగారియా, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, రుడా వైస్‌ఛైర్మన్, తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి, మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవి తదితర కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజమహేంద్రవరం నగరంలో కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల ప్రచార వ్యూహం, అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, మెరుగైన పాలన కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమని నేతలు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వ లక్ష్యమైన అభివృద్ధి, సంక్షేమ పాలనను నగరంలోని ప్రతి ఇంటికీ చేరవేయడంతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఐక్యత, నాయకుల సమన్వయం, కార్యకర్తల అంకితభావంతో ఎన్నికల బరిలో సమష్టిగా పనిచేస్తే రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించడం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధే మనందరి లక్ష్యం: మంత్రి నారాయణ



- మంత్రి నారాయణను మర్యాదపూర్వకంగా కలిసిన జడ్పీ నూతన పాలకవర్గం
- జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్‌లకు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి నారాయణ
- నెల్లూరు జడ్పీ నూతన సారథులకు మంత్రి నారాయణ అభినందనలు
- సమన్వయంతో జిల్లాను అభివృద్ధి చేద్దాం: జడ్పీ నూతన పాలకవర్గానికి మంత్రి నారాయణ దిశానిర్దేశం

నెల్లూరు నవంబర్ 21 అనంత జనశక్తి న్యూస్

నెల్లూరు జిల్లా పరిషత్ నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ పొట్టేళ్ల ప్రసాద్ శనివారం సాయంత్రం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ (APEMCL) చైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి కూడా పాల్గొన్నారు.జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీరు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ నూతన పాలకవర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి, వారికి స్వయంగా స్వీట్ తినిపించి అభినందించారు.జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లడానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్ పొట్టేళ్ల ప్రసాద్ పేర్కొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజా
పడి పూజ, భిక్ష దాత ఎస్ జి రవికుమార్ స్వామి

యాడికి, నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్ :

మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్న శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం శ్రీ అయ్యప్ప స్వామి పడి పూజా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి విశేష అభిషేకం చేసి, వివిధ పూల మాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అయ్యప్పస్వామి భక్తి పాటలతోను, ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అనే నామం మారుమ్రోగింది.అయ్యప్పస్వామి కి మహా మంగళహారతి ని సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను , అందచేశారు. పడి పూజా కార్యక్రమం ను,మాలాధరించిన స్వాములకు, భక్తులకు దుర్గా కూల్ డ్రింక్ పాప్ యాజమాని ఎస్ జి రవికుమార్ స్వామి ,కుటుంబం సభ్యులు ఏర్పాటు చేశారు. దుర్గా కూల్ డ్రింక్ పాప్ యాజమాని ఎస్ జి రవికుమార్ స్వామి, కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని అయ్యప్పస్వామి ని భక్తులు వేడుకోన్నారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి, ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు, భక్తులు పాల్గోన్నారు.

మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- 50 ఏళ్లకే పెన్షన్.. వేట నిషేధ భృతిగా రూ.20 వేలు
- ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు

అమరావతి, నవంబర్ 21:అనంత జనశక్తి న్యూస్



రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మత్స్యకారులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధి కల్పిస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.మత్స్యకారులకు 50 సంవత్సరాలకే పెన్షన్ అందించడం, వేట నిషేధ సమయంలో రూ.20 వేల భృతి ప్రకటించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వ చొరవకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు నెల రోజుల్లోపే డెత్ సర్టిఫికెట్ అందించి ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు.మత్స్యకారుల హక్కులకు భంగం కలిగించేలా గతంలో తీసుకొచ్చిన జీవో నంబర్ 217ను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రద్దు చేశామని వెల్లడించారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ అందించడంతో పాటు ఆక్వా రంగానికి యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే సరఫరా చేస్తున్నామని వివరించారు.గత ఐదేళ్లలో మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించిన మంత్రి.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మత్స్యకారులు కేవలం చేపల వేటపైనే ఆధారపడకుండా, మత్స్య ఉత్పత్తుల ప్రాసెసింగ్ ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని చెప్పారు.తాజాగా సీ వీడ్ (సముద్రపు నాచు) ఉత్పత్తుల తయారీలో మత్స్యకార మహిళలకు శిక్షణ అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆక్వా రంగాన్ని మరింత బలోపేతం చేసి బ్లూ ఎకానమీలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

అభిరుచికి తగ్గ వృత్తిని ఎంచుకోవాలి.. నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- విద్యార్థులకు ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ జ్యోతి కుమార్ దిశానిర్దేశం

అనంతపురం, నవంబర్ 21: అనంత జనశక్తి న్యూస్



విద్యార్థులు కేవలం జీతభత్యాలను దృష్టిలో పెట్టుకుని కాకుండా తమ అభిరుచి, ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా వృత్తిని ఎంచుకోవాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ కెరీర్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.శనివారం విశ్వవిద్యాలయంలోని పాలిమర్ సైన్స్ సెమినార్ హాల్‌లో లైఫ్ సైన్సెస్ ఫ్యాకల్టీ విద్యార్థులు, అధ్యాపకులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. కెరీర్ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్యలో వస్తున్న మార్పులు, పరిశోధన రంగాల్లో అపారమైన అవకాశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.వృత్తి, అభిరుచి మధ్య సమన్వయం ఉన్నప్పుడే నిజమైన సంతృప్తి లభిస్తుందని వీసీ పేర్కొన్నారు. అభిరుచి, అంకితభావం, ప్రతిభతో పనిచేస్తే గుర్తింపు, గౌరవంతో పాటు ఆర్థిక విజయాన్ని కూడా సాధించవచ్చన్నారు. విద్యార్థులు తమలోని ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.లైఫ్ సైన్సెస్ రంగంలో క్వాలిటీ కంట్రోల్, క్లినికల్ రీసెర్చ్, బయోఇన్ఫర్మేటిక్స్, బయోటెక్నాలజీ, క్లినికల్ డేటా సైన్స్, ఫార్మాకోవిజిలెన్స్, పేటెంట్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో విస్తృత ఉద్యోగావకాశాలు ఉన్నాయని వివరించారు. పరిశోధన, పీహెచ్‌డీ, బోధనా రంగాలతో పాటు బయోటెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌ల ఏర్పాటుపైనా విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఉన్నత విద్యలో సంప్రదాయ బోధనా విధానాలకు బదులుగా విద్యార్థి కేంద్రిత అభ్యసనానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధ్యాపకులు కేవలం సమాచారాన్ని అందించే వారిగా కాకుండా విద్యార్థులకు మార్గదర్శకులు, మెంటార్లుగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులు ఏది, ఏమిటి అనే ప్రశ్నలకే పరిమితం కాకుండా ఎందుకు, ఎలా అనే ప్రశ్నల ద్వారా పరిశోధనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ వారి అధ్యాపకుల బోధనా నాణ్యతకు ప్రతిబింబమని పేర్కొన్నారు.లైఫ్ సైన్సెస్ విభాగాలు పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణ, పరిశోధన అవకాశాలు కల్పించాలని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలతో సమన్వయం పెంచుకోవడంతో పాటు బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాల్లోని పరిశ్రమలతో సంబంధాలను బలోపేతం చేసుకోవాలని సూచించారు. ప్రతి విభాగం ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్, కెరీర్ గైడెన్స్ వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో లైఫ్ సైన్సెస్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ బి. రవిప్రసాద్ రావు, ప్రొఫెసర్లు సి. సురేష్, ఎస్. అనిత, డి. మురళీధర రావు, కె. కృష్ణకుమారి, డాక్టర్ నరేంద్ర మద్దు, సెరికల్చర్ విభాగం డాక్టర్ బి. సత్యనారాయణ, బయోటెక్నాలజీ విభాగం డాక్టర్ సి.ఎం. అనురాధ తదితరులు పాల్గొన్నారు.నిరంతర అభ్యసనం, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానంపై విద్యార్థులు, అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించాలని వీసీ ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయాన్ని విజ్ఞానం, పరిశోధన, ఉపాధి నైపుణ్యాలకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వరి, బియ్యం నిల్వలు, విక్రయాలపై ప్రభుత్వ కొత్త నియంత్రణ
నిబంధనలు నిల్వ పరిమితులు, గరిష్ఠ విక్రయ ధరలు ఖరారు

జిల్లా జాయింట్ కలెక్టర్

అనంతపురము, నవంబర్ 21 అనంత జనశక్తి న్యూస్



రాష్ట్రంలో వరి, బియ్యం అక్రమ నిల్వలను అరికట్టడంతో పాటు, బియ్యం ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉంచే ఉద్దేశంతో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ వరి మరియు బియ్యం (నిల్వ పరిమితులు మరియు తప్పనిసరి నిల్వ వెల్లడి) నియంత్రణ ఉత్తర్వులు-2026ను జారీ చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ గారు తెలిపారు. ఈ మేరకు జి.ఓ.ఎం.ఎస్. నెం.18, తేదీ 20.11.2026 ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఈ ఉత్తర్వులు రాష్ట్రవ్యాప్తంగా అమల్లో ఉంటాయని, 31.01.2027 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.ఈ నిబంధనలు వరి, బియ్యం కొనుగోలు, రవాణా, విక్రయాలు, పంపిణీ మరియు నిల్వ చేసే హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు, పెద్ద రిటైల్ సంస్థలు, రైస్ మిల్లర్లు, ప్రాసెసర్లు, బల్క్ కన్స్యూమర్లు, కమిషన్ ఏజెంట్లు మరియు ఎగుమతిదారులకు వర్తిస్తాయని తెలిపారు. ఏ సమయంలోనైనా 10 క్వింటాళ్లకు మించి బియ్యం లేదా వరి నిల్వ ఉన్నా, లేదా బియ్యం, వరి రెండూ కలిపి 25 క్వింటాళ్లకు మించి నిల్వ ఉన్నా, వారు ఈ ఉత్తర్వుల పరిధిలోకి వస్తారని స్పష్టం చేశారు.ఇప్పటికే వ్యాపారం నిర్వహిస్తున్న వారు ఉత్తర్వులు అమల్లోకి వచ్చిన 7 రోజుల్లోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, కొత్తగా వ్యాపారం ప్రారంభించే వారు వ్యాపారం ప్రారంభించకముందే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.రిజిస్ట్రేషన్ సమయంలో సంస్థ పేరు, చిరునామా, యజమాని వివరాలు, GSTIN/PAN, మిల్లులు, గోదాముల చిరునామాలు మరియు వ్యాపార వివరాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అదేవిధంగా, నిర్దేశిత నిల్వ పరిమితులకు మించి నిల్వలు కలిగిన ప్రతి వ్యాపారి, మిల్లర్ తమ వద్ద ఉన్న వరి, బియ్యం నిల్వల వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్ https://dfpd.gov.in లో 7 రోజుల్లోగా నమోదు చేయాలని, అనంతరం ప్రతి శుక్రవారం తాజా నిల్వల వివరాలనుతప్పనిసరిగా అప్‌డేట్ చేయాలని తెలిపారు. బియ్యం నిల్వలను బాస్మతి బియ్యం, నాన్‌బాస్మతి ప్రీమియం బియ్యం, సాధారణ నాన్‌బాస్మతి బియ్యం, ఉప్పుడు బియ్యం, నూకలు మరియు వరి ధాన్యం అనే ఆరు రకాలుగా విభజించి నమోదు చేయాలని, తప్పుడు వివరాలు నమోదు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రభుత్వం నిర్ణయించిన నిల్వ పరిమితుల ప్రకారం ట్రేడింగ్ రైస్ మిల్లర్లు 4,000 క్వింటాళ్లు లేదా 7 రోజుల మిల్లింగ్ సామర్థ్యం—ఈ రెండింటిలో ఏది ఎక్కువైతే ఆ పరిమాణం వరకు నిల్వ చేసుకోవచ్చు. హోల్‌సేల్ వ్యాపారులు మున్సిపల్ కార్పొరేషన్లలో 1,000 క్వింటాళ్లు, ఇతర జిల్లా కేంద్రాల్లో 500 క్వింటాళ్లు, మిగిలిన ప్రాంతాల్లో 250 క్వింటాళ్ల వరకు నిల్వ చేసుకోవచ్చు. రిటైల్ వ్యాపారులు పట్టణ ప్రాంతాల్లో 100 క్వింటాళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో 50 క్వింటాళ్ల వరకు నిల్వ చేసుకోవడానికి అనుమతి ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన నిల్వ పరిమితులకు మించి బియ్యం నిల్వలు ఉంచరాదని, ప్రతి వ్యాపార సంస్థ తమ వద్ద ఉన్న నిల్వల వివరాలను పారదర్శకంగా నిర్వహిస్తూ, సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు.అంతే కాకుండా, బియ్యం విక్రయాలపై ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ ధరలను తప్పనిసరిగా పాటించాలని, ఒకే రకం బియ్యాన్ని వేర్వేరు బ్రాండ్ల పేర్లతో అధిక ధరలకు విక్రయించడం, ప్యాకింగ్‌పై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధర (MRP) కంటే ఎక్కువ ధర వసూలు చేయడం వంటి అక్రమాలకు పాల్పడరాదని తెలిపారు.రైతుల నుంచి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (MSP) కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేయడం, అనుమతించిన పరిమితులకు మించి నిల్వలు ఉంచడం, అధిక ధరలకు బియ్యం విక్రయించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై నిత్యావసర వస్తువుల చట్టం-1955 మరియు సంబంధిత నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, మార్కెట్‌లో పెరుగుతున్న పప్పు ధాన్యాల ధరలను దృష్టిలో ఉంచుకుని, వాటిని వినియోగదారులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా జాయింట్ కలెక్టర్ గారు తెలిపారు. ఈ మేరకు, జిల్లాలో కందిపప్పు (Tur), మినపప్పు (Urad), శనగలు (Chana), మసూర్ పప్పు (Masur), పెసలు (Moong), పసుపు బఠానీలు (Yellow Peas) వ్యాపారం నిర్వహించే దిగుమతిదారులు, మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు మరియు పెద్ద రిటైల్ సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఫుడ్ స్టాక్ పోర్టల్ https://fcainfoweb.nic.in/psp/ లో తప్పని సరిగా తమ నిల్వల వివరాలను నమోదు చేయాలని తెలిపారు.అంతే కాకుండా, ప్రతి శుక్రవారం నిల్వల వివరాలను పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. పప్పుధాన్యాల వ్యాపారులు అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, నిల్వల వివరాలను వెల్లడించకపోవడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే, వారిపై నిత్యావసర వస్తువుల చట్టం-1955 మరియు బ్లాక్ మార్కెటింగ్ నిరోధక చట్టం-1980 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా, జిల్లాలో బియ్యం నిల్వలు, విక్రయాలు, ప్రభుత్వం నిర్దేశించిన ధరల అమలు మరియు పప్పుధాన్యాల నిల్వల వివరాలను పర్యవేక్షించేందుకు విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ మరియు పౌర సరఫరాల శాఖల అధికారులు సమన్వయంతో సంయుక్తంగా ముమ్మర తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. కావున వ్యాపారులందరూ ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు.కావున, జిల్లాలోని బియ్యం వ్యాపారులందరూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పాటిస్తూ, నిల్వ పరిమితులకు అనుగుణంగా మాత్రమే నిల్వలు ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం ప్రభుత్వ స్టాక్ పోర్టల్‌లో నిల్వల వివరాలను నమోదు చేయాలని, అక్రమ నిల్వలు మరియు అధిక ధరలకు విక్రయాలకు పాల్పడకుండా పారదర్శకంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ప్రతి ఓటరును రెండుసార్లు కలవండి.. నాలుగు రోజులు కష్టపడండి

- సర్పంచ్ అభ్యర్థులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దిశానిర్దేశం
- ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి.. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి

కళ్యాణదుర్గం నవంబర్ 21, అనంత జనశక్తి న్యూస్

సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థులు, ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు.వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లర్లు సృష్టించినా, ఎన్నికల సమయంలో లేదా కౌంటింగ్‌లో ఏవైనా అవకతవకలకు పాల్పడినా వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన పేర్కొన్నారు. నేడు సర్పంచ్ అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలకు దిగితే సంబంధిత ఎస్సై లేదా పోలీసులకు సమాచారం అందించాలని, కౌంటింగ్ సమయంలో ఏవైనా అక్రమాలు జరిగినట్లు గుర్తిస్తే రిటర్నింగ్ అధికారికి (ఆర్వో) వెంటనే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.మరోవైపు ప్రచారానికి మిగిలిన నాలుగు రోజులు ఎంతో కీలకమని, అభ్యర్థులు ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ఓటు అభ్యర్థించాలని చెప్పారు. గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఒకటికి రెండుసార్లు ఓటర్లను కలవాలని సూచించారు.స్థానికంగా ఓటు హక్కు ఉండి ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఉపాధి కోసం నివసిస్తున్న వారిని ఫోన్ ద్వారా సంప్రదించి గ్రామానికి రప్పించేలా ప్రయత్నించాలని తెలిపారు. నామినేషన్లు వేసి అనంతరం ఉపసంహరించుకున్న అభ్యర్థులను సైతం కలుపుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు.



ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ
సర్పంచు కు 22 నామినేషన్లు

– వార్డు వార్డ్ మెంబర్ల స్థానాలకు 43 నామినేషన్లు

యాడికి ,నవంబర్ 21 ,అనంతశక్తి న్యూస్ :

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్థానిక ఎన్నికల నామినేషన్ల మూడో విడత ప్రారంభమైంది. యాడికి మండలంలో 14 గ్రామ పంచాయతీల గాను 22 మంది సర్పంచులకు నామినేషన్ వేయగా ,43 మంది వార్డ్ మెంబర్ల నామినేషన్ వేశారని ఎంపీడీవో వీర్రాజు శనివారం తెలిపారు. కమలపాడు పంచాయతీను సర్పంచుకు 3 మంది,వార్డ్ మెంబర్లకు 4 మంది ; గుడిపాడుకు సర్పంచుకు ,వార్డ్ మెంబర్లకు నామినేషన్ రాలేదని, నిట్టూరు గ్రామ పంచాయతీ కి సర్పంచుకు గాను 3 మంది, వార్డ్ మెంబర్లకు 6 మంది; యాడికి గ్రామ పంచాయతీ కి సర్పంచ్ గాను ఇద్దరు, వార్డ్ మెంబర్లకు 11 మంది; కొనుపులపాడుకు సర్పంచ్ కు వార్డ్ మెంబర్లకు నామినేషన్ రాలేదని, చిక్కేపల్లి గ్రామపంచాయతీకి సర్పంచ్ కు 5 మంది ,వార్డ్ మెంబర్లకు ముగ్గురు మంది; చందన గ్రామపంచాయతీకి సర్పంచ్ గాను ఇద్దరు, వార్డ్ వాడి మెంబర్లకు 5 మంది; లక్ష్మణ్ పల్లి గ్రామ పంచాయతీకి సర్పంచ్ కు ఇద్దరు ,వార్డ్ మెంబర్లకు ముగ్గురు మంది; వేములపాడు గ్రామపంచాయతీకి సర్పంచ్ గాను ఒకటి, వార్డ్ మెంబర్లకు నలుగురు మంది ; నగరూరు గ్రామ పంచాయతీకి సర్పంచ్ కు గాని ఒకరు ,వార్డ్ మెంబర్లకు 7 మంది; వెంగన్న పల్లి గ్రామ పంచాయతీకి సర్పంచ్ గాని ఒకటి ,వార్డ్ మెంబర్లకు ఏమి రాలేదని; రాయల చెరువు గ్రామ పంచాయతీ సర్పంచ్ ఒకటి ,వార్డ్ మెంబర్ కేం రాలేదని; ఉప్పల గ్రామపంచాయతీకి సర్పంచ్ కు ఒకటి ,వార్డ్ మెంబర్ లకు ఏమి రాలేదని, తుట్రాలపల్లి గ్రామ పంచాయతీకి సర్పంచ్ కు , వార్డ్ మెంబర్లకు ఏమి రాలేదని తెలిపారు. యాడికి మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ స్థానాలకు 22 మంది , వార్డ్ మెంబర్ల స్థానాలకు 43 మంది నామినేషన్లు మొదటి రోజున వచ్చినట్లు తెలిపారు.





ఆడవారి ప్రైవేట్ భాగాల్లో వచ్చే దురదని తగ్గించే చిట్కా, ఇంట్లోని పదార్థాలతోనే ప్రాబ్లమ్ సాల్వ్

మహిళలు వెజైనా ప్రాంతంలో దురద, చికాకు వంటి సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటూ ఉంటారు. ఏదో ఒక సమయంలో ప్రతి మహిళలు.. యోని ప్రాంతంలో చికాకు, దురదను అనుభవిస్తూ ఉంటారు. నలుగురిలో ఉంటే.. ఇంకా చికాకుగా ఉంటుంది. వెజైనా దగ్గర దురద, మంట అంటే అత్యంత సాధారణమైన కారణం వెజైనల్ఇన్ఫెక్షన్. ఇది ఫంగస్‌వల్ల కానీ ట్రైకోమోనాస్‌వల్ల కానీ లేదా బ్యాక్టీరియా వల్ల కానీ వస్తుండచ్చు. లేదా ఒక్కోసారి డెర్మటైటిస్‌వంటి చర్మ వ్యాధులు, అలర్జీలు కూడా ఇందుకు కారణం కావచ్చు. పీరియడ్స్‌టైమ్‌లో ఉపయోగించే.. కెమికల్స్‌తో కూడిన శానిటరీ ప్యాడ్‌ల వల్ల కూడా చికాకు సంభవించవచ్చు. కొన్ని హోంరెమిడీస్‌తో వెజైన ప్రాంతంలో చికాకు, దురదను తగ్గించుకోవచ్చు.





యాపిల్ సైడర్ వెనిగర్ వాడండి చూడండి
ఆపిల్ సైడర్ వెనిగర్‌లో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇవి బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్ వల్ల కలిగే చికాకును పూర్తిగా దూరం చేస్తాయి. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీళ్లలో రెండు చెంచాల యాపిల్‌సైడర్‌వెనిగర్‌వేసి.. మీ యోని ప్రాంతాన్ని శుభ్రం చేసుకోండి. వెజైనా.. ఎసిడిక్‌గా మారుతుంది.. దీంతో బ్యాక్టీరియా దూరం అవుతుంది.

కోల్డ్ కంప్రెస్ హెల్ప్‌అవుతుంది
రాత్రిపూట వెజైనా చికాకు ఎక్కువగా ఉంటుంది.. దీంతో మీ నిద్రకు కూడా భంగం కలిగే అవకాశం ఉంది. మీ వెజైనా ఏరియాలో కోల్డ్‌కంప్రెస్‌ఉంచండి.. ఇంది చికాకు, దురద నుంచి ఉపశమనం ఇస్తుంది.

ఉప్పు నీళ్లతో శుభ్రం చేసుకోండి
ఉప్పు బ్యాక్టీరియాను చంపుతుంది.. దురద చికాకును దూరం చేస్తుంది. మీరు వెజైనా దురద కారణంగా బాధపడుతుంటే.. ఉప్పు నీళ్లతో మీ యోని ప్రాంతాన్ని శుభ్రం చేసుకోండి. ఇది వెజైనా చికాకు నుంచి త్వరాగా ఉపశమనం కలిగిస్తుంది. బ్యాక్టీరియా పెరిగే అవకాశాన్ని తగ్గిస్తుంది.



వెల్లుల్లి పేస్ట్ మంచిది
వెల్లుల్లిలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి యోని చికాకు, దురద నుంచి ఉపశమనం ఇస్తాయి. వెల్లుల్లిని పేస్ట్‌గా తయారు చేసి.. మీ వెజైనా ఏరియాకు అప్లై చేయండి.

పెరుగు వాడండి
పెరుగులో యాక్టివ్‌కల్చర్‌ఉంటుంది. దీనిలో మంచి బ్యాక్టీరియా.. చెడు బ్యాక్టీరియాను తొలగిస్తాయి. రోజూ ఒక కప్పు పెరుగును మీ డైట్‌లో తీసుకోండి. మీ యోని ప్రాంతంలో కూడా.. పెరుగును అప్లై చేసినా మంచి రిజల్ట్స్ ఉంటాయి.

ఎంత ట్రై చేసినా బరువు తగ్గట్లేదా? ఎలాంటి తప్పులు చేస్తున్నారో చెక్ చెసుకోండి



బరువు తగ్గాలని చాలా మంది అనుకుంటారు. కానీ, కొంతమంది మాత్రమే ఆ టార్గెట్ రీచ్ అవుతూ ఉంటారు. మరికొందరికి కఠినమైన డైట్స్ పాటించినా, జిమ్‌లో గంటల తరబడి కష్టపడినా ఫలితం కనిపించదు. దీనికి పెద్దపెద్ద కారణాలే ఉండనవసరం లేదు, మనం నిర్లక్ష్యం చేసే చిన్న చిన్న అలవాట్లే వెయిట్ లాస్ జర్నీకి అడ్డుగా మారతాయి. ఈ అలవాట్లు మెటబాలిజాన్ని మందగించడమే కాకుండా శరీరంలో కొవ్వును నిల్వ చేస్తాయి, మనకు రోజంతా ఆకలిగా అనిపించేలా చేస్తాయి. మీరు ఎంత ప్రయత్నించినా బరువు తగ్గకపోతుంటే.. మొదట ఈ తప్పులను తెలుసుకుని వాటిని మానుకుంటే మంచిది. దీంతో మీరు కేవలం బరువు తగ్గడమే కాదు.. శక్తి స్థాయిలు పెరుగుతాయి, దీర్ఘకాలిక అనారోగ్యాల ముప్పు దూరం అవుతుంది.



మీ ఆహారంలో ప్రోటీన్ లేకపోవడం
బరువు తగ్గడంలో ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రొటీన్ ఎక్కువసేపు మీ కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది, ఆకలిని కంట్రోల్‌లో ఉంచుతుంది. క్యాలరీ ఇన్‌టేక్‌ను పరిమితం చేస్తునే లీన్ కండర ద్రవ్యరాశిని రక్షిస్తుంది. మీ ఆహారంలో ప్రొటీన్ సమృద్ధిగా తీసుకుంటే శరీర జీవక్రియ రేటు పెరుగుతుంది, బరువు పెరగకుండా కంట్రోల్‌లో ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్ ప్రకారం, మన ఆహారంలో తగినంత ప్రొటీన్ తీసుకుంటే కొవ్వు త్వరగా కరుగుతుంది. మీ ఆహారంలో గుడ్లు, చేపలు, పాల ఉత్పత్తులు, చిక్కుళ్లు వంటి ఆహార పదార్థాలను తీసుకోండి.



ఫైబర్ తక్కువగా తింటున్నారా?
జీర్ణక్రియను మెరుగుపరచడానికి, ఆకలిని తగ్గించడానికి ఫైబర్ చాలా అవసరం. ఫైబర్ తక్కువగా తీసుకుంటే మీ వెయిట్ లాస్ జర్నీని లేట్ చేస్తాయి. అంతేకాదు పేగు ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. మీ ఆహారంలో తృణధాన్యాలు, అవిసె గింజలు, సబ్జా గింజలు, గుమ్మడికాయ గింజలు, మెంతులు, వేరుశనగలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, బీన్స్, బఠానీలు, అవకాడో, పండ్లు చేర్చుకోండి.

బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేస్తున్నారా?
చాలామంది తిండి మానేస్తే.. బరువు తగ్గుతాం అనే అపోహలో ఉంటారు. దీంతో బ్రేక్‌ఫాస్ట్ మానేస్తూ ఉంటారు. అయితే ఇది మంచి ఆలోచన కాదని నిపుణులు అంటున్నారు. ఉదయం పూట టిఫిన్ మానస్తే ఆ తర్వాత ఆకలి పెరుగుతుంది, రోజంతా ఆకలిగా అనిపిస్తుంది కడుపు మాడితే, ఏది పడితే అది నోటిలోకి వెళ్లిపోతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే ప్రొటీన్, ఫైబర్‌తో కూడిన సమత్యల ఆహారం తీసుకోండి.

బ్లడ్ షుగర్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోకపోతే
రక్తంలో చక్కెర స్థాయిలు అస్థిరంగా ఉండటం వల్ల బరువు తగ్గడం కష్టమవుతుంది. బ్లడ్ షుగర్స్ ఎక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా వేస్తుంది, అతిగా తింటారు, శరీరంలో కొవ్వు నిల్వలు పెరుగుతాయి. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, సమతుల్య ఆహారం తీసుకుంటే బ్లడ్ షుగర్స్ కంట్రోల్‌లో ఉంటాయి.

తగినంత నిద్ర లేకపోయినా
నిద్రసరిగ్గా లేకపోయినా.. మీరు బరువు తగ్గడం కష్టం అవుతుంది. నిద్ర సరిగ్గా లేకపోతే.. ఆకలి, సంతృప్తిని నియంత్రించే హార్మోన్లకు అంతరాయం కలిగిస్తుంది. దీంతో ఆకలి పెరుగుతుంది, జీవక్రియను నెమ్మదిస్తుంది. మీరు త్వరగా బరువు తగ్గాలంటే.. 7-9 గంటలు ప్రశాంతంగా నిద్రపోండి.

వ్యాయామం తక్కువ చేసినా, అతిగా చేసినా కూడా
వ్యాయామం అవసరమే కానీ మితిమీరి చేసినా, అసలు చేయకపోయినా కూడా ప్రతికూల ఫలితాలు వస్తాయి. వ్యాయామం చేయకపోతే.. కండరాల నష్టం జరుగుతుంది, జీవక్రియ తగ్గుతుంది.. దీంతో బరువు పెరుగుతారు. అతిగా వ్యాయామం చేసినా... ఒత్తిడి, అలసట కారణంగా బరువు పెరుగుతారు. కార్డియో, స్ట్రెంథ్ ట్రైనింగ్ వంటి వ్యాయామాలు కచ్చితంగా మీ డైలీ రొటీన్‌లో చేర్చుకోండి.



బెల్లంకొండ 'హైందవ' విడుదలకు బ్రేక్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త జంటగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'హైందవ' విడుదల వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ మూన్‌షైన్ పిక్చర్స్ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా ఈ ఏడాది నవంబర్ 27న థియేటర్లలో విడుదల కావాల్సి ఉంది. అయితే అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ప్రేక్షకులకు ఒక మంచి సినిమాటిక్ అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే విడుదల తేదీని వాయిదా వేస్తున్నట్లు నిర్మాతలు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని పేర్కొంటూ, ప్రేక్షకుల సహనానికి, నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. గత నెలలో విడుదలైన ఈ సినిమా టీజర్‌కు సినీ ప్రియుల నుంచి విశేష స్పందన లభించింది. రంగాపురం అనే గ్రామ నేపథ్యంలో సాగే ఈ మిస్టరీ థ్రిల్లర్ కథాంశం ఆసక్తిని రేకెత్తిస్తోంది. గ్రామంలోని ఒక పురాతన ఆలయంలోని విగ్రహాలన్నీ మాయమవడం, అదే సమయంలో ఒక గ్రామస్థుడు హత్యకు గురికావడంతో కథ మలుపు తిరుగుతుంది. అయితే నిర్ణీత గడువులోగా ఆ విగ్రహాలన్నీ తిరిగి వస్తాయని ఆలయ పూజారి విశ్వసిస్తుంటారు. ఈ వింత కేసును దర్యాప్తు చేసేందుకు దేవుడి కంటే మానవత్వాన్ని నమ్మే ఒక నాస్తికుడైన పోలీసు అధికారి రంగంలోకి దిగడంతో నమ్మకానికి, హేతువాదానికి మధ్య జరిగే ఆసక్తికరమైన సంఘర్షణతో ఈ చిత్రం సాగనుంది.



అనిరుధ్, కావ్య మారన్ వివాహ వేడుక

ప్రముఖ మీడియా దిగ్గజం సన్ గ్రూప్ తన కీలక ఉద్యోగులకు అదిరిపోయే కానుకలతో సర్‌ప్రైజ్ ఇచ్చింది. అనిరుధ్ మరియు కావ్య వివాహ రిసెప్షన్ విందు ఆహ్వాన పత్రికలతో పాటు సంస్థలోని ముఖ్య ఉద్యోగులకు బంగారు ఉంగరాలు, బంగారు నాణేలు, నూతన వస్త్రాలు మరియు స్వీట్లను సన్ గ్రూప్ యాజమాన్యం కానుకగా అందజేసింది. ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు (1:00 PM) చెన్నైలోని సన్ టీవీ ప్రధాన కార్యాలయంలో అనిరుధ్, కావ్యల వివాహ రిసెప్షన్ విందు వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ శుభకార్యానికి హాజరుకావాలని ఆహ్వానిస్తూ ఉద్యోగులకు ఇలా విలువైన బంగారు కానుకలు, కొత్త బట్టలు పంపడం పట్ల సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వివాహ ఆహ్వానం మరియు బహుమతులకు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.



'రాజు వెడ్స్ రాంబాయి'

తెలుగు సినీ చరిత్రలో వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కి, ప్రేక్షకుల గుండెలను బరువెక్కించిన అద్భుతమైన గ్రామీణ ప్రేమకావ్యం 'రాజు వెడ్స్ రాంబాయి' విడుదలై నేటితో (నవంబర్ 21) సరిగ్గా ఏడాది పూర్తి చేసుకుంది. అయితే ఈ మైలురాయిని పురస్కరించుకుని, ఈ చిత్రానికి సమర్పకుడిగా, నిర్మాతగా వ్యవహరించిన ప్రముఖ దర్శకుడు వేణు ఊడుగుల సోషల్ మీడియా వేదికగా ఎమెషనల్ అయ్యాడు. సాధారణంగా ఏ సినిమాకైనా తెరపై కనిపించే ఒక కథ ఉంటుందని, కానీ చాలా అరుదుగా కొన్ని చిత్రాలకు మాత్రమే తెరవెనుక కూడా అంతకుమించిన మరో కథ ఉంటుందని వేణు ఊడుగుల అభిప్రాయపడ్డారు. తన జీవితంలో 'రాజు వెడ్స్ రాంబాయి' అలాంటి ఒక ప్రత్యేకమైన అనుభూతి అని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా ఏడాది క్రితం థియేటర్లలో అడుగుపెట్టిన ఈ చిత్రం తనకు జీవితాంతం గుర్తుండిపోయే ఎన్నో అనుభవాలను, మధురమైన జ్ఞాపకాలను అందించిందని ఆయన ఎమోషనల్ అయ్యారు. ఈ అద్భుతమైన ప్రయాణం సాధ్యం కావడానికి ప్రధాన కారణమైన ఈటీవీ విన్ సంస్థకు, అలాగే ఈ సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు, చిత్రబృందంలోని ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా ప్రేమతో కృతజ్ఞతలు తెలియజేశారు.



అంధురాలి పాత్రలో ప్రియాంక!

అందం, అభినయంతో వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ దక్షిణాది సినీపరిశ్రమలో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు అందాల తార ప్రియాంక అరుళ్ మోహన్. తనదైన నటనతో ఆకట్టుకుంటూ అగ్రతారల సరసన నటించే అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ఆమె.. ఎంఎస్ ఆనందన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఏజీఎస్ 29' (వర్కింగ్ టైటిల్) అనే తమిళ చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తుంది. జై, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శుక్రవారం ప్రియాంక పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఈ నేపథ్యంలో ఆమెకు 'పుట్టిన రోజు శుభాకాంక్షల'ని తెలుపుతూ బ్రెయిలీలో రాసిన వ్యాఖ్యను జోడించారు. ఈ చిత్రంలో ప్రియాంక అంధురాలి పాత్రను పోషించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె.. కవిన్ సరసన ఓ చిత్రం, '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్', తెలుగులో రవితేజ హీరోగా తెరకెక్కుతున్న 'తులాభారం' లాంటి పలు చిత్రాలతో సెట్స్‌పై బిజీగా ఉన్నారు. ఈ ఏడాది 'మేడ్ ఇన్ కొరియా'లో కనిపించారామె.



'సిరాజ్' అంశం.. మనం మాట్లాడొద్దు: కపిల్ దేవ్

భారత క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు కివీస్‌తో తొలి టెస్టు తుది జట్టులో చోటు కల్పించకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. దీనిపై పలువురు మాజీలు విశ్లేషణలతో పాటు అసంతృప్తినీ వ్యక్తం చేశారు. కానీ, ఓ కాంగ్రెస్ ఎంపీ చేసిన మతపరమైన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. దానికి భాజపా కూడా గట్టిగానే కౌంటర్ వేసింది. తాజాగా ఓ కార్యక్రమంలో క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ ఎదుట ఇదే ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన స్పందిస్తూ.. ఇలాంటి వాటిపై ఎవరూ మాట్లాడొద్దని సూచించారు.

"సిరాజ్‌ను ఎందుకు పక్కన పెట్టారనేది సెలక్టర్లను అడగండి. అది చెప్పడానికి నేనెవర్ని..? ప్రజలు కూడా ఇలాంటి వాటిపై కామెంట్లు చేయకూడదు. జట్టు ఎంపిక కోసం ఓ వ్యవస్థ ఉంది. ఆ బాధ్యతలను నిర్వర్తిస్తోన్న వ్యక్తులు ఉన్నారు. వారే స్పష్టమైన సమాధానం ఇస్తారు. ఇక్కడ ప్రతి ఒక్కరినీ సంతోషపరచడం సాధ్యం కాదు. అందుకే, వ్యవస్థను విమర్శించడం సరికాదు. మనం మంచి సిస్టమ్‌ను తయారు చేసుకున్నాం. భారత క్రికెట్ బాగా సాగుతోంది. నాకూ సిరాజ్ అంటే ఇష్టమే. కానీ, సెలక్టర్లు, మేనేజ్‌మెంట్, కెప్టెన్ భిన్నంగా ఆలోచిస్తారు. జట్టు కూర్పు కోసం అవసరమైన మార్పులు చేసుకుంటారు. అందులో మన ఇష్టాయిష్టాలు విషయమే కాదు" అని కపిల్ వెల్లడించారు.

సచిన్‌కీ తప్పలేదు: కైఫ్

"జట్టులో మార్పులు చేయడం అత్యంత సహజం. ఒకటీ లేదా రెండు మ్యాచుల్లో విఫలమైతే పక్కన పెడతారు. సచిన్ తెందుల్కర్‌కూ ఇది తప్పలేదు. కుల్‌దీప్, అశ్విన్, రోహిత్, విరాట్, సూర్య, షమీ.. ఇలా ఈ జాబితా చాలానే ఉంటుంది. ఇక్కడ సీనియర్లు అనేది విషయమే కాదు. సీనియర్ అయినంత మాత్రాన ఇప్పుడు ఏం చేస్తున్నామనేదే ముఖ్యం. గత సిరీస్‌లో ఎలా ఆడారనేదానిపైనే మేనేజ్‌మెంట్ ఫోకస్ చేస్తుంది. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో సిరాజ్ గొప్ప ప్రదర్శనే చేయలేకపోయాడు" అని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ గుర్తు చేశాడు.



అతడికే లేదు.. ఇప్పటికిప్పుడు సూర్య భాయ్‌కి ప్లేస్ కష్టమే!

భారత్‌కు టీ20 ప్రపంచ కప్ అందించిన సారథిగా సూర్యకుమార్ యాదవ్ చరిత్రలో నిలిచిపోయాడు. కానీ, గత వరల్డ్ కప్ తర్వాత నుంచి టీమ్‌ఇండియాలో చోటు దక్కడం లేదు. ఫామ్ కోల్పోయి ఇబ్బందుల్లో పడ్డాడు. అయితే, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో వరుసగా హాఫ్ సెంచరీలతో సూర్య మళ్లీ ఫామ్‌లోకి వచ్చేశాడు. మరి జాతీయ జట్టులోకి వచ్చేస్తాడా? అంటే ఇప్పుడే చెప్పలేని పరిస్థితి. ఇక్కడ తీవ్రమైన పోటీ ఉండటమే అందుక్కారణం. తాజాగా బీసీసీఐ వర్గాలు కూడా ఇదే మాట చెబుతున్నాయి. "ప్రస్తుతానికైతే సూర్య మా ఎంపిక ప్రణాళికల్లో లేడు. ఇప్పటికీ యశస్వి జైస్వాల్‌కే పరిమిత ఓవర్ల క్రికెట్ జట్టులో చోటు కల్పించలేకపోతున్నాం. సూర్యకుమార్ దేశవాళీలో బాగా ఆడుతున్నాడు. అందులో ఎలాంటి సందేహం లేదు. ఇప్పుడు భారత జట్టులో అతడికి ఎక్కడ చోటు కల్పించాలనేదే పెద్ద ప్రశ్న. ప్రస్తుతం జట్టులో ఎక్కడా స్థానం ఖాళీగా లేదు. మొదట్లో దూకుడుగా ఆడిన యశస్విని ఇప్పుడు టెస్టులకే పరిమితం చేయాల్సి వచ్చింది. వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ ఆటతీరుతో యశస్విని పక్కన పెట్టాల్సి వచ్చింది. మిడిలార్డర్‌లోనూ తీవ్రమైన పోటీ నెలకొంది" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. గత వారం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్‌పై సూర్యకుమార్ కేవలం 21 బంతుల్లోనే 60 పరుగులు చేశాడు. ఆ తర్వాత గుజరాత్‌పైనా 29 బంతుల్లో 82 పరుగులు చేసి సత్తా చాటాడు. దీంతో 199 పరుగుల టార్గెట్‌ను ముంబయి కేవలం 15.4 ఓవర్లలోనే ఛేదించింది.



ఆ పరీక్షలు.. మహిళల పై 'తీవ్రమైన హింసే'

మరో రెండేళ్లలో లాస్ ఏంజెలెస్ వేదికగా ఒలింపిక్స్ జరగనున్నాయి. గత ఎడిషన్ సమయంలో అల్జీరియా బాక్సర్ ఇమానె ఖెలిఫ్ అంశం తీవ్ర స్థాయిలో వివాదంగా మారిన సంగతి తెలిసిందే. ఇమానె ఖెలిఫ్‌లో పురుష లక్షణాలు అధికంగా ఉన్నాయనే కారణంతో ఇటలీ బాక్సర్ పోటీ నుంచి వైదొలగడంతో తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో మహిళల బాక్సింగ్‌లో పురుషులను ఎలా ఆడిస్తారని ఏకంగా అప్పటి ఇటలీ ప్రధాని నుంచే కామెంట్లు వచ్చాయి. సహచర బాక్సర్లూ అదే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఇకపై అంతర్జాతీయ టోర్నీలో లింగపరమైన వివాదాలు తలెత్తకుండా.. ఈ ఏడాది మార్చిలో అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా అథ్లెట్లు తప్పనిసరిగా కెరీర్‌లో ఒక్కసారైనా జన్యుపరమైన టెస్టులు చేయించుకోవాలని.. అప్పుడే పోటీలకు అర్హత లభిస్తుందని స్పష్టం చేసింది. అయితే, దీనిపై తాజాగా ఫ్రాన్స్ క్రీడల మంత్రి మరినా ఫెరారీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 2028 ఒలింపిక్స్‌కు ముందే ఈ నిబంధనలను పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

"ఈ అంశంపై ఐఓసీ వెనక్కి తగ్గుతుందో లేదో ఇప్పుడే చెప్పలేను. కానీ, అలా జరుగుతుందని మాత్రం ఆశిస్తున్నా. మరోవైపు అనేక అంతర్జాతీయ సమాఖ్యలు ఇప్పటికే ఈ నిబంధనలను అమలు చేయడం ప్రారంభించాయి. అందుకే, దీనిపై ఐఓసీ వెంటనే స్పష్టత ఇవ్వాలి. టెన్నిస్ అసోసియేషన్ కూడా తప్పనిసరిగా ఈ టెస్టులు చేయించుకోవాలని చెబుతోంది. ఫ్రెంచ్ మహిళా టెన్నిస్ ప్లేయర్లలో 60 శాతం మంది జన్యు పరీక్షలను వ్యతిరేకించారు.



ఈ కొత్త నిబంధన.. మహిళలపై తీవ్రమైన హింస లాంటిదే. స్పష్టమైన వివక్షగానే దీన్ని మేం పరిగణిస్తాం. నా దృష్టిలో మహిళా హక్కుల విషయంలో ఇది తిరోగమనంలాంటిదే. 2030లో మేం వింటర్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చే సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందా? అని ఆలోచిస్తున్నా. ఇప్పటికే ఈ అంశంపై యూరోపియన్ యూనియన్ మీటింగ్‌లో ప్రస్తావించా. ప్రతి ఒక్కరిలోనూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. మహిళా అథ్లెట్ల ఆందోళనను వారి దృష్టికి తీసుకెళ్లా. ఇదే పరిస్థితి కొనసాగితే.. యువ అథ్లెట్లు క్రీడల్లో పాల్గొనడంపై ప్రభావం పడుతుంది" అని ఫెరారీ స్పష్టం చేశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314